ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
6-5-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 94 పేజీలు: 12 వెల: 6.50

విదేశాల్లో నిర్మించే సినిమాలపై 100% సుంకం: ట్రంప్

స్వల్పశ్రేణి క్షిపణి పరీక్షించిన పాకిస్థాన్

9లో

## అకాల వర్ష బాధితులైన రైతులను ఆదుకుంటాం

- పిడుగుపడి మృతిచెందిన వారికీ సాయం
- రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలి
- మరో రెండు రోజులు అప్రమత్తం
- 2224 హెక్టార్లలో వరి, 138 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు


సోమవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే5,ప్రభాతవార్తప్రతినిధి:** అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు రేపు సాయంత్రంలోగా పరిహారం అందజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. పంటనష్టాన్ని వెంటనే అంచనా వేసి నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా పిడుగుపాటుకు గురై చనిపోయిన 8 మంది బాధితుల కుటుంబాలకు పరిహారం కూడా తక్షణమే అందించాలని ఆదేశించారు. గత రెండు రోజుల పాటు రాష్ట్రంలో కురిసిన వర్షాలపై సిఎం చంద్రబాబు సచివాలయంలో వ్యవసాయ, విపత్తుల నిర్వహణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు జిల్లా కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో జరిగిన పంట, ప్రాణ నష్టం గురించి అడిగి సిఎం వివరాలు తెలుసుకున్నారు. జిల్లాల్లో అకాల వర్షాలు, ప్రస్తుత పరిస్థితులను గురించి సిఎంకు కలెక్టర్లు వివరించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ.రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఇంకా వర్ష సూచన ఉన్నందున కలెక్టర్లు, అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రాణనష్టం వాటిల్లకుండా చర్యలుతీసుకోవాలన్నారు. పిడుగులు పడి చనిపోయిన పశువులకు కూడా నిబంధనల మేరకు పరిహారం వెంటనేవిడుదల చేయాలన్నారు.

**2,224 హెక్టార్లలో వరిపంట నష్టం**

అకాలవర్షాలతో 2,224 హెక్టార్లలో వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు అధికా >>2

## భారత్‌కు రష్యా మద్దతు



### ప్రధాని మోడీతో ఫోన్‌లో మాట్లాడిన పుతిన్

**మాస్కో, మే 5:** భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోడీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ కాల్ చేశారు. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. అలాగే ఉగ్రవాదంపై భారత్ జరుపుతోన్న పోరాటంలో తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఉభయ దేశాల మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని మోడీ, పుతిన్ పునరుద్ఘాటించారు. ఈ నెల 9న రష్యా విక్టరీ డేను నిర్వహించుకోనుంది. దీనిపై రష్యా అధ్యక్షుడికి మోడీ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఈ యేడాది రెండు దేశాల మధ్య వార్షిక సదస్సు భారత్‌లో నిర్వహించనున్నారు. అందుకోసం మన ప్రధాని ఆహ్వానం పలకగా.. పుతిన్ అంగీకరించారు. ఈ విషయాలను మన విదేశాంగ శాఖ వెల్లడించింది.

పహల్గాంలోని బైసరన్ లోయలో గత నెల 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి తాము బాధ్యులమని పాక్ కేంద్రంగా ఉన్న లష్కరే తోయిబాకు చెందిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' బాధ్యత >>2

## సింహాచలం దుర్ఘటన: ఏడుగురు అధికారుల సస్పెన్షన్

**విజయవాడ,మే5,ప్రభాతవార్తప్రతినిధి:** సింహాచలం దేవస్థానం దుర్ఘటనపై కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని నిర్ధారించిన కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దేవాదాయ, పర్యాటక శాఖకు చెందిన ఏడుగురు అధికారుల సస్పెన్షన్‌కు ఆదేశించింది. కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టాలని ప్రభుత్వ నిర్ణయించింది. కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణతో పాటు, ఇద్దరు అధికారులపై క్రిమినల్ చర్యలకు నిర్ణయం తీసుకుంది.

సింహాచలం దేవస్థానం ఇఇ సుబ్బారావు, ఇఇ శ్రీనివాసరాజు, ఎపిటిడిసి ఇఇ రమణ, సింహాచలం దేవస్థానం డిప్యూటీ ఇఇ కెఎస్ఎన్ మూర్తి, ఎపిటిడిసీ డిప్యూటీ ఇఇ ఎబివిఎల్ఆర్ స్వామి, ఎపిటిడిసీ ఎఇ మదన్ మోహన్, సింహాచలం దేవస్థానం జెఇ బాబ్జీలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

సింహాచలంలో గోడకూలిన ఘటనపై త్రిసభ్య కమిషన్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. కమిషన్ చైర్మన్, పురపాలక >>2

## 'గ్రీన్ ఎనర్జీ'లో భారీగా ఉపాధి కల్పన

- రాష్ట్రంలో 20 చోట్ల అత్యాధునిక ష్నైడర్ శిక్షణ కేంద్రాలు
- అనంతపురంలో పరిశోధన కేంద్రం
- మంత్రి లోకేష్ సమక్షంలో ష్నైడర్ ఎలక్ట్రిక్ ఒప్పందం


సోమవారం మంత్రి నారా లోకేష్ సమక్షంలో ష్నైడర్‌తో ఎపిఎస్ఎస్డీసి అవగాహన ఒప్పందంచేసుకుంటున్న దృశ్యం

**విజయవాడ,మే5,ప్రభాతవార్తప్రతినిధి:** ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకొని యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంగా నైపుణ్య శిక్షణ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడానికి రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చొరవతో ఏపి ప్రభుత్వం, ష్నైడర్ ఎలక్ట్రిక్ నడుమ ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఏపిఎస్ఎస్‌డిసి), ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు ఎంఓయుపై సంతకాలు చేశారు. ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందుపుచ్చుకునేందుకు ప్రతిభావంతులైన బృందాలను తయారు చేయడమే ఈ ఒప్పందం లక్ష్యం. ఒప్పందం ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మార్చి, 2027వరకు ప్రభుత్వ ఐటిఐలు, పాలిటెక్నిక్ కళాశాలలు, శిక్షణా కేంద్రాల్లో 20 అధునాతన ట్రైనింగ్ ల్యాబ్‌లను ఏర్పాటుచేస్తారు. ఈ ల్యాబ్‌లు అత్యాధునిక విద్యుత్, సౌరశక్తి వ్యవస్థలు, పారిశ్రామిక ఆటోమేషన్ పరికరాలను కలిగి ఉంటాయి. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రపంచస్థాయి ప్రమాణాలతో 9వేల మంది యువతకు శిక్షణ ఇస్తారు. శిక్షణా పరికరాలు, వినియోగ వస్తువులు, డిజిటల్ సామగ్రి కోసం ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ సుమారు రూ. 5కోట్లు ఖర్చుచేస్తుంది. శిక్షణ పొందిన అభ్యర్థులకు ప్లేస్‌మెంట్ మద్దతు కూడా ఫౌండేషన్ అందిస్తుంది.

మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి మేరకు రూ.15 కోట్ల అంచనాతో మంగళగిరిలో ష్నైడర్ ఎలక్ట్రిక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు కు కంపెనీ అంగీకారం తెలిపింది. అనంతపురంలో ష్నైడర్ ఎలక్ట్రిక్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుచేయనున్నారు, అల్లూరి సీతారామ రాజు జిల్లాలో ష్నైడర్ ఎలక్ట్రిక్ మోడ్రన్ పవర్ ఆప్టిమైజేషన్ పైలెట్ ప్రాజెక్టు నిర్వహించనున్నారు. స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ మౌలిక సదుపాయాలను కల్పించి విద్యార్థులను శిక్షణ కార్యక్రమాలపై చైతన్యవంతం చేస్తుంది. శిక్షణ కార్యక్రమాల కోసం 4 న్యాక్ సెంటర్లు (అమరావతి, కుప్పం, డిజిటల్ కమ్యూనిటీ భవన్‌శిలీ లంక, చిత్తూరు), 9ప్రభుత్వ ఐటిఐలు (అరకు, రాజమండ్రి (బాలికలు), నర్సీపట్నం,నూజివీడు, ఒంగోలు (బాలుర), ఎ.ఎస్. పేట, కార్వేటినగరం (బాలికలు), కడప (మైనారిటీలు),(శ్రీశైలం), 7ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు (శ్రీకాకుళం, గుంటూరు, >>2

## నేడు ఎపి ఇసెట్ పరీక్ష

### ఒక్క నిముషం ఆలస్యమైనా అనుమతి లేదు

**అనంతపురం సిటీ, మే 5 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో జెఎన్‌టియుఎ నిర్వహిస్తున్న ఎపిఇసెట్-2025 పరీక్ష మంగళవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు జెఎన్‌టియుఎ విసి, ఎపిఇ సెట్ చైర్మన్ సుదర్శన్‌రావు పేర్కొన్నారు. జెఎన్‌టియుఎ సమావేశ మందిరంలో సోమవారం జెఎన్‌టియుఎ విసి సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, పిఆర్‌ఒ ఓం ప్రకాష్‌తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విసి సుదర్శన్ రావు మాట్లాడుతూ.. ఎపిఇ సెట్ 2025 పరీక్షల నిర్వహణకు 110 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, ఇందులో ఒకటి హైదరాబాద్‌లో ఏర్పాటు చేశామన్నారు. పరీక్షకు హాజరయ్యే ప్రతి విద్యార్థి తప్పనిసరిగా నిబంధనలను పాటించాలన్నారు. ప్రధానంగా ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబడదని గుర్తుంచుకోవాలన్నారు. రెండు సెషన్‌లలో పరీక్షను నిర్వహించడం జరుగుతుందని, ఉదయం 9 :00 నుంచి మధ్యాహ్నం 12:00 వరకు ఒక సెషన్, >>2

## నేడు, రేపు కోస్తా జిల్లాల్లో వానలు

**విజయవాడ,మే5,ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమ బెంగాల్ నుండి ఒడిశా తీరం మీదుగా ఉత్తర కోస్తా(ఏపీ)వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో కోస్తా జిల్లాల్లో కొన్ని చోట్ల సోమవారం అక్కడక్కడ వానలు పడ్డాయి. మంగు(ముసురు) వాతావరణం పలుప్రాంతాల్లో ఉన్నాయి.దాంతో నిన్నటి భారీ వానకు పంటలు దెబ్బతిన్న రైతులు ఆందోళనకు గురయ్యారు. అయితే వానలు పడకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.అయితే మంగళ,బుధవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో భారీ వర్షాలు,మిగిలిన చోట తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని తెలిపింది.

## కౌలు రైతులకూ 'అన్నదాత సుఖీభవ'

### స్పష్టం చేసిన వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ,మే5,ప్రభాతవార్తప్రతినిధి:** సొంత భూమి ఉన్న రైతులే కాదు, కౌలు రైతులకూ అన్నదాత సుఖీభవ పథకం కింద సాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని వ్యవసాయ శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు స్పష్టం చేసారు. ఒక్కో రైతు కుటుంబానికి 3 విడతల్లో రూ.20 వేల చొప్పున అందజేయ నున్నట్లు వివరించారు.ఇందుకు సంబంధించి కీలకంశాలను కచ్చితంగా పాటించాలన్నారు. వాటన్నింటిని ఆయన వ్యవసాయశాఖ ద్వారా విడుదల చేసిన సమాచార పత్రంలో వివరించారు.. పీఎం కిసాన్ కింద ఇచ్చే రూ.6 వేలతో కలిపి ఈ మొత్తాన్ని జమ చేయనుంది. అటవీ భూములపై హక్కు కలిగిన వారినీ అర్హులుగా గుర్తించనుంది. వ్యవసాయ ఉద్యాన పట్టు సహాయకులతోపాటు తహసీల్దారు మండల వ్యవసాయాధికారి తమ పరిధిలోని రైతుల వివరాలను పరిశీలించి ధృవీకరించి అర్హుల జాబితాలను ఈ నెల 20 లోగా అన్నదాత సుఖీభవ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించింది. పథకం అమలుకు సంబంధించి వ్యవసాయ శాఖ తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. భర్త భార్య పిల్లలతో కూడిన కుటుంబం యూనిట్‌గా పథకం అమలు చేయనుంది. పిల్లలకు వివాహమైతే వారిని ప్రత్యేక యూనిట్‌గా పరిగణించి సాయం అందిస్తారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టుకు సంబంధించిన పంటల సాగుదారులకూ >>2

## రేపు రాష్ట్రాల్లో 'మాక్ డ్రిల్స్'

### భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ కీలక ఆదేశాలు

### యుద్ధ సన్నద్ధతకు సంకేతాలు!




**న్యూఢిల్లీ:** పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్తాన్‌తో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో మే 7న మాక్ డ్రిల్‌లు నిర్వహించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలను కోరింది. ఈ డ్రిల్ సమయంలో తీసుకోవలసిన చర్యలలో వైమానిక దాడుల హెచ్చరిక సైరన్‌లను అమలు చేయడం, శత్రు దాడి జరిగినప్పుడు తమను తాము రక్షించుకోవడానికి పౌర రక్షణ అంశాలపై పౌరులకు శిక్షణ ఇవ్వడం వంటివి ఉన్నాయి. క్రాష్ బ్లాక్‌అవుట్ చర్యలు, కీలకమైన ప్లాంట్లు మరియు సంస్థాపనలను ముందస్తుగా మభ్యపెట్టడం మరియు తరలింపు ప్రణాళికలను నవీకరించడం మరియు వాటి రిహార్సల్ వంటి ఇతర చర్యలు ఉన్నాయి. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది పౌరులు, ఎక్కువగా పర్యాటకులు మరణించడంతో, భారతదేశం ప్రతిఘటనల కోసం తన ఎంపికలను పరిశీలిస్తున్నందున, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉన్నత స్థాయి రక్షణ అధికారులతో సహా ఉన్నత స్థాయి సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా హోంశాఖ అన్ని రాష్ట్రాల్లో మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని ఆదేశించింది. ఈనెల 7వ తేదీ ఈ డ్రిల్ >>2

## లిక్కర్ కేసు: ముగ్గురు నిందితులకు చుక్కెదురు

**విజయవాడ,మూ5,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి లిక్కర్ కేసులో ముగ్గురు నిందితులకు సుప్రీంలో ఎదురు దెబ్బతగిలింది. వారికి ముందస్తు బెయిల్ ఇవ్వడానికి సుప్రీం కోర్టు అంగీకరించలేదు. ఈ కేసులో నిందితులుగా అభియోగాలు ఎదుర్కొంటున్న కృష్ణమోహనరెడ్డి, ధనుంజయ రెడ్డి, బాలాజీ గోవిందప్పకు మధ్యంతర ఉపశమనానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. తమకు ఈకేసులో సంబంధంలేకున్నా ఇరికించారని వీరు అత్యున్నత న్యాయస్థానంలో తమ న్యాయవాదుల ద్వారా వాదించారు. కేసుపై హైకోర్టులో 7వ తేదీన విచారణ ఉన్నందున జోక్యం చేసుకోవడానికి సుప్రీం కోర్టునిరాకరించింది. ఈ కేసుతదుపరి విచారణ 8వ తేదీకి సుప్రీం కోర్టు వాయిదా వేసింది.అదే రోజు మిథున్‌రెడ్డి బెయిలుపైన విచారణ చేస్తామని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

## సంతృప్తి పెంచే పథకాలు అమలు

### యేడాదిలో 5 లక్షల ఉద్యోగాలు కల్పించే ప్రాజెక్టు: మంత్రి పార్థసారథి

**సచివాలయం,మే 5,ప్రభాతవార్త :** ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా ప్రభుత్వపథకాల అమలు తీరును మెరుగు పరిచేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల,గృహ నిర్మాణ శాఖమంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రజలు సంతృప్తి,ప్రభుత్వ సేవలను ఎంత మెరుగ్గా అందించబడుతున్నాయి అనే ఆలోచనలతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఆర్టీజిఎస్,ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరుపై ముఖ్యమంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు.అధికారులు ప్రజలను ఏ విధంగా అయిన ఇబ్బందులకు గురిచేస్తున్నారాఅనే పలు అంశాలపై ఐవిఆర్ఎస్, ఇతర మార్గాల ద్వారా కొన్ని వేలమంది లబ్దిదారులను ఇంటర్వ్యూ చేసి నివేదికలను సేకరించడం జరుగుతుందన్నారు.గత కొన్ని మాసాలుగా సేకరించిన నివేదికలను పరిశీలిస్తే ప్రజల సంతృప్తి స్థాయి క్రమేణా పెరుగుతూ వస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాజకీయ దృక్కోణంలో కొంతమంది లబ్ధిదారుల ప్రవర్తన ఏ విధంగా ఉన్నా సరే,వారిని శాంతపరుస్తూ వారి సంతృప్తి స్థాయిని కూడా మెరుగుపర్చాల్సిన బాద్యత అధికారులపై ఉందని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.



**ప్రాజెక్టు 5.00లక్షలు**

దేశంలో ఎక్కడా లేని విధంగా ఐదేళ్ళలో 20లక్షల ఉద్యోగాలను సృష్టించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని,ఆ >>2


## పిల్లల పుస్తకాల మోత బరువు తగ్గింపు!

### ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు

**విజయవాడ.మే5,ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి రూపు మారిన కొత్త పాఠ్యపుస్తకాలు మండల విద్యా వనరుల కేంద్రాలకు చేరాయి. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత చిన్నారుల పుస్తకాల సంచి (బ్యాగ్) బరువును తగ్గిస్తామని యువగళం పాదయాత్ర సందర్భంగావిద్యాశాఖమంత్రి లోకేశ్‌హామీ ఇచ్చారు. అన్నట్లు అధికారంలోకి రాగానే ఆ దిశలో లోకేష్ చర్యలు తీసుకున్నారు.వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు పుస్తకాల బరువును తగ్గించేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. సెమిస్టర్ల వారీగా అన్ని పుస్తకాలను కలిపి ఒకే పాఠ్యపుస్తకంగా తీసుకురావాలని నిర్ణయించింది. అందులో >>2

6-5pg2exHMNWJQE.qxd:6-5pg2exHMNWJQE.qxd 06/05/25 12:02 AM Page 1





జపాన్ రక్షణ మంత్రి జనరల్ నకటని సోమవారం న్యూఢిల్లీలో రక్షన మంత్రి రాజ్‌నాథ్‌తో భేటీ దృశ్యం

# పథకాలు అమలు

>>లక్ష్య సాధనలో భాగంగా ఏడాది కాలంలో 5లక్షల ఉద్యోగాలను సృష్టించాలనే లక్ష్యంతో ప్రాజెక్టు 5.00 లక్షల వినూత్నమైన కార్యాచరణను ప్రభుత్వం రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.
రాష్ట్రంలోని గ్రాడ్యుయేట్స్ అందరికి ఒక స్కిల్ టెస్టు పెట్టి వారి స్కిల్స్‌ను అంచనా వేసి,అందుకు తగ్గట్టుగా వారికి రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న మరియు భవిష్యత్తులో పరిశ్రమల్లో ఉద్యోగ,ఉపాధి అవకాశాలను కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. అయితే సైన్స్,ఇతర విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ అందజేయాల్సిన అవసరాన్ని గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఇందుకై రియల్ టైమ్ ఎక్స్‌ట్రాక్షన్ ఆఫ్ జాబ్ డాటా యూజింగ్ యాప్స్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిపారు.

**రియల్ టైమ్ గవర్నెన్సు ధరఖాస్తులు సకాలంలో పరిష్కారం...**

రియల్ టైమ్ గవర్నెన్సు,వాట్సాయాప్ గవర్నెన్సు అంశాలపై కూడా ముఖ్యమంత్రి సమీక్షించడం జరిగిందని,జనవరి 30నుంచి ఏప్రిల్ 25మధ్యకాలంలో దాదాపు 73.1లక్షల ధరఖాస్తులు అందాయని,వాటిలో 36.38లక్షల దరఖాస్తులను విజయవంతంగా పరిష్కరించడం జరిగిందని మంత్రి తెలిపారు.వారానికి దాదాపు 7లక్షల దరఖాస్తులు వస్తున్నాయని,వాటిలో 50శాతం వరకు విజయవంతంగా పరిష్కరించడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

**రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలి**

ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రైతులు ఎవరూ ఆందోళన చేందాల్సిన పనిలేదని,రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేసినట్లు మంత్రి తెలిపారు.అన్నిజిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి విడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆదివారం కురిసిన వర్షం వల్ల ఏమైనా పంట,ఆస్తి,ప్రాణ నష్టాలు జరిగినట్లయితే మంగళవారానికల్లా సంబంధిత నివేదికను ప్రభుత్వానికి పంపాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు.విపత్తుల నిర్వహణ నియమ నిబంధనల మేరకు మానవ,పశు నష్టాలకు సంబందించి నష్టపరిహారాన్ని వెంటనే అందజేయాలని విపత్తుల నిర్వహణ సంస్థను ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు.

# నేడు ఎపి ఇసెట్ పరీక్ష

>> మధ్యాహ్నం 2:00 నుంచి సాయంత్రం 5:00 వరకు రెండో సెషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అరగంట ముందుగానే పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులు చేరుకోవాలన్నారు. అదే విధంగా ప్రతి అభ్యర్థి డౌన్‌లోడ్ చేసిన దరఖాస్తు ఫారం, బ్లూలేదా బ్లాక్ పాయింట్ పెన్ను, ఐడెంటీ కార్డును తీసుకెళ్లాలని ఇందులో ఏ ఒక్కటి లేకుండా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరన్నారు. అదే విధంగా ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకెళ్లరాదని సూచించారు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు. పరీక్ష పూర్తి అయ్యే వరకు ఎట్టిపరిస్థితుల్లోనూ అభ్యర్థులను బయటకు పంపడం ఉండదని గుర్తించాలన్నారు.

# అధికారుల సస్పెన్షన్

>> శాఖ కార్యదర్శి సురేశ్ కుమార్ సిఎం చంద్రబాబుకు ప్రాథమిక నివేదిక అందించారు. ఏప్రిల్ 30 తేదీన చందనోత్సవం రోజు భారీ వర్షానికి సింహాచలంలో గోడకూలిన దుర్ఘటనలో ఏడుగురు భక్తులు మృతి చెందారు.తాత్కాలికంగా నిర్మించిన గోడకు పునాది కూడా లేదని కమిషన్ ప్రాథమిక నివేదికలో పేర్కొంది. భారీ వర్షం కారణంగా పెద్ద ఎత్తున నీరు, బురద చేరి బరువు కారణంగా గోడ కూలినట్టు కమిషన్ అభిప్రాయపడింది. గోడ దిగువకు నీరు వెళ్లేందుకు లీప్ హోల్స్ కూడా లేవని నివేదికలో వెల్లడించారు.

# రేపు రాష్ట్రాల్లో 'మాక్ డ్రిల్స్'

>> నిర్వహించాలని సూచించింది. 1971 యుద్ధసమయంలోనే ఇలాంటి మాక్‌డ్రిల్ నిర్వహించింది. వైమానిక దాడుల హెచ్చరిక సైరన్లు, పౌరులు, విద్యార్థులకు స్వీయరక్షణలో శిక్షణ ఇవ్వడం, క్రాష్ బ్లాక్‌ఔట్ కార్యాచరణ, యుద్ధ సన్నద్ధత చర్యల్లో ముందుగానే ఆప్రాంతాలనుంచి పౌరులను ఖాళీచేయించడం వంటి రిహార్సల్స్ నిర్వహించాలని సూచించింది. ఇప్పటికే పాకిస్థాన్ సరిహద్దుల్లో కాల్పుల విరమణను ఉల్లంఘించిందని, సరిహద్దుల్లోని భారత్ చెక్‌పోస్టులపై కాల్పులుజరుపుతున్నదని అధికారులు గుర్తించారు. అయితే అందుకు ధీటుగా భారత బలగాలు కూడా స్పందించినట్లు తేలింది. గడచిన 11 రోజులుగా ఇలా కాల్పులకు తెగబడుతోంది. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌ప్రాంతంలో రాత్రివేళల్లో పూర్తిగా లైట్లను కూడా ఆర్పివేసారు. పంజాబ్ రాష్ట్ర విద్యుత్‌కార్పొరేషన్‌కు విన్యాసాల సమయాల్లో కరెంట్ కట్‌చేయాలని లేఖలురాసారు.ప్రధానిమోడీ ఇప్పటికే త్రివిధ దళాధిపతులతోసమావేశం నిర్వహించారు. హోం, రక్షణశాఖ మంత్రులతో భేటీ అయ్యారు. ఎన్ఎస్ఎ అజితధోబాల్‌తో కూడా చర్చలుజరిపారు. తాజాగా రక్షణశాఖ కార్యదర్శి రాజేష్‌కుమార్‌సింగ్‌తోకూడా సమావేశం కావడం యుద్ధసన్నద్ధతను సూచిస్తోంది. 1960లో జరిగిన సింధుజలాల ఒప్పందం ను తాత్కాలికంగా రద్దుచేసి జలాలను నిలిపివేసిన భారత్ 1965, 1971 యుద్ధసమయాల్లోను, 1999 కార్గిల్ వివాదంలోకూడా జలాలను నిలిపివేయలేదు. ఈసారి కఠిన కార్యాచరణ అమలుచేస్తోంది. 2003లో జరిగిన సిమ్లా ఒప్పందాన్ని కూడా పాకిస్థాన్ ఉల్లంఘిస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంగించింది. వాస్తవాధీన రేఖవెంబడి ఇరుదేశాలు కూడా కాల్పుల విరమణ పాటించాలని నాటి ఒప్పందంలో సారాంశం.

# వర్క్‌ఫ్రం హోం ఉద్యోగాల కల్పన వేగవంతం చేయాలి: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే5,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలు తమ పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు ఉండకూడదని, ప్రభుత్వ సేవలన్నీ పౌరులకు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కార్యకలాపాలపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే ప్రజలు ప్రభుత్వం నుంచి అన్ని సేవలు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ గురించి ప్రజల్లో అవగాహన పెంచేలా విస్తృతంగా దీని గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం అన్ని సేవలు కూడా ప్రజలు ఎలాంటి అవరోధాలు లేకుండా ఆన్‌లైన్‌లో పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలన్నీ కూడా ఈ దిశగా తమ కార్యకలాపాలను మెరుగుపరచుకోవాలన్నారు. డేటా లేక్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. డ్రోన్‌ల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు కల్పించాలని, ప్రజలు డ్రోన్ సేవలు విరివిగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డ్రోన్‌ల ద్వారా ఎన్ని యూస్ కేసెస్ అందించగలమనేది ప్రజలకు వివరించి వారు ఆయా సేవలు పొందగలిగే ఏర్పాట్లు చేయాలన్నారు. యూస్ కేసెస్ అందించే సంస్థలు, ప్రభుత్వ విభాగాలతో ఒక వర్క్‌షాపు పెట్టి ప్రభుత్వ శాఖలు, అధికారులకు కూడా దీనిపైన అవగాహన పెరిగేలా చేయాలని సూచించారు. దోమల నివారణకు పురపాలక శాఖ, ప్రజారోగ్య శాఖలు డ్రోన్‌లను ఎక్కువగా వినియోగించాలని సీఎం ఆయా శాఖల అధికారులకు సూచించారు. వర్క్‌ఫ్రం హోం కార్యక్రమం కూడా వేగవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీన్ని నిరంతరం ప్రమోట్ చేస్తూ ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలన్నారు. రాబోయే మూడు సంవత్సరంలో ఎన్ని ఉద్యోగాలు అందుబాటులోకి రాగలవు, ఎంతమందికి ఉద్యోగాలు కల్పించగలం, వారికి ఎలాంటి నైపుణ్యాలు అవసరమనేదానిపై సమగ్ర కసరత్తు చేయాలన్నారు. అవసరమైతే ఒక కన్సల్టెన్సీ కూడా నియమించుకోవాలని సూచించారు. వర్క్‌ఫ్రం హోం చేయడానికి అందుబాటులో ఉన్న మానవ వనరులకు నైపుణ శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఆర్టీజీ కార్యదర్శి భాస్కర్ కాటంనేని మాట్లాడుతూ డేటా లేక్ పనులు దాదాపుగా పూర్తయ్యాయని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 273 రకాల సేవలు అందిస్తున్నామని, జూన్ 12వ తేదీలోపు 370 నుంచి 380 సేవలను అందిస్తామని చెప్పారు. ఆర్టీజీఎస్‌లో అవేర్ హబ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వాతావరణ మార్పులను అధ్యయనం చేసి సేవలు అందజేస్తామని తెలిపారు.

# పిల్లల పుస్తకాల మోత బరువు తగ్గింపు!

>> భాగంగా ఒకటి, రెండు తరగతులకు సంబంధించి మొదటి సెమిస్టర్ లో అన్ని సబ్జెక్టులను కలిపి కేవలం ఒకే పాఠ్యపుస్తకంగా తీసుకురానున్నారు. దీనికి అదనంగా మరో వర్క్‌బుక్ సైతం ఉంటుంది. ఇక రెండో సెమిస్టర్‌లోనూ అన్ని సబ్జెక్టులకు కలిపి ఒక పాఠ్యపుస్తకంగా ఇస్తారు. అలాగే వర్క్‌బుక్ ఉంటుంది. దీనిపై ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నిర్వహించిన చర్చల్లో పాఠశాల విద్యాశాఖ అధికారులు వచ్చే సంవత్సరం నుంచి అమలు చేయనున్న పలు అంశాలను వివరించారు. 3-5 తరగతులకు మొదటి సెమిస్టర్‌లో భాష సబ్జెక్టులు అన్నీ కలిపి ఒక పుస్తకం, వర్క్‌బుక్, ఇతర సబ్జెక్టులన్నీ కలిపి మరో పుస్తకం, వర్క్‌బుక్ ఇస్తారు. 9, 10 తరగతుల్లో ప్రస్తుతం ఉన్న హిందీ పాఠ్యపుస్తకాన్ని తొలగించి, రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ మండలి రూపొందించిన పాత పుస్తకాన్ని తీసుకొస్తారు. అందుకు అనుగుణంగా 1,2 వ తరగతులకు సంబంధించి తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టులను కలిపి ఒకే పాఠ్య పుస్తకంలో, అదే విధంగా దానికి సంబంధించిన వర్క్ బుక్‌లను కలిపి మరొక దానిలో నూతనంగా ముద్రించారు. అంటే ఇక మీదట విద్యార్థులకు రెండు పుస్తకాలు మాత్రమే తమ సంచిలో తీసుకెళ్లాల్సి ఉంటుంది.



సోమవారం పోలవరం ప్రాజెక్టు వద్ద పరిశీలిస్తున్న అంతర్జాతీయ నిపుణుల బృందం

# పోలవరం ప్రాజెక్ట్‌ను సందర్శించిన అంతర్జాతీయ నిపుణుల బృందం

**విజయవాడ,మే 5,ప్రభాతవార్త ప్రతినిధి:** పోలవరం ప్రాజెక్ట్‌ను అంతర్జాతీయ నిపుణుల బృందం సందర్శించింది. ఇక్కడ జరుగుతున్న వివిధ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ బృందం తగు సూచనలు సలహాలను జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు ఇవ్వనుంది. అంతర్జాతీయ నిపుణులు రిచర్డ్ డొన్నెల్లి,సీన్ హించ్ బెర్డర్,జియాన్ఫ్రాన్కో డి సికో, డేవిడ్ బి పాల్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పరిశీలించారు. వీరితో పాటు పిపిఎ సభ్య కార్యదర్శి ఎం.రఘురాం,కేంద్ర జల సంఘం అధికారులు,సరబ్జిత్ సింగ్ భక్షి,రాకేష్,అశ్వనీకుమార్ వర్మ,గౌరవ్‌తివారీ,హేమంత్ గౌతం,సిఎస్ఎంఆర్ఎస్ అధికారులు మనీష్ గుప్తా, లలిత్‌కుమార్ సోలంకి పనులు జరుగుతున్న తీరుపై సమీక్షించారు. ప్రాజెక్ట్ సిఇ కె.నర్సింహమూర్తి,ఎంఈఐఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌బాబు పనుల పురోగతిని వారికి వివరించారు. నిపుణుల బృందం సభ్యులు డయాఫ్రం వాల్ పనులు,ఎగువ కాఫర్ డ్యాం పటిష్టతపై ఆరా తీశారు.కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ఎపి ప్రభుత్వం లేఖ రాసింది. ఇవాళ్టి త్రిసభ్య కమిటీ సమావేశానికి హాజరు కాలేమని అందులో పేర్కొంది. పోలవరం ప్రాజెక్ట్ పరిశీలనకు నిపుణులు వస్తున్నారని అందులో వివరించింది. ఈ నెల 10 తర్వాత త్రిసభ్య కమిటీ భేటీ ఏర్పాటు చేయాలని ఎపి ఇఎస్‌సి కోరారు. ఇకపై కృష్ణా బోర్డు సమావేశాలు విజయవాడలోనే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

# భారత్, బంగ్లా మత్స్యకారులు పరస్పరం సహకరించుకోవాలి

## - డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,మే5,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఇటీవల జరిగిన ఐదు వేర్వేరు సంఘటనలలో తమిళనాడుకు చెందిన 24 మంది భారతీయ మత్స్యకారులకు సంబంధించిన సంఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని జనసేన అధినేత , డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా పోస్టుచేశారు. నాగపట్నం జిల్లాకు చెందిన ఈ మత్స్యకారులు సముద్రంలో జరిగిన ఘర్షణల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, గాయపడ్డారని తెలుసుకోవడం బాధాకరం, భారతదేశం. శ్రీలంక మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాల దృష్ట్యా, పునరావృతమయ్యే ఈ సంఘటనలను గమనించి, ఈ పునరావృత పరిస్థితులను స్నేహపూర్వకంగా పరిష్కరించాలని విదేశాంగ మంత్రిత్వ శాఖను కోరుతున్నాను అని పోస్టు చేశారు. భారతదేశం, శ్రీలంక ప్రభుత్వాలు పరస్పర సహకార స్ఫూర్తితో ఈ సమస్యలను పరిష్కరించడానికి నిర్మాణాత్మక చర్చలు చేయడం అత్యవసరమని భావిస్తున్నట్లు డిప్యూటీ సిఎం అన్నారు. ఇరువైపులా మత్స్యకారుల భద్రత, గౌరవాన్ని నిలబెట్టడానికి నిరంతర ప్రయత్నాలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ అంశాన్ని ప్రధాని నరేంద్రమోడీ,కేంద్రమంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకుని వెళ్తామన్నారు.తమిళనాడు సిఎం స్టాలిన్ ఈ అంశంపై ఇప్పటికే పరిష్కార దిశలో వ్యవహరిస్తున్నారనే విశ్వసిస్తున్నామన్నారు.

# 8న విశాఖలో తలసేమియా రన్

## పాల్గొననున్న ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరి



**విశాఖపట్నం, మే 5, ప్రభాతవార్త :** ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తలసేమియా రన్ 2025ఎ మూవ్‌మెంట్ ఫర్ అవేర్‌నెస్ అండ్ యాక్షన్ కోసం వైజాగ్ సిద్ధమౌతోంది. 2025జెనెటిక్ బ్లడ్ డిజార్డర్ అయిన తలసేమియా గురించి అవగాహన పెంచడానికి ఎన్టీఆర్ ట్రస్ట్ 'తలసేమియా రన్‌వైజాగ్' ఒక శక్తివంతమైన కమ్యూనిటీ ఈవెంట్‌ను గర్వంగా ప్రకటిస్తుండగా, డెస్టినీ నగరం లక్ష్యంతో నడిచే రన్నర్ల సముద్రాన్ని చూసేందుకు సిద్ధంగా ఉంది. మే 8న సాయంత్రం 6:00 గంటలకు శక్తివంతమైన ఆర్.కె.బీచ్‌లో రన్ జరుగుతుంది. ఎన్టీఆర్ ట్రస్టీ ముఖ్యమంత్రి సతీమణి, నారా భువనేశ్వరి స్వయంగా ఈ ఈవెంట్‌లో పాల్గొంటుండడం విశేషం. అన్ని వయసుల వారికి ఈవెంట్‌లో అవకాశం తెరిచి ఉంటుంది. పాల్గొనేవారు వారి ఫిట్‌నెస్ స్థాయిల ఆధారంగా పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఈ సంవత్సరం తలసేమియా ఈవెంట్ ప్రపంచ సందేశాన్ని స్వీకరించింది. సంఘాలను ఏకం చేయడం, రోగులకు ప్రాధాన్యత ఇవ్వడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. కలిసి అవగాహన కల్పించడం, రోగులకు మద్దతు ఇవ్వడం మరియు స్వచ్ఛంద రక్తదానాలను ప్రోత్సహించడం ద్వారా నిజమైన ప్రభావాన్ని సృష్టించాలన్నదే లక్ష్యం. రిజిస్ట్రేషన్‌లు ఇప్పుడు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూడాట్ తలసేమియారన్ డాట్ కామ్ లో చేసుకోవచ్చు. లేదా నగరం అంతటా అధికారిక పోస్టర్‌లు మరియు ప్రమోషన్‌లలో అందుబాటులో ఉన్న క్యూఆర్ కోడ్ అందుబాటులో ఉన్నాయి. ప్రతి రోగికి, ప్రతి కుటుంబానికి మరియు ఆరోగ్యకరమైన రేపటి కోసం మనం ఏకం చేద్దాం... పరిగెడదాం... మార్పు తెద్దాం. లక్ష్యం తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ అధికారులు చెబుతున్నారు. ఇతర వివరాలకు +919652974235/ 9100433499 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

# 'అన్నదాత సుఖీభవ'

>> పథకం వర్తిస్తుంది. ఆర్థికంగా ఉన్నత స్థానాల్లో ఉన్నవారికి పథకం వర్తించదు. తాజా, మాజీ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు, మంత్రులు శాసనమండలి సభ్యులు, మేయర్లు, జడ్పీ ఛైర్ పర్సన్లు తదితర రాజ్యాంగబద్ధ పదవులు నిర్వహించిన/నిర్వహించే వారు అర్హులు కాదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖలు, కార్యాలయాలు, శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు స్థానిక సంస్థల్లో శాశ్వత ప్రాతిపదికన పనిచేసేవారికి పథకం వర్తించదు. నెలకు రూ.10 వేలు, ఆపైన పెన్షన్ తీసుకునే వారూ అర్హులు కాదు. మల్టిటాస్కింగ్ స్టాఫ్, క్లాస్-4 గ్రూప్ డి ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చారు. వైద్యులు, ఇంజినీర్లు న్యాయవాదులు ఛార్టర్డ్ అకౌంటెంట్లు ఆర్కిటెక్టులు, నమోదైన ఇతర వృత్తి నిపుణులూ అర్హులు కాదు. గత సంవత్సరంలో పన్ను చెల్లించిన వారూ పథక ప్రయోజనాలు అందుకోలేరు. వ్యవసాయ భూముల్ని వ్యవసాయేతర భూములుగా మార్చినా పథకం వర్తించదు. పిఎం కిసాన్‌నూ సంతృప్తికర స్థాయిలో అమలు చేసేందుకు వీలుగా జాబితాలను నవీకరించాలని కేంద్రం ఆదేశించింది. మే ఆఖరులోగా ఈ జాబితాలనూ సిద్ధం చేయనున్నారు. చనిపోయిన వారిపేర్ల తొలగింపు, భూ రికార్డులకు అనుగుణంగా లబ్దిదారుల నమోదు రైతుల ఐడీ నంబర్లు, పెండింగ్‌లో ఉన్న ఆధార్, ఈకేవైసీ వివరాలు సరిదిద్దాలి. గిరిజనశాఖతో సమన్వయంచేసుకుంటూ అటవీహక్కులచట్టం, ఆదివాసీ గిరిజనులకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించింది.

**ప్రతి పంటకు మద్దతు ధర కల్పిస్తాం**

రాష్ట్రంలోని ప్రతి పంటకు మద్దతు ధర కల్పిస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు వెల్లడించారు. గత ప్రభుత్వ పాలనలో పండించిన పంటలకు మద్దతు ధర కల్పించకుండా రైతుల నుంచి కమీషన్లు తీసుకున్న నీచ చరిత్ర వైకాంగ్రెస్ పార్టీ నేతలది అని ఒక ప్రకటనలో విమర్శించారు. ఆరుగాలం శ్రమించి రైతు పండించిన ధాన్యాన్ని అమ్ముకోవాలన్నా వైఎస్సార్సీ నేతలకు జె ట్యాక్స్ కట్టాల్సిన పరిస్థితి గతంలో ఉందని ఆరోపించారు. నేడు పంటలను నేరుగా అమ్ముకోవడంతోపాటు 24గంటల్లోపు చెల్లింపులు చేస్తూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మార్కెట్‌లో ధర తక్కువ ఉన్న పంటలకు మార్క్‌ఫెడ్, ఇతర శాఖలద్వారాకొనుగోలు చేస్తూ రైతులను ఆదుకుంటున్నామన్నారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా రైతుల పక్షపాతంగా వ్యవహరిస్తోందన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకుంటామన్నారు.ఏ ఒక్క రైతుకు నష్టం జరుగనివ్వమన్నారు.

# రైతులను ఆదుకుంటాం

>> రులు సిఎంకు వివరించారు. ప్రధానంగా పశ్చిమ గోదావరి, నంద్యాల, కాకినాడ, సత్యసాయి జిల్లాల్లో ఈ పంటలకు నష్టం వాటిల్లిందని అన్నారు. అత్యధికంగా పశ్చిమ గోదావరి జిల్లాలోని 15 మండలాల్లో 1,033 హెక్టార్లలో వరిపంట దెబ్బతిందని వివరించారు. నంద్యాల జిల్లాలో 641 హెక్టార్లలో, కాకినాడ జిల్లాలో 530 హెక్టార్లలో, సత్యసాయి జిల్లాలో 20 హెక్టార్లలో వరిపంట దెబ్బతిందని అధికారులు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 138 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. కృష్ణా, ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్, తిరుపతి, నంద్యాల, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉద్యానవన పంటలకు నష్టం కలిగిందని అధికారులు వివరించారు.రబీలో 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని పౌరసరఫరాల శాఖ ప్రత్యేక కార్యదర్శి సౌరబ్ గౌర్ సిఎంకు వివరించారు. ఇప్పటికే 13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ..రైతుల వద్దనున్న ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఏ ఒక్క రైతు నుంచి కూడా తమవద్ద ధాన్యం కొనలేదనే మాట ఉత్పన్నం కాకూడదని అన్నారు.

**అధికారులు మానవీయ కోణంతో పనిచేయాలి**

విపత్తుల సమయంలో ప్రభుత్వ అధికారులు యంత్రాంగం మానవీయ కోణంలో పనిచేయాలన్నారు. విపత్తులు వచ్చినప్పుడు కేవలం సహాయక చర్యలు చేపట్టడమే కాకుండా ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందుస్తుగా యంత్రాంగం సన్నద్ధమవ్వాలన్నారు. గతంలో హుద్‌హుద్ తుఫాను సమయంలో ప్రాణనష్టం కలగకుండా సమర్థవంతంగా పనిచేసిన తీరును ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు. విపత్తుల సమయంలో ఇలాంటి ముందస్తు సన్నద్ధత ఎంతో అవసరమన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఆర్టీజీఎస్‌లోని అవేర్ విభాగం నుంచి విపత్తు నిర్వహణ సంస్థ నుంచి ఎప్పటికప్పుడు వాతావరణం గురించి ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తుంటామన్నారు. జిల్లా కలెక్టర్లందరూ దీనికనుగుణంగా ఆయా జిల్లాల్లో ఎట్టి పరిస్థితుల్లో మరణాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద మంచి యంత్రాంగం, సాంకేతిక ఉందన్నారు. వీటిని సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. సాంకేతికత కూడా వెళ్లలేని ప్రాంతాల్లో మానవ సాయంతో ప్రమాదాలు నివారించి మరణాలు సంభవించకుండా చూడాలన్నారు. యంత్రాంగం ఎంత అప్రమత్తంగా ఉంటే నష్ట నివారణ అంత సమర్థవంతంగా చేయగలమని చెప్పారు. ప్రతి మండలంలోని అధికారులతో కలెక్టర్లు టెలీకాన్ఫరెన్సులు పెట్టుకుని అక్కడ సన్నద్ధత చర్యలను పర్యవేక్షించాలన్నారు.

**విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారులకు అభినంద**

అకాల వర్షాలకు ఆయా జిల్లాల్లో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను తక్షణం పునరుద్ధరించడంలో కృషి చేసిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా సీఎం అభినందించారు.ఉద్యానవన పంటలు, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నదాతలకు సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. వేల ఎకరాల్లో అరటి, బొప్పాయి తోటలు నేలకొరిగాయి. మొక్కజొన్న రైతులు నిండా మునిగారు. భారీ గాలులు వీయడంతో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. ఆర బెట్టిన పసుపు పంట వర్షానికి తడిసిపోవడంతో రైతులు ఆవేద వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు మాట్లాడుతూ ఈ విషయంలో రైతులకు ప్రయోజనం కలిగించే దిశలో చర్యలు ఉండాలన్నారు. అలాగే తడిసిన ధాన్యం కొనుగోళ్లపై నిర్ణయంతీసుకుంటాం. 24శాతం తేమఉన్నా ధాన్యం కొనుగోళ్లచేసేలా మిల్లర్లకు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం మిల్లరు ద్వారానే కొనుగోలు చేయించాలన్నారు. ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా రైస్ మిల్లర్లు వ్యవహరించాలి. ప్రభుత్వానికి, రైతాంగానికి మధ్య వారధిలా మారాలి. అంతే తప్ప మబ్బులు పట్టాయని హడావుడి చేసి, ప్రభుత్వం ఇచ్చిన గోతాలు రైతులకు ఇవ్వకుండా ఇబ్బంది పెడితే మాత్రం చూస్తూ ఊరుకోం. రైతులకు అండగా నిలబడితే మీతోపాటు కలిసి నడుస్తాం. ఎటువంటి సమస్య తలెత్తినా క్షేత్రస్థాయిలో పని చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

## వారం - వర్జ్యం

తేది : 06-05-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
నవమి ఉ.8.40
మఖ మ.3.55
వర్జ్యం రా.12.43-రా.2.29
దు.ఉ.8.15-9.06, 2) ఉ.11.36-మ.12.27
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** ఉద్యోగాలలో కొత్త బాధ్యతలు పెరిగినాయి. సమర్థవంతంగా నిర్వ హిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.

**వృషభం :** గృహనిర్మాణ ఆలోచనలు నిలకడగా ఉండవు. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు.

**మిథునం:** కుటుంబంలో వివాదాలు ఏర్పడిన పరిష్కరించుకుంటారు. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

**కర్కాటకం:** వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఉద్యోగాలలో స్థానమార్పులు.

**సింహం:** సన్నిహితులను కలిసి ఆనందంగా గడుపుతారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**కన్య :** సంతానం విద్యావకాశాలు పొందుతారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**తుల :** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**వృశ్చికం:** ఉద్యోగాలలో పురోభివృద్ధి సాధిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు నిదానంగా కార్యరూపం దాలుస్తాయి.

**ధనుస్సు:** కుటుంబంలో కొన్ని చికాకులు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. వాహనసౌఖ్యం.

**మకరం:** వృత్తి, వ్యాపారాలలో స్వల్పలాభాలు పొందుతారు. ఉద్యోగాలలో చికాకులు ఎదురైన అధిగమిస్తారు.

**కుంభం:** వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. ఆప్తుల సలహాలు స్వీకరిస్తారు. ధన, వస్తు లాభాలు.

**మీనం :** స్థిరాస్తి అభివృద్ధి చెందుతుంది. ఉద్యోగాలలో గందరగోళం తొలుగుతుంది. వ్యాపారాలు లభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# భారీగా ఉపాధి కల్పన

>> అనంతపురం, చంద్రగిరి, నంద్యాల, గన్నవరం, ఒంగోలు) ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ యువతలో నైపుణ్య అంతరాన్ని తగ్గించి గ్రీన్, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఏర్పాటుకు ఈ ఒప్పందం దోహదపడుతుంది. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఎస్ డీసీ మేనేజింగ్ డైరెక్టర్ దినివీ జి.గణేష్ కుమార్, ఏపీఎస్ ఎస్ డీసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. దినేష్ కుమార్, ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా కంట్రీ హెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ శర్మ, సీనియర్ జనరల్ మేనేజర్ రిచా గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

**ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ 61వ రోజు ప్రజాదర్బార్**

రాష్ట్రవ్యాప్తంగా వివిధ సమస్యలతో బాధపడుతున్న సామాన్య ప్రజానీకానికి మొదటి రోజు నుంచి అండగా నిలుస్తున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నేడు ఉదయం ఉండవల్లి నివాసంలో 61వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. తమ సమస్యలు విన్నవించేందుకు వివిధ జిల్లాల నుంచి పెద్దఎత్తున సామాన్యులు ఉండవల్లి నివాసానికి తరలివచ్చారు. పెన్షన్, భూ సంబంధిత సమస్యలు, ఉద్యోగ, ఉపాధి, వైద్య, ఆర్థికసాయం కోసం పెద్దఎత్తున ప్రజాదర్బార్‌కు తరలివచ్చారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్.. వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా విన్నపాలను పరిశీలించి త్వరితగతిన పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని అంబేద్కర్ యూనివర్సిటీలో పనిచేస్తుండగా తన భర్త విద్యుత్ షాక్‌కు గురై 2020లో మరణించాడని, కారుణ్య నియామకం కింద తనకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని చిలకపాలెం గ్రామానికి చెందిన డి.రేవతి మంత్రి నారా లోకేష్ ను కలిసి విన్నవించారు. కుటుంబ పోషణ భారంగా మారిందని, తన ఇద్దరు పిల్లల చదువుల కోసం తనకు ఏదైనా అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# భారత్‌కు రష్యా మద్దతు

>> ప్రకటించుకుంది. దీని భారత్ ప్రభుత్వం గతంలోనే ఉగ్ర సంస్థగా ప్రకటించింది. ఇక ఈ ఘటన తర్వాత పాక్ నడ్డి విరిచేలా భారత ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.
ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రికత్తలు నెలకొన్నాయి. ఈ ఉద్రిక్తతల వేళ.. ఐరాస భద్రతా మండలిలో సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలోనే పుతిన్ ఫోన్ చేశారు. ఇంతకుముందు పహల్గాం ఘటన తర్వాత రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, ప్రధాని మోడీకి పుతిన్ లేఖ రాశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఇలాంటి క్రూరమె

6-5Pg3exHMNWJQE.qxd:6-5Pg3exHMNWJQE.qxd 06/05/25 11:57 PM Page 1



# టెక్ హబ్‌గా ఆంధ్ర..

## సిఇఒలా సిఎం చంద్రబాబు!



- తాను సైతం ఆశ్చర్యపోయానన్న ప్రధాని మోడీ
- క్వాంటమ్ వ్యాలీగా అమరావతి, సైబరాబాద్‌కి దీటుగా విశాఖ,
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు..

**విశాఖపట్నం, మే5, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక విశిష్ట వ్యక్తిత్వం ఆయనది. రాజకీయవేత్తలే కాదు, ఉన్నతాధికారులు సైతం ఆయనను ముఖ్యమంత్రిగా కన్నా సీఈవోగా పోలుస్తారు. ఇది ఆయన పరిపాలనా శైలిని, విజన్‌ని చూపిస్తుంది. సాంప్రదాయ రాజకీయ నాయకులకు భిన్నంగా, చంద్రబాబు రాష్ట్రాన్ని ఒక సంస్థలా నడిపే విధానం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది. హైదరాబాద్‌ను సమాచార సాంకేతిక హబ్‌గా మార్చడం, అమరావతి రాజధాని నిర్మాణ ప్రణాళికలు ఆయనలోని సీఈవో ఆలోచనలను ఎత్తి చూపుతాయి. అలాగే ఆయన తెచ్చిన ఆర్థిక సంస్కరణలు, సాంకేతికతపై దృష్టి, పెట్టుబడుల ఆకర్షణలో ప్రత్యేక శైలి చంద్రబాబును రాజకీయ నాయకుడిగా కన్నా సీఈవోగానే ఫోకస్ చేస్తాయి. పాలనలో ఈగవర్నెన్స్‌ను ప్రవేశపెట్టి, సాంకేతికతను విస్తృతంగా వినియోగించారు. 1990ల చివరిలో హైదరాబాద్‌లో సైబరాబాద్ నిర్మాణం, మైక్రోసాఫ్ట్ వంటి అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించడం ఆయన ప్రత్యేకతను చాటుతాయి. అమరావతి శంకుస్థాపన కార్యక్రమం, విద్యుత్ సంస్కరణలు కూడా ఆయన దీర్ఘకాలిక లక్ష్యాలను, విజన్‌ను సూచిస్తాయి. చంద్రబాబు సీఈవో శైలి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ఆయన వినూత్న ఆలోచనలు, సాంకేతికతపై దృష్టి రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చాయి. టెక్ హబ్‌గా ఆంధ్రా ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు టెక్ హబ్‌గా మారిపోతుంది. స్టార్టప్‌లు, ఐటీ కంపెనీలను తేవడంలో సీఎం చంద్రబాబుకు ఉన్న అనుభవం, పరిచయాలు రాష్ట్ర రూపురేఖలను మార్చేస్తుయ్యి. సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా టెక్ సీఈవోగా మారి దేశవిదేశాల్లో టెక్నాలజీని, నూతన ఆవిష్కరణలను ప్రమోట్ చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటి), ఎడ్జ్ కంప్యూటింగ్, లేదా అమీబా వంటి టెక్నాలజీలకు ఏపీని హబ్‌గా తయారు చేస్తున్నారు. సైబర్ హైదరాబాద్‌లా అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా మారుస్తామని కూడా సీఎం చంద్రబాబు తరచుగా చెబుతున్నారు. చంద్రబాబు గంటల తరబడి ల్యాప్‌ట్యాప్‌ను, మొబైల్‌ను వాడకపోయినా కానీ రాష్ట్ర ఐటీ యంత్రాంగానికి మాత్రం చెమటలు పట్టిస్తున్నారు. తాజాగా అమరావతి పనుల పున: ప్రారంభ కార్యక్రమంలో ప్రధాని మోదీ సైతం చంద్రబాబును ఆకాశానికి ఎత్తేసిన విషయం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ గుజరాత్ ముఖ్యమంత్రిగా తాను తొలిసారి బాధ్యతలు స్వీకరించినప్పుడు చంద్రబాబు విజన్ చూశానని, ఆయ సైబరాబాద్‌ను నిర్మిస్తున్నప్పుడు ఆశ్చర్య పోయానని పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్ సంస్థలా సచివాలయం! ప్రస్తుతం వెలగపూడిలోని ఏపీ సచివాలయం ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ బోర్డు రూమ్‌ను తలపిస్తోందని పెట్టుబడిదారులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ సంస్థకు సీఈవోగా కనిపిస్తున్నారంటున్నారు. ప్రజలకు సేవలను అందించడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా ఉత్తమంగా ఉపయోగించుకోవాలో చంద్రబాబు అధికారులకు తరుచూ చెబుతుంటారు. ఎంతోమంది రాజకీయ నాయకులు పేదరికం, నిరుద్యోగం, అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడుతుంటారు. కానీ సీఎం చంద్రబాబు మాత్రం ఏఐ వంటి టెక్నాలజీలపై ఫోకస్ పెట్టి, సాంకేతికతతో సంక్షేమాన్ని అర్హులందరికీ అందించడం ఎలాగో చేసి చూపించారు.

# ప్రజల ఆరోగ్య పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత

## - వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబు

**కుప్పం,మే 5 ప్రభాతవార్త** ప్రతి వ్యక్తి పుట్టుక నుంచి మరణించే వరకు వారి ఆరోగ్య పరిరక్షణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందని రాష్ట్ర వైద్య,ఆరోగ్య,కుంటబసంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి ఎంటి కృష్ణబాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన కుప్పంలో పర్యటించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ వీర పాండ్యన్, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్‌లతో కలసి కుప్పంలోని ఏరియా ఆస్పత్రిని పరిశీలించారు.గుడుపల్లె మండలం కనమనపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు.కుప్పం ఏరియా ఆస్పత్రిలో రోగులకు నాణ్యమైన భోజనం, వైద్య సేవలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.ఆస్పత్రి వస్తున్న రోగుల వివరాలు, రక్త పరీక్షలపై వాకబు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గాన్ని ఆరోగ్య రంగంలో మోడల్ నియోజకవర్గంగా మార్చేలా టాటా హెల్త్ సంస్థ వారితో ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. త్వరలోనే కుప్పంలో డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభిస్తామన్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కుప్పం నియోజకవర్గ ప్రజల ఆరోగ్య స్థితిపై టాటా సంస్థ ద్వారా సర్వే చేపట్టి భద్ర పరచడం జరిగిందన్నారు. ఈ సమాచారం భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తోడ్పడుతుందన్నారు. జిల్లాలోని అన్ని పిహెచ్‌సిలు, ఏరియా ఆస్పత్రుల్లో మందుల కొరత లేకుండా అత్యవసరమైన మందులు కొనుగోలు చేయాలని సూచించామని, కుప్పం ఏరియా ఆస్పత్రిలో అనస్తీషియా వైద్యుడి నియామకంపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గంలో 3లక్షల జనాభా ఉన్నారని టాటా సంస్థ సర్వే సమాచారాన్ని డిజిటలైజ్ చేయడం జరిగి ందన్నారు. 25మందిసిబ్బందితో కాల్ సెంటర్లను ఏర్పాటుచేయడం జరిగిందని వీటిని స ంప్రదించి వైద్య సలహాలు పొందవచ్చన్నారు. కడ పి.డి. వికాస్ మర్మత్ మాట్లాడుతూ కుప్పం ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంకు కృషి చేస్తామన్నారు. కుప్పం ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు చేపట్టి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. వైద్య సూవల్లో లోటుపాట్లు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. కుప్పంను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. కార ్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పడల్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, డిఎంహెచ్ఒ డా॥ సుధారాణి, డిసిహెచ్ఎస్ పద్మాంజలి, ఎంఎస్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



కుప్పం ఏరియా ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు

# మన్నవరం సమస్య పరిష్కరించండి

## కలెక్టర్‌కు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్ధన

**శ్రీకాళహస్తి,మే 5 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలు దీర్ఘకాలిక సమస్యలు తిష్టవేసి ఇబ్బందిగా మారిందని జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే పరిష్కరించుటకు చొరవ చూపాలని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అభ్యర్థించారు. సోమవారం ఎంఎల్ఏ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్‌ను కలసి నియోజకవర్గంలోని సమస్యలపై చర్చించారు.ఓ వైపు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలు,మరో వైపు సమాజానికి వెన్నుముక అయిన రైతు సమస్యలపై జిల్లా కలెక్టర్‌తో సుదీర్ఘంగా చర్చించారు. అలాగే ఏడేళ్ళ నుంచి మూత పడ్డ స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల పునఃప్రారంభానికి సంబంధించి చర్చించారు.

మన్నవరం భూముల స్వాధీనాన్ని పరిశీలించండి: శ్రీకాళహస్తి నియోజవర్గంలోని యువత సుమారు 6వేల మందికి ప్రత్యక్షంగానూ, మరో 6వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించే మన్నవరం లోని భెల్ ప్యాక్టరీ లక్ష్యం నెరవేరలేదు కాబట్టి భూములను స్వాధీనం చేసుకొని ఇతర పరిశ్రమలకు అవకాశం కల్పించాలని కోరారు.ఈ మేరకు ప్రభుత్వం నుంచి కూడా ప్రతిపాదన వచ్చింది కదా నిర్ణయాలు వేగవంతం చేయాలని ఎంఎల్ఏ కోరారు. అంతేకాక నియోజకవర్గంలో పలు పరిశ్రమలకు భూములను కేటాయించారు. ఆ పరిశ్రమలు ప్రారంభించలేదు. ప్రారంభించని పారిశ్రామిక వెత్తలతో చర్చించి వెంటనే ప్రారంభించుటకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఇక శ్రీకాళహస్తి ఏర్పేడు మండలాలను సస్యశ్యామలం చేసే ఎస్ ఎస్ కెనాల్‌కు సంబంధించి భూసేకరణ వివాదం చాలా కాలంగా ఆచరణకు నోచుకోవటం లేదని ఈ సమస్యను పరిష్కరించి తొండమనాడు చెరువును నింపి తద్వారా స్వర్ణముఖి నదిలోకి నీటిని విడుదల చేయటం గురించి కలెక్టర్‌తో చర్చించారు.

స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రతిష్టాత్మకం: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 1999లో దేవాదాయశాఖ మ్యాచింగ్ ఫండ్‌తో నిర్మించిన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల గత ఏడేళ్ళుగా మూత పడింది. 2014 వరకు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి పర్యవేక్షణలో సమర్థవంతంగా నిర్వహించిన కళాశాల తరువాత రోజు రోజుకు వెనుకబడిందని వైకాపా హయాంలో దానిని పూర్తిగా మూసివేసారని ఈ కళాశాల పునఃప్రారంభానికి ప్రభుత్వం సంబంధిత సాంకేతిక శాఖ మంత్రి లోకేష్ జెఎన్‌టియుకు అప్పగించుటకు అనుమతించారన్నారు. కాబట్టి ఈ విద్యాసంవత్సరం నుంచి అడ్మిషన్లకు సిద్ధం చేస్తున్నట్లు సుధీర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తెస్తూ ఏదైనా అవసరమైన నివేదికలను వెంటనే ఇవ్వాలని కోరారు.

మాస్టర్‌ప్లాన్‌కు సహాకరించండి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమలు చేయనున్న మాస్టర్ ప్లాన్‌కు అడ్డంకిగా ఉన్న ఒకే ఒక భవనంకు సంబంధించి లబ్దిదారుడు సుముఖత వ్యక్తం చేసారని ఈ ప్రతిపాదన ప్రభుత్వానికి పంపి త్వరలోనే అనుమతి సాధించి మాస్టర్ ప్లాన్ అమలుకు సహాకరించాలని కోరారు. నేడు ఆలయానికి వస్తున్న భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని కాబట్టి ఇక్కడ మాస్టర్‌ప్లాన్ అమలు ఎంతో ముఖ్యమని ఒకే ఒక భవనం బాదితుని ఫైల్‌ను ప్రభుత్వానికి పంపి అనుమతి సాధించుటకు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్‌ను కోరారు.



శ్రీకాళహస్తి నియోజకవర్గ సమస్యలపై కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి

# ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

**శ్రీరంగరాజపురం, మే 5 ప్రభాతవార్త:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేయడానికి వెళ్ళి పనులు చేస్తున్న ఉపాధి కూలీలపై సోమవారం ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. ఒక్కసారిగా తేనెటీగలు కూలీలపై దాడి చేయడంతో కొంతమంది కూలీలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. చిత్తూరు జిల్లా శ్రీరంగరాజపురం మండలంలోని ఏఎం పురం గ్రామ పంచాయతీ డిఆర్‌ఆర్ పురం పాపిరెడ్డిపల్లి దళితవాడకు చెందిన ఉపాధి కూలీలు ఉపాధి పనులు చేస్తుండగా తేనెటీగలు వారిపై ఒక్కసారిగా దాడి చేయడంతో ఈ ఘటన జరిగింది. ఎపిఓ లలిత వెల్లడించిన వివరాల మేరకు మండలంలోని దిగువ రిపుంజయరాజపురం దళితవాడకు చెందిన 27 మంది ఉపాధి కూలీలు సోమవారం ఉదయం 8 గంటలకు ఉపాధి పనులు చేయడానికి శెట్టి కాలువలోకి వెళ్ళారు. కూలీలు కాలువ పనులు చేస్తూ ముళ్ళపొదలు తొలగిస్తుండగా తేనెటీగలు ఒక్కసారిగా కూలీలపై దాడి చేసి చుట్టుముట్టి కుట్టివేశాయి. ఈ క్రమంలో 19 మంది కూలీలు అస్వస్థతకు గురయ్యారు. అస్వస్థతకు గురైన కూలీలను సత్వరం ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తరలించి వారికి చికిత్స అందించారు. ఇందులో తేనెటీగల దాడిలో తీవ్రంగా గాయపడిన ఉపాధి కూలీలు అంజయ్య, జయచంద్ర, బాలకృష్ణయ్య, మహేంద్ర, శ్రీదేవి, సంపత్, నాగరాజమ్మలతో పాటు మరో ఏడు మందిని మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి సమాచారం తెలిసిన వెంటనే కలెక్టర్ సుమిత్‌కుమార్ వారికి మెరుగైన వైద్యం అందించడానికి చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు.

# పార్కులను ప్లే, జిమ్ ఎక్విప్‌మెంట్‌తో ఆధునీకరిస్తాం

## మంత్రి నారాయణ

**నెల్లూరు, మే 5, ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలో ఆధునీకరించి ప్రారంభిస్తున్న ఒక్కొక్క పార్కులో పిల్లల కేరింతలు, ఆనందం చూస్తుంటే మనసుకు చాలా సంతృప్తిగా ఉందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. సోమవారం ఉదయం నెల్లూరు రంగ నాయకుల పేటలోని తిక్కన పార్కును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పార్కులో కలియతిరుగుతూ క్రీడాపరికరాల వద్ద చిన్నారులతో ఆనందంగా గడిపారు. మంత్రికి ఘన స్వాగతం పలికిన ముస్లింలు రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న మంత్రి సంకల్పం నెరవేరాలని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మంత్రిని సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ది చెందిన తిక్కన పార్కులో రూ.30లక్షలతో ప్లే, జిమ్, ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 2018లోనే నెల్లూరు నగరంలో 100 పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. గత ప్రభుత్వం పార్కుల అభివృద్ధిని అటకెక్కించిందన్నారు. మళ్లీ ఇప్పుడు తమ ప్రభుత్వ హయాంలో పార్కుల అభివృద్ధి పనులు మొదలు పెట్టినట్లు చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణతో పాటు పిల్లలకి ఆహ్లాదం కోసం పార్కులను ఆధునీకరిస్తున్నామన్నారు. ప్రారంభించిన పార్కుల్లో పిల్లల కేరింతలు, సంతోషాన్ని చూస్తే ఆనందంగా ఉందని మంత్రి నారాయణ చెప్పారు. అన్ని పార్కుల్లో కూడా భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఖాజానా ఖాళీగా ఉందని, ప్రజలందరూ కాస్త ఓపికతో ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి నారాయణ కోరారు. ఇప్పుడిప్పుడే ఒక్కొక్క హామీని నెరవేరుస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో పార్కులను అభివృద్ధి చేస్తామని, ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన అన్ని హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఈ సందర్భంగా మంత్రి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, టీడీపీ నగర అధ్యక్షులు మామిడాల మధుతాజా, మాజీ కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



# రైతుల కోసం సహాయ చర్యలు చేపట్టండి

## మాజీ సిఎం జగన్

**విజయవాడ,మే5,ప్రభాతవార్తప్రతినిధి:**రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. చేతికి వచ్చిన ఎన్నో పంటలు దెబ్బతినడంతో... రైతులు గగ్గోలు పెడుతున్నారు. అయితే రీజినల్ కో-ఆర్డినేటర్లు,పార్టీ ముఖ్య నేతలతో భారీ వర్షాలపై సిఎం వైఎస్ జగన్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అకాల వర్షాలు,ఈదురు గాలుల కారణంగా రాష్ట్రంలో పలుచోట్ల ధాన్యం తడిసిపోవడంతో పాటు అనేక ఉద్యానవన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అకాల వర్షాలు,ఈదురుగాలుల కారణంగా నష్టపోయిన రైతులను పరామర్శించాలని స్పష్టం చేశారు. ఇక రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వైసీపీ నేతలకు సూచించారు వైఎస్ జగన్.కష్టకాలంలో ఉన్న రైతులకు అండగా నిలవాలి. వర్షాలు కురుస్తాయన్న సమాచారం ముందస్తుగానే ఉన్నప్పటికీ కళ్ళాల్లో,పొలాల్లో రైతుల వద్ద నున్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపించిందని విమర్శించారు. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం నిస్తేజంలో ఉంది. ఖరీఫ్‌లో ప్రతికూల వాతావరణం,కనీస మద్దతు ధరలు లభించక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# ఆర్డిటి నిధుల కొనసాగింపుపై సిఎం చంద్రబాబు ధోరణి సరికాదు

**అనంతపురం, మే 5 ప్రభాతవార్త బ్యూరో** ఆర్డిటికి ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ అథారిటీ (ఎఫ్‌సిఆర్ఏ) రిజిస్ట్రేషన్ రెన్యూవల్ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టించుకునే ధోరణిలో వ్యవహరించడం సరికాదని, కేంద్రం దృష్టికి స్వయంగా సీఎం చంద్రబాబు తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ రెన్యూవల్ కొనసాగించాల్సిన బాధ్యత తీసుకోవాలని వైఎస్ఆర్‌సిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాలో పేదప్రజలకు సేవలు అందిస్తున్న ఆర్డిటి స్వచ్ఛంద సంస్థ కాదని, ఇక్కడ ప్రజల భావోద్వేగంతో కూడుకొని ఉన్న సంస్థ అని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆర్డిటికి ఎఫ్‌సిఆర్ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల జేఏసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి అధ్యక్షతన జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరానికి వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి వెళ్లి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన అనంతపురం జిల్లా ప్రజల కష్టాలను గట్టెక్కించేందుకై ఫ్రాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆర్డిటిని స్థాపించి దశాబ్దాల కాలంగా సేవలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఆర్డిటికి నిధులను అందించే ఎఫ్‌సిఆర్ఏ రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేస్తున్న జాప్యం వల్ల జిల్లాలో ఆర్డిటి సేవలకు ప్రతి బంధకంగా మారాయన్నారు. దీంతో ఆర్డిటి సేవలు జాప్యం జరిగితే ప్రజా ఉద్యమంగా మారడం తథ్యమని హెచ్చరించారు. తాను ఓ పార్టీకి ప్రతినిధిగా ఈ మాటను చెప్పడం లేదని, జిల్లా పౌరుడిగా ఆర్డిటి ఇక్కడ అందిస్తున్న సేవలను దగ్గరగా చూసిన వ్యక్తిగా మాట్లాడుతున్నానన్నారు. ఆర్డిటికి విదేశీ నిధుల కొనసాగింపుపై జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాయలసీమ వాసిగా ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్రంతో మాట్లాడాలని ఆయన సూచించారు.




దీక్షలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత

# లిక్కర్ కేసులో ఎంపి కేశినేని చిన్నిపై తీవ్ర ఆరోపణలు

## సిఎం చంద్రబాబుకు లేఖ రాసిన నాని

**విజయవాడ,మే5,ప్రభాతవార్తప్రతినిధి:**విజయవాడ మాజీ ఎంపీ,వైసీపీ నేత కేశినేని నాని...సిట్టింగ్ ఎంపీ,టిడీపి నేత కేశినేని చిన్న మధ్య ఆరోపణల పర్వం కొనసాగుతూనే ఉంది. కొంత కాలం నుంచి వీరు సామాజిక మాధ్యమాలు వేదికలుగా పరస్పర అభియోగాలు చేసుకుంటున్నారు. విశాఖలో భూ కేటాయింంపుల విషయంలో తన సోదరుడు కేశినేని చిన్నిపై కేశినేని నాని ఆరోపణలు చేసారు.తాజా ఏపీలో రగులుతున్న లిక్కర్ కేసులోనూ తమ్ముడిపై ఆరోపణలు చేస్తున్నారు..దీనిపై నారాచంద్రబాబునాయుడుకు లేఖ రాస్తూ..ఎక్స్‌లో పోస్టు చేశారు కేశినేని నాని. ఏపీ మధ్యం కుంభకోణంలో అరెస్ట్ అయిన వ్యక్తులతో,ముఖ్యంగా కేసిరెడ్డి రాజశేఖరరెడ్డి,అతని సన్నిహిత సహాయకుడు దిలీప్ పైలాతో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)కి సంబంధం ఉన్న తీవ్రమైన నమ్మదగిన సమాచారాన్ని మీ దృష్టికి తీసుకురావడానికి ఈ లేఖ వ్రాస్తున్నానని పేర్కొన్న కేశినేని నాని....కేసిరెడ్డి రాజశేఖరరెడ్డి, మాజీ ప్రభుత్వ సలహాదారు,ప్రస్తుతం మధ్యం కుంభకోణంలో అరెస్ట్ అయిన ప్రధాన నిందితుడు,ఎంపీ కేశినేని శివనాథ్ మరియు అతని భార్య జానకి లక్ష్మీ కేసినేనితో కలిసి ఫ్రైడ్ ఇన్‌ఫ్రాకన్ ఎల్ఎల్‌పిలో నియమిత భాగస్వామిగా ఉన్నారు. ఈ కంపెనీ హైదరాబాద్ లోని జూబ్లీ హిల్స్,ప్లాట్ నెం.9,సర్వే నెం.403లో నమోదయ్యిందని పేర్కొన్నారు. కేసిరెడ్డి,దిలీప్ పైలా నిర్వహిస్తున్న ఎశ్వాని ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ కూడ ఇదే చిరునామాను కలిగి ఉంది. అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే,ఫ్రైడ్ ఇన్‌ఫ్రాకాన్ ఎల్ఎల్‌పి మరియు ఎశ్వాని ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ రెండూ ఒకే అధికారిక ఈ మెయిల్ ఐడీని ఉపయోగిస్తున్నాయి అని దుయ్యబట్టారు. ఇది రెండు సంస్థల మధ్య సామీప్యత మాత్రమే కాకుండా,ఉద్దేశపూర్వక కార్యాచరణ సంబంధాన్ని స్పష్టంగా సూచిస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు కీలక వ్యక్తుల అరెస్ట్‌తో దర్యాప్తులో ఉండవచ్చని, ఒక సిట్టింగ్ ఎంపీతో నేరుగా సంబంధం ఉండటం రాజకీయ రక్షణ మరియు ఆర్థిక సమన్వయం గురించి తీవ్రమైన ఆందోళన కల్గిసో ్తందన్నారు కేశినేని నాని...ఇక,విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మరియు విదేశీ కంపెనీలలో అక్రమంగా మళ్ళించిన పెద్ద మొత్తంలో నిధులను పెట్టుబడి పెట్టారని నమ్మదగిన సమాచారం సూచిస్తోంది.ఇవి కుంభకోణంతో సంబంధ్యాం ఉన్న దేశీయ కార్యకలాపాల నుండి లెక్కలేనన్ని సంపదను లాండరింగ్ చేయడానికి మరియు నిల్వ చేయడానికి ఉపయోగించవచ్చు అనే అనుమానాలను లేవనెత్తారు. మీరు వెంటనే జోక్యం చేసుకోవాలని...ఉన్నత స్థాయి దర్యాప్తును ఆదేశించాలని సిఎం చంద్రబాబును కోరారు. ఈ స్థాయిలో అధికార దుర్వినియోగం, నిందితులతో సామీప్యతను పరిశీలించకుండా వదిలివేయకూడదు. మీరు నిర్ణయాత్మకంగా చర్య తీసుకోవాలని, న్యాయాన్ని నిలబెట్టాలని... రాజకీయ సంబంధాలు జవాబుదారీతనానికి అడ్డంకిగా నిలవకుండా చూడాలని సిఎం చంద్రబాబుకు రాసిన లేఖలో మాజీ ఎంపి కేశినేని నాని.పేర్కొన్నారు.

# బిజెపి నేతలు కౌరవులతో సమానం : పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**విజయవాడ,మే5,ప్రభాతవార్తప్రతినిధి:** నేను కాదు గాంధారి.. మీరే కౌరవులు..బిజెపి నేతలు కౌరవులతో సమానం.అంటూ ఏపీపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సంచలన వ్యాఖ్యలు చేసారు.,బీజేపీతో రాష్టానికి ఒక్క ప్రయోజనం జరిగింది అని నిరూపిస్తే,తాను గాంధారి అని ఒప్పుకుంటాననాన్నరు. ధరల స్థిరీకరణ కు 6 వేల కోట్లు ఖర్చు చేశారా ? శ్వేతపత్రం ఇవ్వండన్నారు..ఉభయగోదావరి జిల్లాలో చివరి గింజ వరకు ధాన్యం కొనాల్సిందేనన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవనంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ధాన్యానికి మద్దతు ధర విషయంలో కూటమి ప్రభుత్వానిది మోసమన్నారు.సమావేశంలో ఆమె అనేక ప్రశ్నలు సంధించారు. అకాల వర్షాల వలన అస్థి, ప్రాణ, పంట నష్టం తీవ్రంగా జరిగింది క్కడ చూసినా తడిచిన ధాన్యం రాలిపోయిన మామిడి,కూలిపోయిన అరటి కనిపిస్తుంది దాదాపు 5 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది అని అంచనా ఇప్పటి వరకు ఎంత నష్టం జరిగింది అని ఈ ప్రభుత్వం లెక్కలు కూడా తీయలేదు ఉభయగోదావరి జిల్లాల్లో ఎక్కడ చూసినా తడిచిన ధాన్యమే ఈ సారి దాదాపు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండింది కానీ ప్రభుత్వం కొన్నది మాత్రం కేవలం 13 లక్షల మెట్రిక్ టన్నులే ఇంకా 17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల దగ్గరే ఉంది టార్గెట్ ముగిసింది అని కేంద్రాలు బంద్ పెట్టారు విదేశాల్లో డిమాండ్ లేదని మిల్లర్లు కూడా కొనడం లేదు పొలాల్లో వరి కుప్పలు పోసి నిరీక్షిస్తున్నారు ఇప్పుడు ఆ ధాన్యం ఎవరు కొనాలి ? చివరి గింజ వరకు కొంటాం అని ఇచ్చిన హామీ ఏమయింది ? మిల్లర్లు తక్కువ రేటుకు కొంటున్నారు అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు తెలంగాణలో ఇదే పరిస్థితి ఏర్పడితే... నేరుగా అక్కడ ప్రభుత్వం విదేశాలకు నేరుగా బియ్యం ఎక్స్పోర్ట్ చేస్తుంది ఫిలిప్పీన్స్,మలేషియా దేశాలతో నేరుగా తెలంగాణ ప్రభుత్వం లీవీగే చేసుకుంది.

## మోటారుబైక్, కారు ఢీకొని వ్యక్తి మృతి

**కావలిరూరల్ (నెల్లూరు), మే 5, ప్రభాతవార్త :** కావలి ముసునూరు జాతీయరహదారిపై బ్లూమూన్ డాబా వద్ద సోమవారం మోటారుబైక్‌ను కారు ఢీకొని వినుకొండ శ్రీనివాసులు (50) మృతిచెందడం జరిగింది. కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామానికి చెందిన వినుకొండ శ్రీనివాసులు, వింత శివకుమార్‌రెడ్డిలు కలిసి మోటారుబైక్‌పై గౌరవరం నుండి కావలికి వస్తుండగా మార్గంమధ్యలో కావలి ముసునూరు జాతీయరహదారివద్దగల బ్లూమూన్ డాబా దగ్గర నెల్లూరు వైపునుంచి ఒంగోలు వైపుకు వెళుతున్న కారు డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడిపి ముందు వెళుతున్న మోటారుబైక్‌ను ఢీకొనగా ఈ ప్రమాదంలో వినుకొండ శ్రీనివాసులుకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందడం జరిగిందని తెలియచేశారు. వింత శివకుమార్‌రెడ్డికి తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారన్నారు. మృతిచెందిన వినుకొండ శ్రీనివాసులుకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వార్త

వ్యక్తులను బట్టి సమాజం తీరు ఉంటుంది. ముందు వ్యక్తి మంచి ఆలోచనలకు, మంచి అలవాట్లకు మారాలి. అప్పుడే సమాజం బాగుంటుంది.

-లావోసు

## ఎకానమీ కొత్త పుంతలు

సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను కొత్త పుంతలు తొక్కించే విధంగా కేంద్రప్రభుత్వం అడుగులు వేస్తోంది. దేశాన్ని ప్రపంచ సాంస్కృతిక పర్యాటకానికి ప్రత్యామ్నాయంగా తీర్చిదిద్ది, ఆరెంజ్ ఎకానమీ దిశగా పయనింపచేసేందుకు ప్రధాని నరేంద్ర మోడీ శ్రీకారం చుట్టారు. సంగీతం, సినిమాలు, కళలు, ఫ్యాషన్,డిజైనింగ్, ఆటలు, ఓటిటి, కామిక్స్, కృత్రిమ మేధను ఒకేసారి, డిజిటల్ మీడియాతో అనుసంధానిస్తూ మీడియా,వినోద, తదితర రంగాలలో సేవలు, ఉత్పత్తులు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారించి త్వరగా దేశ ఆర్థిక వ్యవస్థను సముజ్వలంగా ప్రగతి పథంలో నిలబెట్టాలనేదే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. ఇప్పటికే ఓటిటీ కంటెంట్లో 25 శాతం వీక్షకులు విదేశీయులే. భారతీయ చిత్ర,టీవీ, ఆన్లైన్ వీడియో సర్వీసు పరిశ్రమలు ఏ స్థాయిలో ఉన్నా వాటి వల్ల 26.4 లక్షలమందికి ఉపాధి ఉద్యోగాలు లభిస్తున్నాయి. 6.12వేల కోట్ల డాలర్లకు పైగా వార్షిక రాబడి లభిస్తోంది. సినిమా రంగాన్ని కేవలం ఆర్థిక వ్యవహారం దేశాల మధ్య సాంస్కృతిక వారధిగా తన వంతు సేవలు అందివ్వగలదు. మన దేశంలో 20 నుంచి 25 లక్షల మంది క్రియాశీలక డిజిటల్ క్రియేటర్స్ ఉన్నారు. వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ ( వేవ్స్) ప్రధాని ముంబైలో జరిగిన సదస్సులో శ్రీకారం చుట్టారు. చలనచిత్ర నిర్మాణం, కొత్త మీడియా సాంకేతికతలపై ప్రాధాన్యత నేటి యువతప్రయోజనాలకు అనుగుణం ఈ కార్యక్రమం రూపకల్పన చేయబడింది. వేవ్స్ సమ్మిట్ యువతతో భాగస్వామ్య అంశాలను ప్రతిబింబించే అనేక మార్గాలను అన్వేషించింది.ఈ నేపథ్యంలోనే కృత్రిమ మేధ, వి ఎఫ్ ఎక్స్, గేమింగ్లో ఏటా 10 వేలమందికి పైగా యువతకు నైపుణ్యం కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుంది. సృజనాత్మక సృష్టికర్తలు మాత్రమే దేశాల మధ్య ప్రయోజనాలను అనుసంధానపరచగలరన్న ఏకైక సూత్రం ఆధారంగా ఈ కార్యక్రమం రూపొందించారు. అడోబ్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ యాక్సెంచర్తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. సృజనాత్మక కథలు సృష్టించడం ద్వారా ప్రపంచానికి మార్గదర్శనం చేయాలన్నదే" వేవ్స్ "సమ్మిట్కు ప్రధాని ఇస్తున్న సందేశం. ఈ నేపథ్యమే ఆరంజ్ ఆర్థికవ్యవస్థ ఆవిర్భావం .కావునసంస్కృతి,కళ మేధో విలువలతో కూడిన అంశాలు దీనిలో ఇమిడి ఉన్నాయి. సేవలు ఉత్పత్తినే ఆరెంజ్ ఎకానమీ అంటారు. అత్యాధునిక పరిజ్ఞానం ఉపయోగించుకుని సేవలు ఉత్పత్తిని పెంచటమే "వేవ్స్" ప్రధాన వ్యాపకం.ప్రపంచకేంద్రంగా భారత్లో ఆరెంజ్ ఎకానమీ అభివృద్ధి చెందుతున్నదని పేర్కొన్నారు. ఇందులో వచ్చే సత్ఫలితాలు చలనచిత్ర నిర్మాణం,డిజిటల్ కంటెంట్,గేమింగ్, ఫ్యాషన్, సంగీతం,స్టోరీ టెల్లింగ్, యానిమేషన్, ప్రత్యక్ష కచేరీలకు భారత్ కేంద్రంగా ప్రపంచానికి మార్గదర్శనం చేస్తాయని అన్నారు. పెట్టుబడిదారులు వేదికలపైనే కాదు, ప్రజలలో కూడా వారి క్రియేటివిటీను అందించాలి. భారతీయ యువత విజయగాథలు, కథలను ప్రపంచానికి చేరే విధంగా ఉండాలి కంటెంట్ సృష్టిలో యువత ప్రధాన పాత్ర వహించాలని ఆయన ఆకాంక్షించారు.యువతలో సృజనాత్మకతకు ఎవరూ అడ్డుకట్ట వెయ్యలేనిది. వారి శైలి,స్ఫూర్తికి ఎలాంటి హద్దులు ఉండవు కనుక వారే కంటెంట్ సృష్టి చేయగలరని వారిని మాత్రమే జనం నమ్ముతారని మోదీ విశ్లేషణ. వేవ్స్ ప్రపంచ ఆడియో విజువల్,వినోద సమ్మిట్ కంటే ఎక్కువే. బిలియన్ కంటే ఎక్కువ జనాభాఉన్న భారతదేశం బిలియన్ కంటేఎక్కువ కథలకు నిలయంగా ఉంది. ఈ సమ్మిట్లో భారతీయ చలనచిత్ర ఉద్దండ నటులు, ప్రముఖ పారిశ్రా మికవేత్త ముకేష్ అంబానీ తదితరులు పాల్గొన్నారు. కంటెంట్ సృష్టికర్తలు అన్ని విభాగాల నుంచి అనుసంధా నించే లక్ష్యంతో మీడియా, వినోద రంగాలను విస్తరించింది. భారత్లో సృష్టించడానికి,ప్రపంచం కోసం సృష్టించడానికి ఇది సరైన సమయంగా ప్రధాని అభిప్రాయపడ్డారు. సృజనాత్మకత గేమింగ్, సంగీతం, చిత్ర నిర్మాణాలలో తరచూ మనకి కనిపిస్తుంది. ఈ సృజనాత్మకతే భారతీయ జీడీపీని వృద్ధిచేస్తుందని అభిప్రాయపడ్డారు. యువత సామర్థ్యంపై పెట్టుబడి పెట్టాలని ప్రధాని పెట్టుబడిదారులను ఆహ్వానించడం గమనార్హం. ప్రపంచ ప్రేక్షకులు కథలు చెప్పే కొత్త మార్గాలను కోరుకుంటున్నారని,భారత్లో యువత దాన్ని సృష్టించాలని మోదీ పిలుపునిచ్చారు. భారతీయ సినిమాలు ప్రపంచ ప్రేక్షకులను చేరుకుంటున్నాయని,ఇటీవల ఓటీటీ ఫ్లాట్ ఫాంలు పదిరెట్లు పెరిగిన విషయం గుర్తు చేసారు. భారత దేశ కథలు ప్రపంచ నలుమూలలకు చేరేలా చూడాలన్నారు. రామాయణం, మహాభారతం వరకూ భారత్కు కథలు చెప్పేశక్తి ఏ దేశానికి లేదన్నారు.ఇవి భారత్తో పాటు ప్రపంచాన్ని ఒక్కటిగా ఉంచే శక్తి ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ రంగ ప్రవేశంతో ఆరెంజ్ ఎకానమీ రూపురేఖలు మారనున్నాయి. భారత్లో కంటెంట్ సృష్టితో ఈ రంగం 100 బిలియన్ డాలర్లమార్క్ ను దాటడం ఖాయమని చెప్పవచ్చు. భారతదేశ సృజనాత్మక ఆర్థికవ్యవస్థను పెంచడం, ప్రతిభను పెంపొందించడం, నైపుణ్య అవకాశాలను అందించడంపై వేవ్స్ సమ్మిట్ దృష్టి సారించడం వల్ల దేశవ్యాప్త ప్రయోజనాలు నెరవేరతాయి. కంటెంట్ సృష్టి, చలనచిత్ర నిర్మాణం, కొత్త మీడియా సాంకేతికతలపై ప్రాధాన్యత నేటి యువకుల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటుంది, అతి త్వరలోనే ఆరంజ్ ఎకానమీ లక్ష్యం నెరవేరేందుకు మార్గం సుగమం అయ్యింది.

విద్య అనేది శాస్త్రాలను వివరించేందుకే పరిమితం కారాదు. ఒక పరిపూర్ణమైన మానవుని తీర్చిదిద్దేదే అసలైన విద్య.



రవీంద్రనాథ్ ఠాగూర్

ఏదైతే శారీరకంగా కానీ, మానసికంగా కానీ ఆధ్యాత్మికంగా కానీ నిన్ను బలహీనుణ్ణి చేస్తుందో, దానిని వెంటనే విషంలాగా పరిత్యజించు.



స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### నెరవేరబోతున్న ఆకాంక్షలు

మేనెల 2వ తారీఖున ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీద ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిలో పున: ప్రారంభోత్సవంచేసారు.49వేల కోట్లరూపాయలతో పునరుజ్జీవనం జరగడానికిచర్యలుమొదలయ్యాయి. ఈబ్రహుత్తరప్రాజెక్టు పూర్తి కావడానికి మూడు సంవత్సరాలు పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడం జరిగింది. అలాగే గోదావరి నది మీద నిర్మిస్తున్న పోలవరం కూడా మూడు సంవత్సరాలలో పూర్తిచేయాలనే సంకల్పంలో ప్రభుత్వం ఉన్నది. తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తరువాతఆంధ్రప్రదేశ్ దేశంలోనేబీదరాష్ట్రంగా మారిపోయింది. అందుచేత అన్ని రంగాలలో రాష్ట్రాభివృద్ధికి కేంద్ర నుండి ఆర్థిక సహాయం తప్పని సరిగా కావాలి. కేంద్ర సహాయంతో ఆంధ్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరబోతున్నాయి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### వికలాంగుల సదస్సులు నిర్వహించాలి

2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం వికలాంగుల సమస్యల సాధన కోసం ప్రభుత్వం సదస్సులు ఏర్పాటు చేయాలి.ఉద్యోగ వికలాంగులకు, నిరుద్యోగ వికలాంగులకు వేరువేరుగా సదస్సులను ఏర్పాటు చేయాలి. నిరుద్యోగ వికలాంగులకు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అమలు చేయడానికి సదస్సులను ఏర్పాటుచేయాలి. ప్రభుత్వం నిధులు నియామకాలలో తప్పనిసరిగా 5 శాతం నిధులు వికలాంగులకు కేటాయించాలి.

-రాపాక రవీందర్, జనగాం

### పోలీసుల నిఘా అవసరం

నేడు సామాజికమాధ్యమాల్లో వస్తున్నకొన్నికొన్ని పోస్టుల్ని చూస్తూంటే మనంమన భారతదేశంలోనే ఉన్నామా? అనే సందేహంకలుగుతోంది.ముఖ్యంగా, పెహల్గాంలో హిందూ పర్యాటకులపై పాక్ ఐ.ఎస్.ఐ.,ఎల్.ఇ. టి.లు కలిసి చేసిన దారుణమారణహోమాన్ని సమర్థించేలా, సైన్యం సాగిస్తున్న ఉగ్రవాదుల నిర్మూలననీ విమర్శించే లా కొందరు పెడుతున్న పోస్టులు చూస్తూంటే పైసందేహం కలుగుతోంది. దేశంలో సామాజికమాధ్యమాల పై పోలీస్ నిఘా అవసరం.కనుక రాష్ట్రప్రభుత్వాలుస్పందించి పాకిస్థాన్ ఉగ్రమూక దారుణాల్ని సర్దించేలా పోస్టులు పెడుతున్న వారిపై నిఘావేసి అవసరమైతే అరెస్ట్ చేయాలి.

-వీరుభొట్ల పేరయ్యశాస్త్రి, విజయవాడ

### పాకిస్థాన్కి తగిన గుణపాఠం

జమ్మూకాశ్మీర్లోని పహల్గాం ఉగ్రదాడికి చిమ్మిన రక్తపుటేరులకు ప్రతీకారంగా పాకిస్థాన్ జీవనాడులపై భారతదేశం తేరుకోలేని దెబ్బకొట్టింది. అదే సింధూజలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేయడం. గతంలో పాకిస్థాన్తో 1965, 1971, కార్గిల్ యుద్ధాలు, సైనిక ఘర్షణలు జరిగిన ఉద్రిక్త పరిస్థితుల్లో కూడా నదుల జలాల సరఫరాలో పాకిస్థాన్కు ఎలాంటి ఇబ్బందులు రాకుండాఉండాలనే ఉద్దేశ్యంతోనే ఈ ఒప్పందం రద్దు కాకుండా భారత్ సహనం వహించింది. కానీ ఈసారి పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్ర తోడేళ్ల ఘాతుకానికి అభమూ శుభమూ తెలియని పర్యాటకులు నెత్తుటి మడుగులో నేల కూలడం భారత్కు సహనం నశించి రక్తం మరిగి ఈ ప్రతీకార చర్య తీసుకుంది. ప్రపంచంలోనే అతి తక్కువ నీటి వనరులున్న దేశాల్లో పాకిస్థాన్ ఒకటి. భారత దేశం నిర్ణయం వల్ల పాకిస్థాన్లో ఆహార ఉత్పత్తి దెబ్బతిని దానిఫలితంగా కొన్నిలక్షల మందికి ఆహారభద్రత లేకుండా పోతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలి

నవంబర్ 1, 2002కి ముందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వహైస్కూల్స్ లో గ్రేడ్1,గ్రేడ్2 తెలుగు/హిందీ పండిట్ పోస్టులు ప్రత్యేకంగా ఉండేవి. అదేవిధంగా సెకండరీ గ్రేడ్ టీచర్లు ఆరు, ఏడుతరగతుల బోధనలో పాలుపంచుకునే వారు. కొన్ని హైస్కూల్స్ లో బీఈడీ అసిస్టెంట్లు లేదా స్కూల్ అసిస్టెంట్లు పదవీ విరమణ కారణంగా పోస్టులు ఖాళీగా ఉండేవి. అటువంటిసందర్భాలలో,ఉన్నటీచర్లలో,ముఖ్యంగా గ్రేడ్2 తెలుగు/హిందీ పండిట్లు హైయర్ క్లాసుల బోధన (8వ తరగతి పైగా) చేపట్టేలా హెడ్మాస్టర్లు అధికారిక ఆదేశాల ద్వారా నియమించేవారు. ఈ విధంగా, వారు వాస్తవంగా స్కూల్ అసిస్టెంట్ విధులను నిర్వహించినప్పటికీ, నోషనల్గా అయినా స్కూల్ అసిస్టెంట్ సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలి.

-రాపాక రవీందర్, జనగాం

### మాతృభాషను కాపాడుకుందాం

ప్రభుత్వం ఇతర భాషలో మార్కులను దృష్టిలో ఉంచుకొని ఆలోచించడమే తప్ప తెలుగు భాషా ప్రావీణ్యాన్ని విద్యార్థులకి తెలుపలేకపోతుంది. ప్రపంచంలోనే రెండవ ఉత్తమ లిపిని కలిగిన తెలుగు భాషను మనం మరుగున పడేస్తున్నాం. ఇదంతా భాష మీద మనకున్న నిర్లక్ష్యంలా అనిపిస్తుంది.

-కాల్వ నిఖిత, సిద్దిపేట

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# కులగణన చరిత్రాత్మక నిర్ణయం

**దేశవ్యాప్తంగా త్వరలో మొదలయ్యే జనాభా లెక్కలతో పాటు కులగణను చేపట్టాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్గాంధీ ఎక్కడ పర్యటించినా ప్రధానంగా కులగణన గురించి మాట్లాడుతున్నారు. జనాభా ప్రాతిపదికన ప్రజలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇస్తున్నారు. దేశవ్యాప్తంగా అన్నివైపుల నుంచి డిమాండ్ పెరుగుతూ వచ్చింది. కులగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని బీసీ సంఘాలు సుప్రీం కోర్టుకు కూడా వెళ్లాయి. ఈ ఏడాది చివర్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తరుణంలో ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం కులగణన నిర్ణయం తీసుకునీ ప్రతిపక్షాలకు మాస్టర్ స్ట్రోక్ ఇచ్చిందనే విమర్శ కూడా ఉంది. శాస్త్రీయ పద్ధతిలో కులగణన సమాచారాన్ని సేకరించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఈ కులగణన ఎంతో ఉపయుక్తం కానుంది.**

**పాకాల శంకర్ గౌడ్**

వేదకాలంలో సమాజంలో నాలుగు వర్ణాలు బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ, శూద్రులుగా ఉండేవి. వర్ణాల నుండే కులాల ఏర్పడ్డాయనే వాదన ఉంది. క్రీ.పూ 1500లో ఆర్యులు భారతదేశానికి వచ్చారు. సామాజిక చారిత్రక సిద్ధాంతం ప్రకారం భారతదేశంలో కుల వ్యవస్థ ఆర్యుల రాకతో ప్రారంభమైంది. కులం సమాజాన్ని, సామాజిక దొంతరలుగా విభజించే వ్యవస్థ. భారతీయ సమాజంలో కులం అంతర్భాగం. కులవ్యవస్థ వ్యక్తి పుట్టుకతో నిర్ణయించబడిన వర్గ నిర్మాణం. వ్యక్తిగత జీవనశైలి ద్వారా సాధించే సామాజిక గౌరవం ద్వారా కులం ప్రాథమికంగా నిర్వచించబడుతుంది.భారత ప్రభుత్వం పార్లమెంటులో ప్రకటించినట్లు దేశంలో 3000కులాలు, 25000 ఉప కులాలు ఉన్నాయి. నిజానికి భారతదేశంలో మనం చూస్తున్న కుల వ్యవస్థను జాతి అంటారు. భారతీయ సమాజం సమగ్ర చిత్రాన్ని రూపొందించాలన్నా, సమాజంలో గల సామాజిక ఆర్థిక వెనుకబాటుతనాన్ని నిర్మూలించి అసమానతలు తగ్గించాలన్నా, దేశంలో కుల నిర్మూలన చేయాలన్నా వనరుల సమాన పంపిణీ కోసం,పథకాల రూపకల్పనకు కులాల సమగ్ర సమాచారం అవసరం. నవంబర్ 25, 1949లో నవ భారత నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తన చివరి ఉపన్యాసంలో ప్రతి మనిషికి ఒక ఓటు ప్రతి ఓటుకు సమాన విలువ ఇవ్వడం ద్వారా రాజకీయ రంగంలో సమానత్వాన్ని సాధించాం. సాంఘిక ఆర్థిక రంగాల్లో సమానత్వం సాధించాలి. భవిష్యత్తు పాలకులు అందుకు కృషి చేయాలి అని అన్నారు. సాంఘిక ఆర్థిక సమానత్వ కోసం కులగణన అవశ్యకం. భారత రాజ్యాంగం కుల గణనను చేయడాన్ని సమర్థిస్తోంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 340 ప్రకారం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల పరిస్థితులను పరిశోధించడానికి, ప్రభుత్వాలు తీసుకోవలసిన చర్యలకు సంబంధించి సిఫార్సులు చేయడానికి ఒక కమిషన్ను నియమించాలని ఆదేశించింది. భారతదేశంలో మొట్ట మొదటిసారిగా 1872లో జనాభా లెక్కలు ప్రారంభం అయ్యాయి. సామాజిక, ఆర్థిక కులగణన మొట్టమొదట 1931లో నిర్వహించారు. ఇది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని భారతీయ కుటుంబాల ఆర్థిక స్థితిగతులపై సమాచారాన్ని సేకరించడం,లేమి సూచికలను గుర్తించడం లక్ష్యంగా పెట్టుకుంది. 1941లో కూడా కులగణన చేయాలనే అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించి సమాచారం సేకరించింది.కానీ రెండో ప్రపంచ యుద్ధం వల్ల ఆ సమాచారాన్ని బయటపెట్టలేకపోయింది. 1951 తర్వాత జాతీయ ఐక్యతను పెంపొందించడానికి కుల గణన సేకరణను నిలిపివేయాలనీ అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది.1951 నుండి 2011 వరకు స్వతంత్ర భారతదేశంలోని ప్రతీ జనాభా గణనలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు సంబంధించిన సమాచారం సేకరించి ప్రచురించారు. దేశవ్యాప్తంగా బీసీలు 52 శాతం ఉన్నారన్న మండల్ కమిషన్ రిపోర్ట్ కూడా 1931 కుల గణన ఆధారంగా చేసుకుని చేసినవే. రిజర్వేషన్లు 50శాతం దాటకూడదని నిబంధన దృష్టిలో ఉంచుకొని ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్లను మండల్ కమిషన్ సిఫారసు చేసింది. నేషనల్ శాంపిల్ సర్వే 2011-12 లెక్కల ప్రకారం అగ్రకులాలతో పోల్చినప్పుడు బీసీ, ఎస్సీ, ఎస్టీలు చాలా వెనుకబడి ఉన్నారని తెలుస్తుంది. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 2016-17 ప్రకారం దేశంలో 28శాతం ప్రజలు మల్టీ డైమెన్షనల్ పార్టీ పరిధిలో ఉన్నారు. ఎస్టీలు 50శాతం,ఎస్సీలు 33శాతం, ఒబిసిలు 27శాతం పేదరికంలో ఉన్నారు. నేషనల్ శాంపిల్ సర్వే 2017-18 ప్రకారం విద్యారంగంలో ఎస్టీలు 3శాతం ఎస్సీలు, 4శాతం, ఒబిసిలు 6శాతం జనరల్ క్యాటగిరి 12శాతం గ్రాడ్యుయేట్స్ ఉన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేట్స్లో జనరల్ కేటగిరిలో 3శాతం ఒబిసిలో 1 శాతం మాత్రమే ఉన్నారు. ఉపాధిరంగం జనరల్ కేటగిరిలో 30శాతం ఒబిసిలో 20శాతం, ఎస్టీలు 12 శాతం మాత్రమే స్థిరమైన ఉద్యోగాలు పొందుతున్నారు. రోజువారి కూలీలు ఎస్టీలు 29శాతం, ఎస్సీలు 38శాతం ఒబిసిలు 20శాతం జనరల్ కేటగిరిలో 11శాతం మాత్రమే ఉన్నారు.కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 2021 లెక్కల ప్రకారం 52.7శాతం మంది జనరల్ కేటగిరి చెందిన వారే ఉన్నారు. అందులో కూడా అధిక వేతనం అందుకునే ఉన్నత ఉద్యోగాల్లో 64శాతం పైగా జనరల్ కేటగిరీ వారుఉన్నారు.ఈ గణాంకాలన్నీకేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సంస్థలు అధికారికంగా వెల్లడించినవే. వీటిని క్షుణ్ణంగా పరిశీలిస్తే అన్ని రంగాల్లో జనరల్ కేటగిరి వారితో పోల్చితే ఒబిసిలు, ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా సామాజికంగా చాలా వెనుకబడ్డారని మనకుఅర్థమవుతుంది. దేశవ్యాప్తంగా కులగణన చేస్తామని బీసీల రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్పార్టీ గత పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది.2011లో నాటి యుపిఎ హయంలో కుల గణన కోసం ప్రణాళికలు తయారు చేసే నిధులు కూడా కేటాయించింది. కానీ కులగణనకు బదులుగా సామాజిక ఆర్థిక సర్వే 2011నిర్వహించారు. ఇప్పటివరకు ఆ నివేదికను కూడా బహిర్గతపరచలేదు.వామపక్ష పార్టీలైన సిపిఐ, సిపిఎంలు కులగణన మద్దతుగా తీర్మానాలు చేశాయి.కుల గణన వల్ల సమాజంలో కులవ్యవస్థను బలోపేతం అవుతుందని, కులాలవారీగా ప్రజలను వర్గీకరించడం అంటే వ్యక్తిగత హక్కులు హరించడమే అని,కులాలను నిర్వచించడం కష్టమని ఇది సమాజంలో గందరగోళం, వివాదాలకు దారి తీసి దేశ సమగ్రతకు భంగం కలిగిస్తుందనే వాదన కూడా ఉంది. కులగణనకు అనుకూలంగా,వ్యతిరేకంగా వాదనలు ఉన్నప్పటికీ, సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించడానికి,వనరుల సమాన పంపిణీని నిర్ధారించడానికి వెనుకబడిన కులాల జనాభా సమాచారం అవసరం.సమగ్ర కులాల సమాచారం సామాజిక అసమానతలను పరిష్కరించడంలో, సమానత్వ సమాజాన్ని రూపొందించడంలో సహాయపడుతుంది.దేశంలో కులగణనకు బీహార్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు ఆదర్శంగా నిలిచాయని చెప్పవచ్చు. సామాజిక న్యాయం కోసం కులగణన జరిగి తీరాల్సిందేనని దేశవ్యాప్తంగా డిమాండ్లు ఉన్నా కేంద్ర ప్రభుత్వం గతంలో చర్యలు తీసుకోలేదు. ఆలస్యమైనా కూడా ఈసారి కేంద్ర ప్రభుత్వం రాబోయే జన గణనతోపాటు కులగణన చేయాలనే నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకం. బీహార్లో 2023లో ఎన్డిఏ ప్రభుత్వం కులగణన చేసి 63.14శాతం ఓబిసిలు ఉన్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు కర్ణాటకలో కులగణన చేసి ఈబీసీలు 69.6శాతం ఉన్నారని లెక్క తేల్చింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల వాటా 46.25శాతం, ముస్లిం మైనారిటీలను బీసీలను కలుపుకుంటే ఈ బీసీల వాటా 56.33శాతం ఉందని లెక్కలు తేల్చాయి. ఈ కులగణన ఫలితాల తర్వాత జనాభాలో సగానికి పైగా ఉన్న ఓబీసీలకు కేవలం 27శాతం రిజర్వేషన్ ఇవ్వడం ఏ సామాజిక న్యాయం అనే చర్చ దేశవ్యాప్తంగా తీవ్రంగా జరుగుతుంది. 2018లో పార్లమెంట్ సాక్షిగా అప్పటి రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ భారతదేశంలో రాబోయే జనగణనలో కులగణన తప్పకుండా చేస్తామని హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా త్వరలో మొదలయ్యే జనాభా లెక్కలతో పాటు కులగణను చేపట్టాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎక్కడ పర్యటించినా ప్రధానంగా కుల గణన గురించి మాట్లాడుతున్నారు. జనాభా ప్రాతిపదికన ప్రజలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇస్తున్నారు. దేశవ్యాప్తంగా అన్నివైపుల నుంచి డిమాండ్ పెరుగుతూ వచ్చింది. కులగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని బీసీ సంఘాలు సుప్రీంకోర్టుకు కూడా వెళ్లాయి.ఈ ఏడాది చివర్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తరుణంలో ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం కుల గణన నిర్ణయం తీసుకునీ ప్రతిపక్షాలకు మాస్టర్ స్ట్రోక్ ఇచ్చిందనే విమర్శ కూడా ఉంది. శాస్త్రీయ పద్ధతిలో కుల గణన సమాచారాన్ని సేకరించి పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఈ కులగణన ఎంతో ఉపయుక్తం కానుంది. •



# జంతువుల హక్కులను పరిరక్షించాలి

**రామ కిష్టయ్య సంగన భట్ల**

మానవులకు పెంపుడు జంతువులు ఎన్నో ప్రయోజనాలు చేకూరుస్తున్నాయి. కొద్దిపాటి ప్రేమాభిమానాలకు, సంరక్షణకే పెంపుడు జంతువులు ప్రేమను, విశ్వాసాన్నీ కలిగి ఉంటాయి. పెంచే వారినే సర్వస్వంగా భావిస్తాయి. అవి మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలుగజేస్తు, కుటుంబంలో సభ్యులుగా మారి చేదోడువాదోడుగా నిలుస్తున్నాయి. ఒక రకంగా వ్యాయామాన్ని, ఆరోగ్యాన్నీ ప్రసాదిస్తున్నాయి. భారత రాజ్యాంగపు 21వ అధికరణం వ్యక్తిగత స్వేచ్ఛ, జీవన హక్కులను ధృవపరుస్తున్నది. భారత పౌరులకు జంతువులను పెంచి పోషించే హక్కును ఈ అధికరణం ధృవపరుస్తున్నది. జంతువుల పట్ల జాలి, పరితాపములను చూపాలని భారత రాజ్యాంగం 51 ఎ అధికరణం పౌరుల ప్రాథమిక బాధ్యతలను నిర్వచిస్తున్నది. కుక్క,పిల్లి, చేపలు, పక్షులు ఏవైనా మనం పెంచే మూగజీవాలను ప్రేమగా చూసుకోవాలి. వాటికి అధికంగా స్వేచ్ఛ కల్పించాలి. విశాలమైన తిరుగాడే సౌకర్యాన్ని కలిగించాలి. పెంపకంలో జాగ్రత్తలు తీసుకుని, వాటిని సంతోషంగా ఉంచుతూ మచ్చిక చేసుకోవాలి. పెంపుడు జంతువుల నివాస, తిరుగాడే స్థలాలను, ఉపయోగించే వస్తువులను శుభ్రపరచాలి. వాటిని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. జంతువులకు ముందు జాగ్రత్తగా టీకామందులు వేయించడం, నిర్లక్ష్యం వహించక, క్రమం తప్పకుండా వాటిని పశు వైద్యుడి దగ్గరికి తీసుకెళ్ళడం విధిగా చేయాలి. జంతువుల పట్ల ప్రేమ, ముద్దు మురిపాలు పరిమితులు దాటరాదు. కానీ వాటితో అస్తమానం అంటిపెట్టుకుని ఉండడం మంచిది కాదు. కొన్నిచోట్ల పెంపుడు జంతువుల పట్ల ఎలా మసలుకోవాలనే అంశంపై ప్రత్యేకంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే మాంసం కోసం, వినోదం



కోసం కొందరు అనేక రకాలుగా జంతువులకు కష్ట నష్టాలు కలిగిస్తున్నారు. ఆవు, మేక, గేదె మొదలైన జంతువులు ఎక్కువ పాలు ఇవ్వడం కోసం, అలాగే కొన్నింటిని పోటీల్లో గెలుపు కోసం రసాయనాల ఇంజెక్షన్లు ఇస్తూ వానిని హింసిస్తున్నారు. జంతు సంక్షేమానికి సంబంధించి 1960లో పార్లమెంటులో చట్టం రూపొందింది. ఈ చట్టం ప్రకారం జంతువులను ఉద్దేశ్యపూర్వకంగా గానీ, నిర్లక్ష్యంగా గానీ బంధించినా, ఇబ్బంది కలిగించినా శిక్షార్హులు అవుతారు. 1960 డిసెంబర్ 26 నుంచి ఈ చట్టం అమలులో ఉంది. భారత పార్లమెంటు రూపొందించిన జంతువుల పట్ల క్రూరత్వం నివారణ చట్టం సెక్షన్ 11 (1) నుండి (ఒ), ప్రకారం జంతువులను వేటాడటం, స్వాధీనం లేదా పట్టుకోవడం, ఏ జంతువునైనా అవయవమును తొలగించ డం లేదా చంపడం వంటి అనేక ఇతర క్రూర చర్యలకు బాధ్యులైన వారిని చట్టం ద్వారా శిక్షిస్తారు. జంతు రవాణాలో అనవసర హింసకు పాల్పడేవారికి,జంతువులను కిక్కిరిసినట్టుగా వాహనాల్లో నింపేవారికి, జంతు వుల కాళ్లుకట్టేసి వాహనాలపై తీసుకువెళ్ళే వారికి రూ.100 లేదా మూడు నెలల కారాగార శిక్ష లేదా రెండు శిక్షలూ కలిపి విధించవచ్చు. భారత శిక్షాస్మృతి సెక్షను 428,429 కింద జంతువులను భయపెట్టడం, గాయపరచడం చట్టవిరుద్ధం. జంతువులను లేదా జంతు సంరక్షకులను భయ కంపితులను చేయడాన్ని 1860 భారత శిక్షాస్మృతి సెక్షన్ 503 ప్రకారం తెలిసి లేదా స్పృహతో చేస్తున్న నేరంగా పరిగణిస్తారు. ఇటువంటి వారిని ఎటువంటి వారెంటు లేకుండా అదుపులోకి తీసుకోవచ్చు. జంతుసంపదను పరిరక్షించడం, వాటిని వృద్ధి చేయడంతోపాటు జంతువుల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. మానవ మనుగడకు అనివార్యమైన పలు ప్రాయోజితాలైన జంతుసంపదను పరిరక్షించడం, వృద్ధిచేయడం, మానవీయ కోణంలో చూడడం, తగిన స్వేచ్ఛ కల్పించడం అందరి బాధ్యత. •

# భారత శక్తి భవితవ్యానికి గ్రీన్ ట్రాక్ వేస్తుందా?

**డి జె మోహన రావు**

దేశం పునరుత్పాదక శక్తుల వైపు అడుగులు వేస్తున్నఈ సంక్రమణ దశలో, జాతీయ హరిత హైడ్రోజన్మిషన్" అనేది భారత శక్తి రంగంలో ఊహించని మార్పులకు నాంది పలుకుతుంది. జల,వాయు మార్పులను ఎదుర్కొనడానికి, కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి, శాశ్వత ఇంధనభద్రతకు దారితీసే ఈచర్య ఒక ద్రష్టవ్యమైన ముందడుగు. అయితే ఈ గమ్యానికి చేరే మార్గం ఎంత సులభం? ప్రయాణం ఎంత స్థిరంగా సాగుతోంది?అనేక అంశాలు విశ్లేషణకు ఉపక్రమిస్తున్నాయి. 2023 జనవరిలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్ లక్ష్యం 2030 నాటికి 5మిలియన్ మెట్రిక్ టన్నుల హరిత హైడ్రోజన్ను ఉత్పత్తి చేయడం. ఇది దేశానికి స్వచ్ఛమైన ఇంధన సాధన మాత్రమేకాక, ప్రపంచ హైడ్రోజన్ మార్కెట్లో భారత దేశం స్థానం కల్పించాల్సిన మిషన్గా మారింది. 125 గిగావాట్ల రిన్యూవబుల్ విద్యుత్ సామర్థ్యం ఏర్పాటునూ దీని ద్వారా సాధించాలన్నది కేంద్రం లక్ష్యం. దీని కోసం కేంద్రం రూ.19,744 కోట్ల బడ్జెట్ను కేటాయించింది. ఇందులో అత్యధికంగా సైట్ ( ఎస్ఐజిహెచ్టి స్ట్రాటజిక్ ఇంటర్వెన్షన్స్ ఫర్ గ్రీన్ హైడ్రోజన్ ట్రాన్సిషన్ )ప్రోగ్రాంకు రూ.17,490 కోట్లు వెచ్చించబడతాయి. పైలట్ ప్రాజెక్టులు, పరిశోధన అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలకు మిగతా నిధులు కేటాయించబడ్డాయి. ప్రస్తుతం ఈ మిషన్ అమలు దశలో ఉన్నా, వేగం ఆశించిన స్థాయిలో లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా కొన్ని ప్రయోగాత్మక ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా వంటి రాష్ట్రాలు హరిత హైడ్రోజన్ హబ్ల ఏర్పాటుకు ముందంజలో ఉన్నాయి. విశాఖపట్నంలో హరిత హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుపై ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. ఇది ఆంధ్రప్రదేశ్కు గర్వకారణం. కానీ తెలంగాణ ఈ రంగంలో ఇంకా గణనీయమైన పాత్ర పోషించలేదు. ఇది సమయస్ఫూర్తి కలిగి ముందుకెళ్లాల్సిన సందర్భం. 2025-26 బడ్జెట్లో కేంద్రం ఈమిషన్కు రూ.600 కోట్లు కేటాయించింది. ఇది గత సంవత్సర కేటాయింపుతో పోలిస్తే రెండు రెట్లు అధికం. కానీ ఈ మొత్తం, ఈ మిషన్కి అవసరమైన వాస్తవిక వ్యయంతోపోల్చుకుంటే, సరిపడినదేనా అన్నదానిపై సందేహాలున్నాయి. ఇంకా,ఖర్చు ఆధారంగా ఇప్పటివరకు ఎంత నిధులు ఖర్చుఅయ్యాయన్న వివరాలు పూర్తిగా ప్రజల ముందు లేవు. ఈ మిషన్ అమ




లులో రాష్ట్రాల పాత్ర అమితమైనది. భూముల కేటాయింపు, నీటి వనరుల యాక్సెస్, పవర్ కనెక్షన్లు, పరిశ్రమల అనుమతులు, లోకల్ పొల్యూషన్ కంట్రోల్ నిబంధనలు ఇవన్నీ రాష్ట్రాల చేతిలోనే ఉన్నాయి. కేంద్రం లక్ష్యాలు ఎంత ఉన్నా, రాష్ట్రాలు సమన్వయం లేకుండా ముందుకు వెళ్లడం కష్టమే. ఈ విషయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య స్పష్టమైన వ్యూహాత్మక వ్యత్యాసం కనిపిస్తోంది. ఈ మిషన్ ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ముందుగా చెప్పాల్సిందేమంటే హరిత హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చు ఇప్పటికీ అధికంగా ఉంది. ప్రస్తుతం 1 కిలో హరిత హైడ్రోజన్ను ఉత్పత్తి చేయడానికి సగటున రూ.250-300 పడుతోంది. ఇది గ్రే హైడ్రోజన్తో పోల్చితే రెండింతలు. అయితే 2030 నాటికి దీన్ని రూ.100 లోపు తేలికగా ఉత్పత్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం.అలానే, ఎలక్ట్రోలైజర్ తయారీ సామర్థ్యం భారత్లో ఇంకా తక్కువ స్థాయిలో ఉంది. ఎలక్ట్రోలైజర్లు తయారీలో ఆధారపడే అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ విభాగంలో స్వదేశీ ఆవిష్కరణలు పెరగాలి. పరిష్కార దిశలు ఏమిటంటే - ప్రభుత్వ ప్రోత్సాహకాలు, గరిష్ఠంగా ప్రైవేట్ రంగం భాగస్వామ్యం, విదేశీ పెట్టుబడుల రాకకు అనుకూలమైన విధానాలు, విద్యుత్ వినియోగ ధరల్లో ఊరట,మౌలిక సదుపాయాల ఏర్పాటు వంటివి చురుకుగా జరగాలి. ముఖ్యంగా పరిశోధన సంస్థలు, విద్యా సంస్థల భాగస్వామ్యంతో దేశీయంగా ఎలక్ట్రోలైజర్ తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయడం కీలకం. అంతేకాక, హైడ్రోజన్ స్టోరేజ్, రవాణా, భద్రత ప్రమాణాలపై ఇప్పటికీ స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడం ఒక పెద్ద లోపంగా కనిపిస్తోంది. ఇది ప్రాజెక్టుల ముందుకెళ్లడాన్ని అడ్డుకుంటోంది. దీనిపై పరిశోధనా సంస్థలు వెంటనే చొరవ తీసుకోవాలి. ఈ హరిత హైడ్రోజన్ మిషన్పై విమర్శలు కూడా కొంత తీవ్రంగా వినిపిస్తున్నాయి. దీన్ని మరొక "పబ్లిసిటీ డ్రైవ్"గా మార్చకుండా,ప్రామాణిక చర్యలతో, బాధ్యతాయుతమైన అమలుతో ముందుకు నడిపించాలి. లేకపోతే, ఇదీ అనేక శుద్ధ వాయు కల్మషంగా మిగిలే ప్రభుత్వ ప్రకటనల కోవలో చేర్చబడే ప్రమాదం ఉంది. మొత్తానికి, హరిత హైడ్రోజన్ మిషన్ భారతదేశానికి శక్తిస్వావలంబనతో పాటు వాతావరణ న్యాయం అందించే దిశగా ఒక ప్రగతిశీల అడుగు. కానీ, ఇది కేవలం వాగ్దానాల శ్రేణిగా మిగిలిపోవాలంటే కాదు. దృఢ సంకల్పంతో, వ్యూహాత్మక ప్రణాళికలతో, సమన్వితచర్యలతో దీనిని కార్యరూపం దిద్దాలి. అప్పుడే దేశం కార్బన్ రహిత భవిష్యత్తు వైపు సుస్థిరంగా పయనిస్తుంది. అందుకోసం కేంద్రం, రాష్ట్రాలు, పరిశ్రమలు అంతా ఒక్కటై ముందుకు రావాలి. లక్ష్యాన్ని సాధించాలి. •

## నేడు విద్యుత్ చార్జీలు తగ్గించాలనే డిమాండ్‌తో సబ్‌స్టేషన్ వద్ద వైకాపా నిరసన

**ఎ కొండూరు, మే 5, ప్రభాతవార్త :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు వైసిపి ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్ నాయకత్వంలో నేడు మంగళవారం ఈ నెల 6న లక్ష్మీపురం పాలెంచేంద్రం వద్దన విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఎ కొండూరు విస్సన్నపేట గంపలగూడెం మండలాలకు చెందిన జెడ్పీటిసి మెంబర్లు ఎంపిటిసి మెంబర్లు సర్పంచ్‌లు తిరువూరు మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు వైసిపి రాష్ట్ర జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు మండల నాయకులు ప్రజలు కార్యకర్తలు అభిమానులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని అధికారులకు డిమాండ్లతో కూడిన మెమోరాండం అందిస్తామని స్వామిదాస్ తెలిపారు.

## 10న అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక బస్సులు : డిఎం సుబ్రహ్మణ్యం

**ఎ కొండూరు, మే 5, ప్రభాతవార్త :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఆర్టీసీ డిపో నుండి అరుణాచల పుణ్యక్షేత్రానికి ఈ నెల 10న శనివారం సాయంత్రం 6 గంటలకు తిరువూరు నుండి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని డిఎం ఎ సుబ్రహ్మణ్యం ఈ నెల 11న ఆదివారం ఉదయానికి కాణిపాకం చేరుకుని దర్శనానంతరం శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శనం చేసుకుని ఆదివారం రాత్రి పౌర్ణమి సమయానికి అరుణాచల క్షేత్రం చేరుకుని గిరి ప్రదక్షిణ దర్శనం పూర్తి చేసుకున్న అనంతరం 12న సోమవారం నాడు కంచి తిరుత్తని అనంతరం తిరుగు ప్రయాణంలో 13న మంగళవారం ఉదయం శ్రీకాళహస్తి దర్శనానంతరం మంగళవారం రాత్రికి తిరిగి తిరువూరు చేరుకుంటుందని డిఎం ఎ సుబ్రహ్మణ్యం తెలిపారు. వివరాల కొరకు 7382487969, 9885661835 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

## విసీతో ఫైనాన్స్ ఆఫీసర్ భేటి

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,మే 5,ప్రభాతవార్త :** వర్సిటీ ఇన్‌చార్జ్ విసి ఆచార్య కె.గంగాధరరావుతో నూతన ఫైనాన్స్ ఆఫీసర్‌గా నియమితులైన సత్యనారాయణ సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు రానున్న రోజుల్లో యూనివర్సిటీ అభివృద్ధిపై చర్చించు కున్నారు.అన్ని విభాగాల సంయుక్త సహకారంతో వర్సిటీ అభివృద్ధి జరగాలని ఇరువురు ఆకాంక్షించారు.

# విజయవాడ వార్త

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 ఫిర్యాదులు

**విజయవాడ క్రైం,మే 5,ప్రభాతవార్త:** నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమీషనర్ డాక్టర్ చంద్రశేఖర్ సోమవారం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ వేదికలో పట్టణ ప్రణాళికకు సంబంధించి-4,ఇంజనీరింగ్-3 ,రెవిన్యూ-1, ఉద్యానవనం-1 మొత్తం 9 ఫిర్యాదులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను వేగంగా,సమర్థవంతంగా పరిష్కరించడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు వాటికి శాశ్వత పరిష్కారం కనుగొనడంపై అధికారులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్,చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాధ్‌రెడ్డి, డిప్యూటీ కమీషనర్ రెవిన్యూ జి.సృజన, సూపరిండెంటింగ్ ఇంజనీరుల పి.సత్యన్నారా యణ, పి.సత్యకుమారి,ఇన్‌ఛార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్,రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహనరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 81 ఫిర్యాదులు

**విజయవాడ క్రైం,మే 5,ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పరిష్కార వేదికను సోమవారం పోలీస్ కమీషనరేట్‌లో సిపి సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాల



మేరకు డిసిపి ఏబిటిఎస్ ఉదయరాణి నిర్వహించారు. వివిధ సమస్యలకు సంబంధించి ఆమె 81 ఫిర్యాదులను అందుకున్నారు. దివ్యాంగులు వృద్ధుల వద్దకు నేరుగా వెళ్ళి వారి సమస్యలను అడిగి తెలుసుకొని వాటిని త్వరగా పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చారు. వీటిలో భూ వివాదాలు,ఆస్థి వివాదాలకు సంబంధించి,నగదు లావాదేవీలకు సంబంధించి-48,భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించి-04,మహిళా సంబంధిత నేరాలకు సంబంధించి-7,చోరీలకు సంబంధించి-9,కొట్లాటలకు సంబంధించి-06, ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలకు సంఘటనలకు సంబంధించి-07, మొత్తం 81 ఫిర్యాదులను అందుకున్నారు. కార్యక్రమంలో ఇతర అధికారులు సిబ్బంది పాల్గొని ఫిర్యాదులను పరిష్కరించడంలో సహకారాన్ని అందించారు.

## ఆర్టీసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆర్డీవోకు వినతి పత్రం అందచేత

**తిరువూరు, మే 5, ప్రభాతవార్త :** తిరువూరు ఏపిఎస్సార్టీసి కార్మికులు తమ సమస్యలను



పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవో మాధురికి సోమవారం వినతిపత్రం ఎన్ఎంయుఎ ప్రతినిధులు అందచేశారు. ఆ క్రమంలో నాలుగేళ్లుగా నిలిచిపోయిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలని, గ్యారేజ్ కార్మికుల అపరిష్కృత పరిష్కరించాలని, అక్రమ సస్పెన్షన్లు అక్రమ రిమూవల్స్ వెంటనే ఆపాలని, 114 జీవోలో పొందుపరచిన మేరకు నైట్ అవుట్ అలవెన్స్ 150 నుండి 400వరకు చెల్లింపు చేయాలని, 1/2028 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని కార్మికులు ఆ వినతిపత్రంలో కోరారు. ఎన్ఎంయుఎ ప్రెసిడెంట్ జిఎస్‌పిబి రావు, సెక్రటరీ జీఆర్ నాథ్, ఆర్ రాజా, రివిజనల్ అధ్యక్షుడు డివిరావు, టిఎస్‌రావు, టిఆర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## డిజిపి ఆదేశాల మేరకు దర్యాప్తు అధికారులకు వర్క్‌షాపు

### -ఫోరెన్సిక్ సాక్ష్యాలను సేకరించడం,భద్రపర్చడంపై నిపుణులచే శిక్షణ

**విజయవాడ క్రైం,మే 5,ప్రభాతవార్త :** నేరస్థుడికి శిక్ష పడాలంటే నేరస్థలంలో వదిలిన భౌతిక సాక్ష్యాదారలను సేకించే విధానంపై,దర్యాప్తు చేసే విధానంలో ఆధునాతన టెక్నాలజీ సహాయంతో సాక్ష్యాలను సేకరించే విధానాలపై నైపుణ్యాలను పెంచుకోవాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర డిజిపి హరీష్‌కుమార్ గుప్తా దేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఫోరెన్సిక్ వీక్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జ్ పోలీసు కమీషనర్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సూచనలతో అడ్మిన్ డిసిపి కెజివి సరిత అధ్వర్యంలో పోలీసు కమీషనర్ కార్యాలయంలో,కమీషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు,సిబ్బందికి ప్రముఖ నిపుణులచే ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణను ఇస్తున్నారు. ఈ క్రమంలో నేర స్థలంలో నార్కోటిక్స్,మత్తుపదార్థాలు,వివిధ రకాల విషాలను సైబర్ నేరాలు,ఆడియో,వీడియో,వివిధపత్రాలు,భౌతిక



సాక్ష్యాధారాలు, డిఎస్ఏ రక్త నమూనాలు,మానవ అవయవాలకు సంబంధించిన వాటిని ఏ విధంగా సేకరించాలి, ఏ విధంగా వాటిని ప్యాకింగ్ చేయాలని,ఏ విధంగా భద్రపర్చి ఏ విధమైన ప్రశ్నలతో కూడిన లెటర్ ఇవ్వాలి తదితర అంశాలపై ప్రముఖ నిపుణులైన అధ్యాపకులు, అడిషనల్ డైరెక్టర్లు బి.ఫణిభూషణ్,ఎ.వంశీకృష్ణ,కెఎన్ స్వామి ,బి.శివప్రసాద్,ఎస్‌వి బాల సుబ్రహ్మణ్యంలు పైన తెలిపిన అంశ్యాల గురించి క్షుణ్ణంగా వివరించడంతో పాటు అధికారులు అడిగిన అనుమానాలనేఉ నివృత్తి చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అడ్మిన్ డిసిపి కెజివి సరిత,క్రైం డిసిపి తిరుమలేశ్వరరెడ్డి,క్రైం ఏడిసిపి ఎం.రాజారావు,ప్రముఖ నిపుణులైన అధ్యాపకులు,అడిషనల్ డైరెక్టర్లు బి.ఫణిభూషణ్, ఎ.వంశీకృష్ణ,కెన్ స్వామి,బి.శివప్రసాద్,ఎస్‌వి బాలసుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ బి.కృష్ణకిషోర్,విఎల్‌వి హిమబిందు,ఎండి సిద్దిక్ అహ్మద్,డాక్టర్లు బి.అవినాష్,డాక్టర్ రాజ్‌కుమార్,జయప్రకాష్,డాక్టర్ జె.తనూజా, డా.నిహిత, ఏసిపిలు,సిఐలు,ఎస్ఐలు,సిబ్బంది పాల్గొన్నారు.

## తుఫాన్ సమయంలో జాగ్రత్తలు పాటించండి

### - ఇన్‌చార్జ్ తహాశీల్దార్ రాజ్‌కుమార్ వెల్లడి

**ఎ కొండూరు, మే 5, ప్రభాతవార్త :** ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి లక్ష్మీశ ఆదేశాల మేరకు ఎ కొండూరు మండలంలో తుఫాన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇన్‌చార్జ్ తహాశీల్దార్ రాజ్‌కుమార్ సోమవారం మీడియాకు వెల్లడించారు. ముఖ్యంగా తుఫాన్ సమయంలో ప్రజలు ఇళ్లలోనే ఉండాలని ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడేటప్పుడు పాత భవనాలు చెట్లు టవర్స్ పోలాలు హోర్డింగ్‌ల క్రింద లోతట్టు ప్రాంతాల్లో కొండ వాలు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని వీరు కోరారు. చెట్ల కింద వాహనాలు పార్కింగ్ చేయవద్దని, సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని తహాసీల్దార్ రాజ్‌కుమార్ కోరారు. తుఫాన్ సమయంలో నది తీరంలో గాని నదిలో గాని వెళ్ళకూడదని కేవలం వాతావరణ శాఖ వారు జారీ చేసే ప్రకటనలు హెచ్చరికలు మాత్రమే నమ్మాలని ఏ ఇతర వార్తలు గాని వదంతులు గాని నమ్మవద్దని తహాశీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు. అత్యవసర సమయంలో ఎన్టీఆర్ జిల్లా కంట్రోల్ రూమ్ వారి సహాయం కోసం 9154970454 నెంబర్‌ను సంప్రదించాలని ఇన్‌చార్జ్ తహాశీల్దార్ రాజ్‌కుమార్ కోరారు.

## ఫాంటసీస్పోర్ట్స్, భారత క్రీడా ఏఐ విప్లవానికి శక్తివంతమైన వేదిక

**విజయవాడ, మే 5, ప్రభాతవార్త :** భారతదేశం గ్లోబల్‌హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో కొలంబియా విశ్వవిద్యాలయంలో కంప్యూటింగ్ అండ్ ఏఐ వైస్ డీన్ ప్రొఫెసర్ విశాల్ మిశ్రా, వేవ్స్ 2025 సమ్మిట్‌లో ఫాంటసీ స్పోర్ట్స్ యూజ్ ఏ క్యాటలిస్ ఫర్ ఇండియాస్ ఏఐ రివల్యూషన్ ఇన్ స్పోర్ట్స్ అనే వైట్ పేపర్‌ను ఆవిష్కరించారు. ఎఫ్ఐఎఫ్ఎస్ స్పోర్ట్స్ డేటా గేమ్‌థాన్ సలహాదారులుగా ఆయన వున్నారు. ఈ వైట్‌పేపర్లో ఇండియా ఏఐ మిషన్లో భాగంగా క్రీడలను ఒక ముఖ్యరంగంగా తీసుకోవాలన్నారు. గేమ్‌థాన్ వంటి కార్యక్రమాల ద్వారా క్రీడలతో పాటు ఇతర రంగాల్లో కూడా దేశీయ ఏఐ పరిష్కారాలను కనుగొనవచ్చున్నారు.





## మెగా జాబ్‌మేళా పోస్టరు ఆవిష్కరణ

**గుంటూరు,మే 5,ప్రభాతవార్త :** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే బూర్ల రామాంజ నేయులు ఆధ్వర్యంలో మే 9వ తేదిన మలినేని పెరుమాళ్ళ ఇంజనీరింగ్ కళాశాల్లో జరిగే మెగా జాబ్‌మేళా పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాల్లో ఆవిష్కరిం చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్య రూపుమాపడానికి కృషిచేస్తుందన్నారు.ఈ జాబ్ మేళాలో సుమారు 45కంపెనీలు పాలొంటున్నట్లు,1400ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని కావున జిల్లాలోనియువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా తెలిపారు. కార్యక్రమంలో జేసి ఏ.భార్గవ్‌తేజ, డిఆర్వోఎన్ఎస్‌కె ఖాజావలి, ఆర్‌డివో కె.శ్రీనివాసరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు, పిడి టివి జయలక్ష్మి, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్ 61వ రోజు ప్రజా దర్బార్

### -ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి అర్జీలు స్వీకరించిన మంత్రి

**మంగళగిరి, మే 5, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా వివిధ సమస్యలతో బాధపడ తున్న సామాన్య ప్రజానీకానికి మొదటి రోజు నుంచి అండగా నిలుస్తున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నేడు ఉదయం ఉండవల్లి నివాసంలో 61వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. తమ సమస్యలు విన్నవించేందు ఎచ్చెర్లలోని అంబేద్కర్ యూనివర్సిటీలో పనిచేస్తుండగా తన భర్త విద్యుత్ షాక్ కు గురై 2020లో మరణించాడని, కారుణ్య నియామకం కింద తనకు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని చిలకపాలెం గ్రామానికి చెందిన డి.రేవతి మంత్రి నారా లోకేష్ ను కలిలి విన్నవించారు. వైసీపీ హయాంలో ఇళ్ల స్థలాల




కు వివిధ జిల్లాల నుంచి పెద్దఎత్తున సామాన్యులు ఉండవల్లి నివాసానికి తరలి వచ్చారు. పెన్షన్, భూ సంబంధిత సమస్యలు, ఉద్యోగ, ఉపాధి, వైద్య, ఆర్థికసాయం కోసం పెద్దఎత్తున ప్రజాదర్బార్ కు తరలివచ్చారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్.. వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా విన్నపాలను పరిశీలించి త్వరితగతిన పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. పలు అర్జీలపై అప్పటికప్పుడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. శ్రీకాకుళం జిల్లా పేరుతో తమ 0.34 ఎకరాల భూమిని అధికారులు అన్యాక్రాంతం చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని పల్నాడు జిల్లా రొంపిచర్ల గ్రామానికి చెందిన పడాల రాములు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం, కొయ్యలగూడెం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని సమైక్య యూత్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు.

## ప్రతి అర్జీను క్షుణ్ణంగా పరిశీలించాలి : కలెక్టర్ నాగలక్ష్మీ

**గుంటూరు,మే 5,ప్రభాతవార్త :** ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందించిన ప్రతి పిటీషన్ క్షుణ్ణంగా పరిష్కరించాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులకు సూచించారు.సోమవారం నుండి 197ఫిర్యాదులు సీ్వకరించారు.కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ అందిన పిటీషన్లను గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో జెడ్పి సీఈఓ జ్యోతిబసు,డిఆర్డీఏ



కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి,జేసి భార్గవ్ తేజ,డిప్యూటీ కలెక్టర్ గంగరాజు,డిఆర్ఓ ఎన్ఎస్‌కె ఖాజావలి,ఆర్డిఓ శ్రీనివాసరావు,ప్రజల ద్వామా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్లు విజయలక్ష్మి, శంకర్,ప్రసాద్,డిపిఓ బి.వి.నాగసాయి కుమార్, డిఎస్ఓ కోమలి పద్మ,ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ విజయ్ ప్రకాష్,ఎల్‌డిఎం మహిపాల్‌రెడ్డి,తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని పసిబాబు లభ్యం

### -పసిబాబును ఐసిడిఎస్ అధికారులకు అప్పగించిన వైద్యులు

**పొన్నూరు, మే 5,ప్రభాతవార్త:** ఏ తల్లి కన్న బిడ్డో, ఆ తల్లికి పసిబాబు ఎందుకు భారం అయ్యాడో తెలియదు కానీ ప్రసవించిన తర్వాత కొన్ని గంటల్లోనే పసిబాబును ఊరు బయట వదలి వెళ్ళిన సంఘటన. మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు ఊరు బయట చెట్ల పొదల్లో ఓ పసిబాబును గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్ళారు. పసిబాలుడు ఏడుస్తున్న శబ్దం చుట్టు ప్రక్కల వారికి వినబడింది. దీంతో చుట్టు ప్రక్కల వారు ఏడుపు శబ్దం ఎక్కడ వినిపిస్తుందోనని చుట్టూ పొదల్లో వెతికారు. చివరికి ఒక చోట ఇంకా బొడ్డు కూడా ఊడని పసిబాబు కనిపించాడు. ఈ పసిబాబును శనివారం ఉదయం గ్రామస్తులు నిడుబ్రోలు ప్రభుత్వాసు పత్రికి తీసుకొచ్చారు. వైద్యాధికారి ఫిరోజ్‌ఖాన్‌కు అప్పగించారు. వైద్యుడు ఫిరోజ్‌ఖాన్ పసిబాబుకు చేపట్టాల్సిన సపర్యలు చేశారు. అనంతరం బాబు పూర్తి ఆరోగ్యంతో ఉండడంతో పసిబాబును ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ ఎస్.వెంకటరమణకు అప్పగించారు.



## మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కోడెల శివరామ్

**నరసరావుపేట, మే 5 ప్రభాతవార్త :** రాష్ట్ర ఐటీ, విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలో సోమవారం తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శివరామ్ మంత్రి నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే వారిరువురు రాజకీయ పరిస్థితులపై కొద్దిసేపు ముచ్చటించారు. కోడెల శివరామ్ వెంట పలువురు టిడిపి నేతలు ఉన్నారు.



## శేషవాహనం పై దర్శనమిచ్చిన సాక్షి బావనారాయణ స్వామి

**పొన్నూరు,మే5, ప్రభాతవార్త:** శ్రీ సుందరవల్లీ, రాజ్యలక్ష్మి సమేత శ్రీ సాక్షి భావనారాయణస్వామివా బ్రహోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి శ్రీ స్వామివారు శేషవాహనంపై పుర ప్రజలకు దర్శన మిచ్చారు. ఉదయం శ్రీ స్వామివారికి తిరుమంజ నోత్సవం, పంచామృతస్నపన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో శ్రీస్వామివారు ఉభయదేవేరులతో పెండ్లికుమారునిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి శ్రీ స్వామివారు సుందరవల్లీ, రాజ్యలక్ష్మి సమేతంగా శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలకంరించారు. గ్రామోత్సవంలో దర్శనవిఎస్తున్న స్వామివారికి భక్తులు నారికేళములు, మామిడిపండ్లు తదితర పండ్లను సమర్పించి తమ మొక్కు బడులను తీర్చుకున్నారు. దేవాలయం వద్ద భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టబడ్డాయి. అసిస్టెంట్ కమీషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు.



## అమేజాన్ ఇండియా గ్రేట్ సమ్మర్‌సేల్

**విజయవాడ, మే 5, ప్రభాతవార్త :** మే 1 నుండి గ్రేట్ సమ్మర్ సేల్ ను అందిస్తున్నట్లు అమేజాన్ ఇండియా ప్రతినిధులు ప్రకటించారు. శాంసంగ్ ఏఐ సహమద్దతుతో సీజన్లో షాపర్స్‌ను ఆనందపరిచేలా సాటిలేని బ్రాండ్లను శాంసంగ్ టివి, తదితర ఉపకరణాలు, టిసిఎల్, హైసెన్స్, టాటా ఉత్పత్తులు, మెజిల్ బ్లోజ్ వోలిన, హుల్ కెల్లాగ్స్, బోట్ వంటి ప్రముఖ సంస్థల ఉపకరణాలను ఆఫర్లలో అందిస్తామన్నారు.


## విజయవాడలో ఆప్రిలియా టువోనో 457 విడుదల

**విజయవాడ, మే 5, ప్రభాతవార్త :** యువ మోటార్‌సైక్లిస్టుల ప్రశంసలందుకున్న కొత్త ఆప్రిలియా టువోనో 457ను విజయవాడలోని ఇన్నోవియా మోటార్స్ వద్ద అందుబాటులోకి తెచ్చారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పియోజియో వెహికల్ రీజనల్ మేనేజర్ ఎం క్రాంతికుమార్, ఇన్నోవియా మోటార్స్ ఎండి ఎం భాస్కరరెడ్డిలు పాల్గొన్నారు.

## అర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

### -గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్,మే5,ప్రభాతవార్త:** గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ లో ప్రజలు ఇస్తున్న ఆర్జీల శాశ్వత పరిష్కారానికి చర్యలు



తీసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ కోవెలమూడి రవీంద్ర , కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ నిర్వహించారు. పిజిఆర్ఎస్ లో మేయర్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 23 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరువేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. డయల్ యువర్ కమిషనర్ కి అందిన ఆర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్ కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు తీసుకొని మేయర్ , కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో ప్రజలు ఇస్తున్న ఆర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా ఆర్జీలను ర్యాండమ్ గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్జీలు బియండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లడానికి వీలులేదన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు ఆర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జిఎంసి కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. ప్రజల నుండి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకి ప్రతి విభాగంలో ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కు 33 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 20, ఇంజినీరింగ్ విభాగం 4, రెవెన్యూ విభాగం 7, ప్రజారోగ్య విభాగం 1, అకౌంట్స్ విభాగానికి సంబందించి 1 ఫిర్యాదు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిపి రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాష తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 77 ఫిర్యాదులు

**నరసరావుపేట క్రైం, మే 5 ప్రభాతవార్త :** జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 77 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ కె.శ్రీనివాసరావు ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులలో ఆర్థిక, ఆస్థి, మోసాలు, తగాదాలకు సంబంధించి ఉన్నాయని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ఫిర్యాదులకు తగిన ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు.

# మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం

**-హాస్టల్లో ఉండే విద్యార్థినులకు, మహిళలకు ఎటువంటి ఇబ్బందులు కలిగిన తనను సంప్రదించవచ్చు -ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**గుంటూరు కార్పొరేషన్, మే5, ప్రభాతవార్త :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఉన్న మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం



ఇస్తున్నామని, వివిధ ప్రాంతాల నుండి వచ్చి హాస్టల్లో ఉండే విద్యార్థినులకు, మహిళలకు ఎటువంటి ఇబ్బందులు కలిగిన తనను సంప్రదించవచ్చునని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో "ప్రజాగ్రివెన్స్" నిర్వహించి,ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం వివిధ డివిజన్ ల పార్టీ నాయకులతో సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకొని వెళ్ళాలని, డివిజన్ లలో సమస్యలను ఎప్పటి కప్పుడు అధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళి, పరిష్కరించాలన్నారు. అదే విధంగా మహిళలకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం అండగా నిలబడుతుందని, ఆదివారం బ్రాడిపేటలోని ఓ హాస్టల్ లో జరిగిన ఘటన తన దృష్టికి వచ్చిన వెంటనే పోలీసు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళానని, ఇటువంటి దుర్మార్గమైన పనులను ప్రభుత్వం ప్రోత్సహించదని, కఠినంగా వ్యవహరిస్తామని, ఇప్పటికే జిల్లా పోలీసులు భద్రతకు సంబంధించి వివిధ అవగాహన కార్యక్రమాలు కల్పిస్తుందన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే మహిళల కోసం సఖి నివాస్ ను ఇప్పటికే ప్రారంభించమని, దీనిని మహిళలు అందరూ ఉపయోగించుకోవాలన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో మహిళలు సంక్షేమానికి, భద్రతకు కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## మద్యం దుకాణాల్లో తనిఖీలు

**ఈపూరు,మే5,ప్రభాతవార్త:** మద్యం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేనియెడల కఠిన చర్యలు తీసకోవడం జరుగుతుందని ఈపూరు ఎక్సైజ్ స్టేషన్ ఇన్స్పెక్టర్ డి. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలకేంద్రమైన ఈపూరు, రొంపిచర్ల




గ్రామాల్లోని పలు వైన్స్‌ల్లో ఆకస్మిక తనిఖీలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని చెప్పారు. కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సినీ కొరియోగ్రాఫర్ శ్రాష్ఠి వెర్మా పై గుంటూరు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఎన్ ఎస్ యుఐ గుంటూరు జిల్లా అధ్యక్షులు షేక్.కరీం

**గుంటూరుతూర్పు,మే5,ప్రభాతవార్త:** సినీ కొరియోగ్రాఫర్ శ్రష్టి తన సోషల్ మీడియాలో స్వాతంత్ర సమరయోధులు మహాత్మా గాంధీ, జోహార్ లాల్ నెహ్రూ లను ఈ బాస్టర్డ్స్ అన్నీ నాశనం చేశారని ఎన్ ఎస్ యుఐ గుంటూరు జిల్లా అధ్యక్షులు షేక్.కరీం గ్రీవెన్స్ సమావేశంలో జిల్లా ఎస్పీకి చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మన రాబోయే తరం ఈ బాస్టర్డ్స్ లాంటి వాళ్ళ గురించి కాదు నిజమైన స్వాతంత్ర్య సమరయోధుల గురించి నేర్చుకోవాలి..పుస్తకాల నుండి వారి జీవితాన్ని ప్రదర్శించే అధ్యాయాలను తొలగించాలి ఎందుకంటే వారు దేశానికి ద్రోహం చేసి,అన్నీ నాశనం చేశారు అంటూ సినీ కొరియోగ్రాఫర్ శ్రాష్ఠి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ... సినీ కొరియోగ్రాఫర్ శ్రాష్ఠి వెర్మా పై కేసు పెట్టడం జరిగింది. స్వాతంత్ర సమరయోధుల గురించి హేళన చేస్తూ నీచంగా మాట్లాడిన సినీ కొరియోగ్రాఫర్ శ్రాష్ఠి వెర్మా పై కఠినంగా చర్యలు తీసుకొని తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీస్ అధికారులకు తెలిపారు.

## వెంకటేశ్వర్లుకు నివాళులర్పించిన ఎమ్మెల్యే యరపతినేని

**పిడుగురాళ్ల, మే 5 ప్రభాతవార్త:** రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘ మాజీ అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు అనారోగ్య కారణాలతో ఆదిరాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం వెంకటేశ్వర్లు భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీనివాసరావు,



వడపల్లి సర్వేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ, మండల అధ్యక్షులు సుతారు మల్లేశ్వరరావు, మల్లెం నాసరయ్యచారి, దీకొండ లక్ష్మాచారి, బంగారు శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ

**మంగళగిరి, మే 5, ప్రభాతవార్త :** శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళగిరి గౌతమబుద్ధా రోడ్డు వద్ద సగర సంఘం కార్యాలయం ప్రాంగణంలో శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి



సేవా ట్రస్ట్ చైర్మన్, మంగళగిరి సగర సంక్షేమ సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా ఉచితంగా మజ్జిగను ఉచితంగా పంపిణీ చేశారు అనంతరం శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో సేవాగుణంతో ఏర్పాటుచేసిన చలివేంద్రం ద్వారా ప్రారంభం నుండి నిర్విరామంగా ప్రతిరోజు పాదచారులకు, వాహన దారులకు ఉచితంగా చల్లటి మినరల్ వాటర్ ను అందించడంతోపాటు దాతల సహకారంతో గత 3 వారాలుగా ప్రతి సోమవారం 1000 మందికి పైగా పాదచారులకు, వాహన దారులకు ప్రయాణికులకు ఉచితంగా మజ్జిగను పంపిణీ చేయడం జరుగు తుందని తెలిపారు. ప్రజలకు సేవ చేయాలనే సదుద్దేశ్యంతో తమ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని, ఈ బృహత్తర కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్న దాతలు, ట్రస్ట్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ట్రస్ట్ చైర్మన్ సాంబశివ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ కాశీ అన్న పూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ చైర్మన్ కర్నాటి శివసత్య నారాయణ, నంగళం ప్రసాద్, కళ్ళం శివసాంబి రెడ్డి,కగ్గా శ్రీనివాస రావు,పంచల శివన్నా రాయణ ,పెరుమాళ్ళ సుబ్ర హ్మణ్యం,నల్లమోలు నాగరాజు, బేతపూడి మధు బాబు, బోనేపల్లి తాండవ, చిరు మామిళ్ళ రంగారావు, రెడ్డి వీరాంజనేయులు, నంద్యాల గోపాలకృష్ణ, ఉద్దంటి మురహరిరావు పాల్గొన్నారు.

## వాసవిక్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

**వినుకొండ,మే5,ప్రభాతవార్త:** వాసవిక్లబ్, వాసవి వనితక్లబ్, వాసవియూత్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం పట్టణంలోని బందావన ఫంక్షన్ హాలు నందు



ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, వాసవిక్లబ్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఖజ్జాయం విజయలక్ష్మి, జిల్లా గవర్నర్ మునగాల చిరంజీవిలు హాజరయ్యారు. వాసవిక్లబ్ ప్రెసిడెంట్‌గా కాసుల వాసవి రవి ంద్ర, సెక్రటరీగా టంగుటూరి వీరబ్రహ్మం, ట్రెజరర్‌గా విద్యా నరేష్, వనితక్లబ్ ప్రెసిడెంట్‌గా గుడిపాటి శేషద్మ, సెక్రటరీగా బచ్చు లక్ష్మీ హారిక, ట్రెజరర్‌గా కాకుమాను శిరీష, యూత్‌క్లబ్ అధ్యక్షునిగా గుర్రం బాల సాయికుమార్, సెక్రటరీగా దేసు వెంకట హరికుమార్, ట్రెజరర్‌గా గంధిశెట్టి బ్రహ్మన ందలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భం గా కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులు జీ.వీ. క్లబ్ సభ్యులు మాట్లాడుతూ పేద ప్రజలకు వాసవిక్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. నూతన కార్యవర్గం మరింత సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. నూతన కార్యవర్గ సభ్యులకు జీ.వీ శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

## వ్యవసాయ ఉత్పత్తులపై స్టాల్ ఏర్పాటు

**నరసరావుపేట, మే 5 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కలిసి సోమవారం ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్‌లో రైతులు తమ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఉత్పత్తి చేసిన ఆరోగ్యకరమైన ధాన్యాలు, పండ్లు, కూరగాయలు తదితర ఉత్పత్తులను ఏర్పాటు చేశారు. ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి మాట్లాడుతూ



రసాయనాలతో పండించిన ఆహారం తీసుకోవడం వలన అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఉత్పత్తి చేసిన ఆహార పదార్థాలను ప్రజలు వినియోగించుకోవడం అవసరమన్నారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హెల్త్ అధికారులను రెగ్యులర్ చేయాలి

**నరసరావుపేట, మే 5 ప్రభాతవార్త :** కమ్యూనిటీ హెల్త్ అధికారులను రెగ్యులర్ చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ మిడ్ లెవెల్



హెల్త్ ప్రొవైడర్ అండ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీపార్కు వద్ద గత ఏనిమిది రోజులుగా సమ్మె చేస్తూ తమ నిరసనను తెలియచేయడం జరుగుతుందన్నారు. నేటికీ ప్రభుత్వం తరఫున స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిటీ హెల్త్ అధికారుల న్యాయమైన కోరికలను నెరవేర్చాలన్నారు. వీరికి గత ఏనిమిది సంవత్సరాలుగా వేతనాలు పెంచలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వీరిని రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పున్నారెడ్డి, కరిముల్లా, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో పల్లెలు ప్రశాంతం : ఎమ్మెల్యే యరపతినేని

**పిడుగురాళ్ల, మే 5 ప్రభాతవార్త:** ఆధ్యాత్మిక చింతనతో పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు.



మండలంలోని చిన అగ్రహారంలో వేంచేసియున్న శ్రీనిదానంపాటి లక్ష్మీ అమ్మవారి 24వ వార్షి కోత్సవ తిరునాళ్ల మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ ప్రజలు చిన్న చిన్న విషయాలకు ఘర్షణలు పడి జీవితాలను ఇబ్బందుల పాలు చేసుకోవద్దని హితవు చెప్పారు. కక్షలు, కార్పణ్యాలు వీడి సోదరబావంతో మెలిగి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను సంప్రదిస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తిరునాళ్లకు విచ్చేసిన ఎమ్మెల్యే యరపతినేనికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. దుశ్శాలువలతో సన్మానించి పుష్ప గుచ్ఛాలను అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## టెక్స్ టైల్ శిక్షణ శిబిరాన్ని పరిశీలించినఎమ్మెల్యే నసీర్

**గుంటూరుతూర్పు,మే5,ప్రభాతవార్త:** కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరుచుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని వసంతరాయపురంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన సమర టెక్స్ టైల్ శిక్షణ




శిబిరాన్ని సోమవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ టైలరింగ్ శిక్షణ తీసుకున్న మహిళలు తాము ఎంచుకున్న రంగాలలో నైపుణ్యం సాధించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత జీవనోపాధుల మెరుగుదలకు ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఇప్పటికే పీ4 సర్వే ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని చెప్పారు. వృత్తి నైపుణ్య శిక్షణ ద్వారా మహిళలు తమ కుటుంబాలకు ఆర్థిక అండగా నిలుస్తున్నారని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. టైలరింగ్ లో శిక్షణ తీసుకుంటున్న మహిళలతో ఎమ్మెల్యే కొద్దిసేపు మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అశోక్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రైన్లపై ఆక్రమణలను పట్టణ ప్రణాళిక అధికారుల సమన్వయంతో తొలగించండి : నగర కమిషనర్

**గుంటూరు కార్పొరేషన్, మే5, ప్రభాతవార్త :** గుంటూరు నగరంలో వార్డ్ సచివాలయాల వారీగా ప్రతి డ్రైన్ మేజర్ డ్రైన్ లో కలిసే కల్వర్ట్



ప్రాంతంలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు రాకుండా మెష్ లు ఏర్పాటు చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధాన డ్రైన్లలో వ్యర్థాలు నిలిచి వర్షాకాలం తీవ్ర సమస్యగా మారుతుందని, అంతర్గత డ్రైన్ల నుండి వ్యర్థాలు నేరుగా మేజర్ లేదా అవుట్ ఫాల్ డ్రైన్లోకి రాకుండా మెష్ లు ఏర్పాటు చేయాలన్నారు. వార్డ్ సచివాలయాల వారీగా 2 రోజుల్లో ఎన్ని ప్రాంతాల్లో మెష్ లు ఏర్పాటు చేయాలో నివేదిక ఇవ్వాలన్నారు. నగరంలో ఇప్పటికే డ్రైన్లలో పూడికతీత పనులు ప్రారంభయ్యాయని, పనులకు ముందు, తర్వాత సమగ్ర వివరాలతో బిల్లులకు అటాచ్ చేయాలన్నారు. ప్రతి పనిని ఏఈ,డిఈఈలు అకనాల్జ్ చేయాలని, తదుపరి పనులకు సంబందించి పూర్తీ భాద్యత వారిదేనన్నారు. పూడిక తీసే సమయంలో డ్రైన్లపై ఆక్రమణలను పట్టణ ప్రణాళిక అధికారుల సమన్వయంతో తొలగించాలన్నారు. అలాగే వీధి దీపలకు సంబంధించి ఇప్పటి వరకు సచివాలయం పరిధిలో ఎన్ని ఉన్నాయి, ఎన్ని పని చేయడం లేదు, నూతనంగా లైన్లతో సహా ఎన్ని కావాలి తదితర వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాగే గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ వద్ద గ్రీన్ మ్యాట్ లు ఏర్పాటు చేయాలని, మ్యాట్ లు ఉన్న ప్రాంతాల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజారోగ్య అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు.సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, డిసిపి సూరజ్ కుమార్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, మేనేజర్ బాలాజీ బాష, సూపరిండెంట్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగంలో అశాస్త్రీయ విధానాలను విడనాడాలి

**బాపట్ల,మే05,ప్రభాతవార్త:** రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా విద్యారంగం తీవ్ర సంక్షోభంలో పడిందని ప్రభుత్వ బడులు వాటంతట అవే సహజ మరణం చెందే విధంగా ప్రభుత్వాలు ప్రణాళికలు రచిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం జిల్లా కార్యదర్శి జంపని శ్రీనివాసరావు అన్నారు.ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం తాహాశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి తాహాశీల్దార్‌కు వినతి పత్రం



అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యారంగంను అతలాకుతలం చేసి తీవ్ర నష్టాన్ని కలిగించాయన్నారు.ప్రభుత్వం ఎన్నికల మెనిఫెస్టోలో 117జీవో రద్దును ప్రధాన అస్త్రంగా ప్రచారం చేస్తూ అధికారంలోకి వచ్చిన తరువాత రూపం మారిన సారం మారని చందంగా 117 జీవో రద్దు అయితే జరిగింది కాని మెరుగైన పాఠశాల వ్యవస్థ,శ్రాస్త్రీయమైన ప్రత్యామ్నాయం జరగలేదన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ భాష,బాపట్ల,కర్లపాలెం,పి.వి పాలెం మండలాల బాధ్యులు మురళి,నారాయణ,ప్రసాద్,బాలాజీ,కత్తి శ్రీనివాసరావు,బుడ్డా నాగాంజనేయులు, చక్రపాణి,విజయబాబు ,జాషువ రావు,రమణ,శ్రీనివాసరావు,సుబ్బారావు,దుర్గా రావు,తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని వ్యక్తి మృతి

**కర్లపాలెం,మే05,ప్రభాతవార్త:** కర్లపాలెం మండలం యాజలి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి ధర్మాలను చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది రవీంద్ర తెలిపిన వివరాల ప్రకారం మృతుడు పిట్టలవానిపాలెం



అలకాపురం కు చెందిన కుసంపూడి కృష్ణంరాజు (59) సొంత పనిమీద బాపట్ల వెళుతూ ఉండగా మార్గమధ్యంలో యాజలి గ్రామంలోని ఆంజనేయ స్వామి బొమ్మ వద్ద ఎన్‌హెచ్216 రోడ్డుపై కర్లపాలెం వైపు నుండి వస్తున్న ఎపి 40 సిఎఫ్ 7121 నెంబర్ గల స్కార్పియో డ్రైవర్ అతివేగంగా ఆ జాగ్రత్తగా వచ్చి మృతుని బైక్ ను గుద్దటం వలన మృతుడు కి రక్తగాయాలు అయి హాస్పటల్ వెళ్లే లోపు మృతి చెందినట్లు ఆయన తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఆయన తెలిపారు

## యడ్లపాడు రాజేశ్వరస్వామి వారి ఆలయ 8వ వార్షిక మహోత్సవం

**యడ్లపాడు, మే 5, ప్రభాతవార్త :** యడ్లపాడు గ్రామంలో భక్తుల నమ్మకానికి నిలయమైన శ్రీ గంగా పార్వతీ సమేత రాజేశ్వరస్వామి వారి దేవస్థానంలో 8వ వార్షికోత్సవ మహోత్సవం మే 6వ తేది మంగళవారం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం నుండే వార్షికోత్సవ వేడుకలు మొదలు అవుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. వేడుకల్లో భాగంగా స్వామి వారి అభిషేకాలు, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు, పలు రకాల ప్రసాద వినియోగం ఉంటాయన్నారు. సాయంత్రం 6గంటలకు కంద్రిక, యడ్లపాడు, చెంఘీస్కాన్‌పేట గ్రామాలకు చెందిన భజనమండలి



నుండి 60మంది హాజరై ఆలయ ప్రాంగణాన కోలాట ప్రదర్శన ఇవ్వనున్నారన్నారు. 7గంటలకు శివపార్వతుల శాంతి కల్యాణ వేడుకలు శాస్త్రోక్తంగా పండితులు కోటప్పకొండకు ఆలయ పండితులు కొండకావూరి అప్పయ్యగురుకులు, ప్రసాద శర్మ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు జంధ్యాల శ్రీరామచంద్రమూర్తి అధ్వర్యాన అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## గడ్డివాములో రాజుకున్న అగ్ని స్థానికులు అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



**యడ్లపాడు, మే 5, ప్రభాతవార్త :** యడ్లపాడు గ్రామంలోని మేదర వీధిలో సోమవారం ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగి కలకలం రేపాయి. మహాలక్ష్మీఅమ్మ చెట్టు సమీపంలో కొండ సాంబయ్యకు చెందిన వరిగడ్డి వాములో ఉదయం సమయంలో అకస్మాత్తుగా పొగలు రావడం గమనించిన స్థానికులు వెంటనే స్పందించారు. సమీపంలో ఇంటి వద్ద పనులు నిర్వహించే వారు గుర్తించి వెంటనే స్పందించి మోటారు సహాయంతో గడ్డిపై నీటిని చల్లేప్రయత్నం చేసారు. వెంటనే సమీపంలోని జెసీబిని రప్పించి వామిని పక్కకు నెట్టి మంటల వ్యాప్తిని పెరగకుండా చేశారు. వామికు అతి దగ్గరలో ఉన్న గేదెలను సకాలంలో కట్లు విప్పి బయటకు పంపించేశారు. స్థానికుల సమయస్ఫూర్తి, ఆత్మస్థైర్యం వల్ల మంటలు మరింత వ్యాపిచకముందే మంటలను అందుపులోకి తీసుకురావటం జరిగింది.

## వినియోగదారులు అదనపు విద్యుత్ లోడ్‌ను 50% రాయితీతో క్రమబద్ధీకరించుకోవచ్చు : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై ఏడుకొండలు

**చిలకలూరిపేట,మే5,ప్రభాతవార్త:** విద్యుత్ వినియోగదారులు గృహ అవసరాలకు వినియోగించు విద్యుత్ సర్వీసులకు అదనపు లోడ్ పెంచుకొనుటకు విద్యుత్‌శాఖ కిలోవాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలలో 50శాతం రాయితీ కల్పించారని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై ఏడుకొండలు తెలిపారు. జూన్ నెల 6వ తేదీలోపు అదనపు లోడులో ఉన్న డెవలప్‌మెంట్ చార్జీలో 50శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకోవాలని సిఆర్‌డిఏ సర్కిల్ సీనియర్ గణాంకాధికారి అజయ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు విధి విధానాలను రూపొందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ అశోక్‌కుమార్, అసిస్టెంట్ గణాంకాధికారి చంద్రశేఖర్, ఏఈలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీరుపై ప్రజల్లో ఏర్పడిన అపోహలు అధికారులు, పాలకులు తొలగించాలి : కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి యం రాధాకృష్ణ

**చిలకలూరిపేట,మే5,ప్రభాతవార్త:** పట్టణంలో త్రాగునీటిని ప్రజలకు అందించే ప్రక్రియలో ఎటువంటి వివక్ష లేకుండా అందరికి త్రాగునీరు అందేలా చూడాల్సిన భాద్యత మున్సిపల్ అధికారులదని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి యం రాధాకృష్ణ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ మతానికి చెందిన ప్రార్దనా మందిరానికైనా, స్వచ్ఛంద సంస్థలకైనా వారికి తాగునీరు సంపూర్ణంగా అందించాల్సిన భాద్యత ఉందన్నారు. కొన్ని ప్రార్దనా మందిరాలకు నీటి సరఫరా చేయవద్దని మున్సిపల్ అధికారులు ఆదేశించినట్లు వస్తున్న వార్తలకు అధికారులు వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్‌చేశారు. చిలకలూరిపేట పట్టణానికి తాగునీరు అందించిన ఘనత ఏయంజి సంస్ధ డైరక్టర్ డాక్టర్ ఎస్ జాన్‌డేవిడ్,మాజీ శాసన సభ్యులు సోమేపల్లి సాంబ య్య జర్మనీ దేశస్థుడు డైక్‌మెన్‌లదని, వారి చొరవతో అన్ని



బడుగు, బలహీన వర్గాలకు మంచినీరు అందించాలనే సత్సంకల్పంతో వారు చేసిన కృషి మరువలేనిదని రాధాకృష్ణ గుర్తుచేశారు. వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని పట్టణంలో ఉన్న అన్ని బావులను శుభ్రపరచి, బోర్లను కూడా రిపేరు చేయించాలని, పలు సూచనలను రాధాకృష్ణ అధికారులకు సూచించా రు. త్రాగునీరు వృధా కాకుండా చూడాల్సిన భాద్యత అధికారుదేనని అన్నారు. త్రాగునీటి సరఫరాలో ప్రజలలో ఉన్న అపోహలను తొలగించాలని ఆయన కోరారు.

## కామ్రేడ్ బొంతా జీవరత్నం ప్రథమ వర్ధంతి

### నివాళులు అర్పించిన సిపిఐ నాయకులు

**చిలకలూరిపేటరూరల్,మే5,ప్రభాతవార్త:** మండలంలోని వేలూరు గ్రామంలో సిపిఐ నాయకులు,ఆంధ్రప్రదేశ్



ప్రజానాట్యమండలి ప్రజా కళాకారులు, అమరజీవి కామ్రేడ్ బొంతా జీవరత్నం ప్రథమ వర్ధంతి పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం సిపిఐ నాయకులు గ్రామంలోని జీవరత్నం నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రావిపాటి వెంకటేశ్వం రావు, నాగబైరు రామసుబ్బాయమ్మ, పేలూరి రామారావు, నార్నె హనుమంతురావు, నాయుడు శివకుమార్, ఆరాధ్యుల రామకృష్ణ, తన్నీరు వెంకటేశ్వర్లు, షేక్ బుడే, బొంతా నాగేశ్వరరావు,బొంతా రాజారావు,బొంతా బాబు, భగత్‌సింత్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## బాపూజి వృద్ధాశ్రమానికి ఫ్యాను బహుకరణ

**చిలకలూరిపేటటౌన్,మే5,ప్రభాతవార్త:** పట్టణంలోని చీరాల రోడ్‌లో ఉన్న బాపూజి వృద్ధాశ్రమానికి ప్రముఖ రంగస్థల కళాకారులు, సినీ నటులు, జంపని భాస్కర రావు ఫ్యాను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని వృద్దుల సౌకర్యార్థం ఫ్యాను బహుకరించి నట్లు తెలిపారు. గత 15 సంవత్సరాలనుండి నిత్యం అన్నదాన కార్యక్రమం



నిర్వహిస్తున్న నిర్వాహకులను భాస్కరరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో జంపని భాస్కరరావు మిత్రమండలి సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు మురికిపూడి ప్రసాద్, ఆరాధ్యుల రామకృష్ణ పాల్గొన్నారు.

## వాసవీ అమ్మవారికి లక్ష మల్లెలతో పూజ నిర్వహించిన ధర్మసంఘం సభ్యులు

**చిలకలూరిపేట,మే5,ప్రభాతవార్త:** పట్టణంలో చౌత్రా సెంటర్‌లో వేంచేసియున్న వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి



జయంతిని పురస్కరించుకొని సోమవారం ధర్మసంఘం ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి సుప్రభాతసేవ, ప్రభాతభేరి, గణపతి పూజ, పుణ్యావాచన,ఋత్వికవరుణం,అఖండ దీపారాధన, నవగ్రహ మండపారాధన, సుగంధ ద్రవ్య ములతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహనివేదన చేసితీర్థప్రసాదములను అందచేశారు. ఈ కార్యక్రమంలో ధర్మసంఘం అధ్యక్షుడు పసుమర్తి సూర్యప్రకాశ రావు, తవ్వా నాగమల్లేశ్వరరావు, దామిశెట్టి నాగేంద్రం, శిఖాకొల్లి సుబ్బారావు, బచ్చు ఓంకారదేవి, దామిశెట్టి హేమలత, ధర్మసంఘం సభ్యులు పాల్గొన్నారు.

## వాసవీ ప్లాటినం క్లబ్ ఆధ్వర్యంలో 45మంది పేద ఆర్యవైశ్యులకు పెన్షన్లు పంపిణీ

**చిలకలూరిపేట,మే5,ప్రభాతవార్త:** పట్టణంలోని చౌత్రా సెంటర్‌లోగల ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో వాసవీ ప్లాటినం, గ్రేటర్ క్లబ్‌ల ఆధ్వర్యంలో సోమవారం 45 పేద ఆర్యవైశ్యలకు రూ 200 చోప్పున పెన్షన్లను అందచేశారు. ఈ



సందర్బంగా క్లబ్ అధ్యక్షుడు దామిశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా పేద ఆర్యవైశ్యులకు ఫించన్లు దాతల సహకారంతో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తవ్వా శ్రీనివాసరావు, తవ్వా నాగమల్లేశ్వరరావు, కొలిశెట్టి శివ సుబ్రహ్మణ్యం, మద్ది గురునాథం, మానం చిన్న నాగేశ్వరరావు, మాగులూరి శ్రీహరి, దామిశెట్టి హేమలత మరియు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## అమేజాన్, ఫ్లిప్‌కార్టుల్లో శాంసంగ్ ఏఐ ఇంటిగ్రేటెడ్ టివిలు

**విజయవాడ, మే 5, ప్రభాతవార్త :** కొత్తశ్రేణి ఏఐ ఆధారిత క్యూఎల్ఇడి, క్రిస్టల్ క్లియర్ 4కె యుహెచ్‌డి టివిలను ఈనెల 1 నుండి అమేజాన్, ఫ్లిప్‌కార్టుల్లో అందుబాటులో వుంచినట్లు శాంసంగ్ ఇండియా ప్రతినితులు ప్రకటించారు. కొత్త శ్రేణిలో క్యూఎల్యేడి సిరీస్ క్యూఈఎఫ్1, క్లియర్ 4కె యుహెచ్‌డి టివి సిరీస్ యుఇ 81, యుఇ 84, యుఇ 86లు స్పష్టమైన రంగుతో సూక్ష్మాంశాలను కూడా చక్కగా వీక్షించేలా మన్నికతో అందిస్తున్నామన్నారు.

# అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి

## -బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి

**బాపట్ల,మే5,ప్రభాతవార్త:** అర్జీలను నిర్ణీత గడువులోపు చట్ట పరిధిలో విచారించి పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం



జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు వారి సమస్యలను జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. అర్జీదారుల సమస్యలను కులంకుషంగా విని వారు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. చట్ట పరిధిలో విచారించి అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, అత్తారింటి వేధింపులు, భూ వివాదాలు ఇతర పలు సమస్యల పరిష్కారం కోసం 51 మంది ఫిర్యాదుదారులు తమ అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర, పి జి ఆర్ ఎస్ సెల్ ఎస్పై, ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు ఎప్పుడూ సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసమే

**బాపట్ల,మే05,ప్రభాతవార్త:** ప్రభుత్వాలు ఎప్పుడూ బడా కార్పొరేట్లు, సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసమే పనిచేస్తాయని, శ్రామికుల,




చిన్న వ్యాపారుల ఆకలి, ఆర్థిక, అప్పుల సమస్యలను పట్టించుకోవని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఉమ్మడి గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ అన్నారు.సోమవారం బాపట్ల మండలం వెదుళ్ళపల్లి పంచాయతీ లోని మాజీ ఎంపీ కొల్లా వెంకయ్య కాలనీలో కారల్ మార్క్స్ 207వ జయంతిని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ బాపట్ల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎన్నడూ లేనంతగా ఏకీకృతమైందని వనరుల పంపిణీ విషయంలో ప్రభుత్వాల నుండి కార్పొరేట్ శక్తులు లాగేసుకున్నాయని అన్నారు. వివిధ రంగాలలోని కార్మికులను ఆయా ఉపాధుల నుండి తొలగించే కార్యాచరణకు పూనుకున్నారని అన్నారు. దేశంలో మోడీ,రాష్ట్రంలో ఇప్పటివరకు కొనసాగిన, కొనసాగుతున్న ప్రభుత్వాలు అధికారం చేపట్టిన ప్రతి ప్రభుత్వం నిరుద్యోగ సైన్యాన్ని తయారు చేస్తుందని అన్నారు. 30 సంవత్సరాల లోపు యువతి యువకులు 65 శాతం మంది మనదేశం లో నిరుద్యోగులుగా ఉన్నారని వివిధ నివేదికలు వెల్లడిస్తున్నాయి వీరికి ఉపాధి బతుకు భద్రత చూపించడంలో ప్రభుత్వాలు విఫలమైనాయని అన్నారు. తక్షణమే అన్ని రంగాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం వివిధ రంగాల శ్రమజీవులు పోరాటాలను ఉధృతం చేయడమే కారల్ మార్క్స్ కు ప్రజలు అర్పించే నివాళులని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం బాపట్ల డివిజన్ అధ్యక్షులు ఎస్కె అజీత. పివైఎల్ బాపట్ల డివిజన్ అధ్యక్షులు ఎస్‌డి హాఫిజుల్లా. ఇంటి పని వంట పని కార్మిక సంఘం సభ్యులు వెంకాయమ్మ, వీధి వ్యాపారుల సంఘం నాయకుల్బు నాగూర్ బీ , మస్తానీ వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 77ను రద్దు చేయకుండా ఐసెట్ పరీక్ష నిర్వహిస్తే అడ్డుకుంటాం

**బాపట్ల,మే5,ప్రభాతవార్త:** జీవో నెంబర్ 77ను రద్దు చేయకుండా ఐసెట్ పరీక్ష నిర్వహిస్తే అడ్డుకుంటామని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పవన్



కుమార్ అన్నారు.సోమవారం ఎబివిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 2020 లో తీసుకువచ్చినటువంటి జీవో నెంబర్ 77 ప్రైవేట్ కళాశాలలో పీజీ విద్యను అభ్యసించాలి అనుకునే పేద విద్యార్థుల పాలిట శాపం గా తయారయ్యిందన్నారు. ఆనాడు జీవోనెంబర్ 77 ఆమోదం లోకి వచ్చిన రోజు నుండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఎన్నో ఉద్యమాలను చేసి గత ప్రభుత్వ నాయకులకు నిద్ర లేకుండా చేసిందన్నారు.ఎన్నికలకు ముందు నేటి విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ తాము ప్రభుత్వంలోకి వచ్చిన వెంటనే జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని తాను చేసిన యువగలం పాదయాత్రలో చాలాసార్లు ప్రస్తావించారన్నారు. ప్రభుత్వం వచ్చి 327 రోజులు గడిచినా ఇంకా జీవో నెంబర్ 77 గురించి పట్టించుకోకపోవడం వారికి విద్యార్థుల మీద ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. మే 7 2025 న ఐసెట్ ప్రవేశ పరీక్షలు జరగబోతున్నాయని ఈ ఒక్క జీవో నెంబర్ 77 రద్దు చేయకుండా ఐసెట్ పరీక్షలు నిర్వహిస్తే ప్రైవేట్ కళాశాలలో ఎమ్‌బిఏ,ఎమ్‌సిఏ చదవాలనుకునే పేద విద్యార్థుల పరిస్థితి ఏంటి అని నేడు ప్రభుత్వాన్ని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిలదీస్తుందన్నారు.ఐసెట్ పరీక్షలకు ముందే జీవో నెంబర్ 77 ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.అలా రద్దు చేస్తున్నట్టు ప్రకటించక పోతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్ని ఉద్యమాలను చెయ్యడానికి అయిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వెనకడుగు వెయ్యదని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీవో నెంబర్ 77 రద్దు చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్, చైతన్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ గతిని మార్చిన ఘనత కారల్ మార్క్స్‌దే

## -ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు

**పొన్నూరు, మే 5,ప్రభాతవార్త:** ప్రపంచ గతిని మార్చిన కమ్యూనిస్టు, ప్రణాళికా రూపకర్త,




ప్రపంచ మేధావి, తత్వవేత్త కారల్ మార్క్స్ జన్మించి రెండు శతాబ్దాలు పై చిలుకు అయిందని ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం లో ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరేటి మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న సామాజిక ఆర్థిక అసమానతలకు అశాస్త్రీయ భావనలకు, మూఢ విశ్వాసాలకు ప్రధాన మూలకారణాన్ని కనుకొన్న నాయకుడు కారల్‌మార్క్స్ అన్నారు. కారల్‌మార్క్స్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తొలుత కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ శ్రీనివాస్, వెంకటేశ్వం రావు, కోటేశ్వరరావు, కరీమ్ పాల్గొన్నారు.

# ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

## -కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్



**పొన్నూరు, మే 5,ప్రభాతవార్త:** టెంపుల్ సిటీగా ప్రసిద్ధిగాంచిన స్వర్ణపురి పట్టణంలో వేంచేసియున్న శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయాల ప్రాంగణంలో కొలువై ఉన్న దశావతారముల దేవాలయానికి నూతన ధ్వజస్థంభ ప్రతిష్ఠా కార్యక్రమాలు ఈ నెల ఆరవ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరుగుతాయని కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆరవ తేదీన అంకురారోపణ, 7వ తేదీన ధాన్యాధివాసము, మహాశాంతి హోమము, 8వ తేదీన ఉదయం 7.02గంటలకు ధ్వజస్థంభ ప్రతిష్ఠా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయత్రం ఆరుగంటలకు శ్రీ స్వామివారికి శాంతి కళ్యాణం నిర్వహించడం జరుగుతుందన్నారు. ధ్వజస్థంభం దాతలు తాడేపల్లి సత్యమూర్తి ధర్మపత్ని నందినిచే నూతన ప్రతిష్ఠా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రలు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, తదితరులు హాజరవుతారని కార్యనిర్వహణాధికారి తెలిపారు.

# ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

**పొన్నూరు, మే 5,ప్రభాతవార్త:** పాఠశాల విద్యారంగంలో ప్రభుత్వం అవలంభిస్తున్న అశాస్త్రీయ, అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఎపిటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉపాధ్యా సమస్యలను పరిష్కరించాలన్నారు. అశాస్త్రీయ, అసంబద్ధ విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు.



ప్లకార్డులు ధరించి నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లంపాటి వెంకటేశ్వర్లు, ఎంఎం ఖుద్దూస్, మునగా వెంకటేశ్వరరావు, పి.బాలకృష్ణ, మేకా శ్రీనివాసరావు, ఎ.శ్రీనివాసరావు, షేక్ అన్వర్, ఆదినారాయణ, జె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# తెదేపా కార్యకర్త చిన్నశేషయ్యకు నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

**నరసరావుపేట, మే 5 ప్రభాతవార్త :** మండలంలోని పాలపాడు గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త కొమ్ముల చిన్నశేషయ్య



కనుమూశారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు వారి స్వగృహానికి వెళ్ళి చిన్న శేషయ్య భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిన్న శేషయ్య మృతిపట్ల సంతాపాన్ని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే అరవింద్ బాబు వెంట మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ పులిమి రామిరెడ్డి, టిడిపి నాయకులు ఉన్నారు.

# బాధిత ఎస్టీ మహిళకు న్యాయం చేయండి

## -స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు మాదిగ

**గుంటూరు విద్య,మే 5,ప్రభాతవార్త :** ఎస్టీ మహిళపై అకారణంగా దాడిచేసి,గాయపరిచిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత మహిళకు న్యాయం చేయాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ విజయవాడ పోలీస్ కమీషర్‌ను పత్రికా ముఖంగా కోరారు.కేసుకు సంబంధించి ఎఫ్ఐఆర్ పరంగా పోలీసులు వివరించిన అంశాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.కృష్ణాజిల్లా ఇబ్రహీం పట్నం కొండపల్లి గ్రామానికి చెందిన ఎస్టీ ఎరుకుల కులస్తురాలైన మొగిలి విజయలక్ష్మీ స్థానికంగా కిరాణా కొట్టు నడువుతూ జీవనం సాగిస్తుంది.స్థానికంగ ఉండే శ్రీనివాసరావు అనే వ్యక్తి కిరాణాకొట్టులో సరుకులు కొనుగోలు చేసిన దాని నిమిత్తం రూ.30వేలు విజయ లక్ష్మీకి బాకీ పడ్డాడు.బాకీ గురించి విజయలక్ష్మీ పలుమార్లు శ్రీనివాసరావును అడిగింది.అయితే శ్రీనివాసరావు లక్ష్యపెట్టలేదు,దీనితో ఆమె శ్రీనివాసరావు ఇంటికి వెళ్ళి అప్పుగురించి ప్రశ్నించడంతో ఆయన విజయలక్ష్మీని కులంపేరుతో దూషించడమే కాకుండా,మారణ యుధంతో దాడిచేసి ఆమెను గాయపరిచాడు. గాయం పాలైన బాధితురాలు విజయలక్ష్మీ విజయవాడ సత్యనారాయణ పురంలోని రైల్వే హాస్పటల్‌కు వెళ్ళి చికిత్స పొందింది.హాస్పటల్ అవుట్ పోస్టు పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని నమోదుచేశారు.బాధితురాలు విజయలక్ష్మీ ఫిర్యాదు మేరకు ఎస్సీ ఎస్టీ కేసు శ్రీనివాసరావుపై నమోదు చేశారు.ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ ఆమెను హాస్పటల్‌ను పరామర్శించి ధైర్యాన్ని చెప్పారు.జరిగిన దాడి గురించి పూర్వపరాలు తెలుసు కున్నారు. న్యాయం జరిగే వరకు మీ వెంట స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ ఉంటుందని ఆమెకు భరోసా ఇచ్చారు.ఈ కేసులో విజయలక్ష్మీకి తగిన న్యాయం జరగాలని,విజయవాడ పోలీసు కమీషనర్‌కు పత్రికా ముఖంగా ఏసుబాబు మాదిగ విజ్ఞప్తి చేశారు.

# భావదేవునికి పలు అలంకరణ సామాగ్రి అందజేత

**పొన్నూరు, మే 5,ప్రభాతవార్త:** పట్టణంలో వేంచేసియున్న శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి శ్రీ భావనారాయణస్వామివారికి తిరుమలకు చెందిన అలంకార రత్న ఎన్‌వివిఎన్ దీక్షితులు (వరయ్య) పలు అలంకరణ వస్తువులను



అందజేశారు. వీటిలో స్వామివారి అభిషేక మండపానికి నామము, శంఖుచక్రములు, కలశములు, ముఖమల్ గుడ్డతో కుట్టిన రెండు తెరలను సమర్పించారు. వీటిని ఆలయ ప్రధాన అర్చకస్వామి గోవర్ధనం రామకృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ రాంబాబు, పలువురు అర్చకస్వాములున్నారు.

# ఫార్మకాలోజికాల్ మేనేజ్‌మెంట్ ఆఫ్ స్ట్రెస్ పై సెమినార్

**గుంటూరు విద్య,మే 5,ప్రభాతవార్త :** స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల్లో ఫార్మకాలోజికాల్ మేనేజ్‌మెంట్ ఆఫ్ స్ట్రెస్ పై సెమినార్ ను ఫార్మకాలజీ విభాగం సోమవారం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిధిగా వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ,హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ డాక్టర్ సిహెచ్ జితేంద్ర స్ట్రెస్ గురించి వివరిం చారు.అనంతరం ముఖ్య అతిధిని కళాశాల యాజమాన్యం దుశ్శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో కళాశాల యాజ మాన్యం,తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# సాగునీటి చెరువులు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలి : బాపట్ల జిల్లా కలెక్టరు

**బాపట్ల,మే5,ప్రభాతవార్త:** సాగునీటి చెరువులు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు.సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల



పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగునీరు, త్రాగునీటి చెరువులు ఆక్రమణల గురైతున్నట్టు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలో అర్జీలు పెద్ద ఎత్తున వస్తున్నాయని ఆయన అన్నారు. జిల్లాలో సాగునీటి త్రాగునీటి చెరువులు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ, ఇరిగేషన్ , పంచాయ తీరాజ్ శాఖ అధికారులు సర్వే శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టి గ్రామ పెద్దల సమక్షంలో హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. చెరువులకు హద్దులు నిర్ణయించిన తర్వాత బయో ఫెన్సింగ్ ఏర్పాటు చేయడానికి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాలని ఆయన తెలిపారు.జిల్లాలో వ్యవసాయ సీజన్ ముగిసినందున రైతుల నుండి నీటి పన్ను వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నీటి పన్ను వారం రోజుల్లో నూరు శాతం వసూలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు.జిల్లాలో గృహ నిర్మాణశాఖ ద్వారా గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్, కులము, ఆదాయము సర్టిఫికెట్లను తహసీల్దార్లు, వెంటనే ఇవ్వాలన్నారు.జిల్లాలో పి4 పథకాన్ని అమలు చేయడానికి ప్రతి మండలానికి 200 మంది మార్గ దర్శకులను ఎంపిక చేయాలని ఆయన అధికారులకు చెప్పారు.మున్సిపాలిటీల్లో 500వంతున ఎంపిక చేయాలని ఆయన సూచించారు. బంగారు కుటుంబాలను10 చొప్పున అధికారులు దత్తత చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మీ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ , జిల్లామహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధామాధవి,జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామరెడ్డి, గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటేశ్వర్రావు, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# ఒంగోలు జాతి గిత్తలు ఆంధ్రుల వైభవానికి ప్రతీకలు

## -తెదేపా జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్

పొన్నూరు, మే 5,ప్రభాతవార్త: ఒంగోలు జాతి గిత్తలు తెలుగువారి, ఆంధ్రుల వైభవానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని తెలుగుదేశం పార్టీ



జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి, క్వారీ శ్రీ బాలకోటేశ్వరస్వామి ప్రాంగణంలో స్వర్గీయ ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి మెమోరియల్ ఆధ్వర్యంలో జరుగుతున్న వృషభరాజముల ప్రదర్శన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఒంగోలు గిత్తలు ఎడ్ల పోటీలు నిర్వహించడం ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కే సాధ్యమన్నారు. గతంలో ఎన్నడూ, ఎక్కడా లేని విధంగా ఇక్కడ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఇక్కడి పోటీలను తిలకిస్తున్నంతసేపు ఐపిఎల్ మ్యాచ్ తలపించేవిధంగా ఉందన్నారు. నరేంద్రకుమార్ ఏ కార్యక్రమం చేపట్టిన ఒక ప్రత్యేకత ఉంటుందన్నారు. నరేంద్రకుమార్ ఎంతో ఒత్తిడిగా ఉన్నప్పటికీ అనునిత్యం ప్రజలతోనే మమేకమై ఉండటానికి ఇష్టపడతారన్నారు. నరేంద్రకుమార్ అభిమానులను చూస్తుంటే ఈ ప్రాంత ప్రజానీకం నరేంద్రకుమార్‌పై ఎంతటి అభిమానం కలిగి ఉన్నారో అర్థమవుతుందన్నారు. టిడిపి అధికారంలో లేని రోజుల్లో కూడా ఈ ప్రాంతంలో జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేసిన ఘనత నరే ంద్రకే దక్కుతుందన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమ్మద్ మాట్లాడుతూ నరేంద్రకుమార్ చక్కటి విజన్ ఉన్న నాయకుడన్నారు. నియోజకవర్గంలో అప్పటి ఎమ్మెల్యే చేసిన అరాచకాలను, అవినీతిని ఎండగట్టిన ఘనుడు నరేంద్రకుమార్ అని చెప్పారు. రైతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచి వారికోసం వీరయ్య చౌదరి పేరుమీద ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్న ఘనత నరేంద్రకుమార్‌దేనన్నారు.ఇక్కడి వృషభరాజముల ప్రదర్శన దేశంలో ఎక్కడా జరగలేదన్నారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్, ఆయన్ను నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలు కమిట్‌మెంట్‌తో పనిచేస్తారన్నారు. గెలుపొందిన జట్ల యజమా నులకు నగదు పారితోషికాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, సంగం డెయిరీ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు తదితరులు సేవలు అందిస్తున్నారు.

# ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ఎపిజీఈఎ ప్రధాన లక్ష్యం

## -జిల్లా అధ్యక్షులు సయ్యద్ బాంద్‌బాష

**తెనాలి, మే5 (ప్రభాతవార్త) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం దుగ్గిరాల యూనిట్ కార్యవర్గ సభ్యుల సమావేశం సోమవారం సాంఘీక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎపిజీఈఎ జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా మాట్లాడుతూ జూన్ మొదటి వారంలో ఎపిజీఈఎ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరుగుతుందని తెలిపారు. గుంటూరు జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు 12వ



వేతన సవరణ సంఘ ఏర్పాటు, ఐఆర్‌ను 1-7-2023అమలు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలన్నారు. సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామని చాంద్‌బాషా తెలిపారు. సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల యొక్క సమస్యలే ప్రధాన అజెండాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిజీఈఎ అధ్యక్షులు అందెబాల చంద్రమౌళి, సహ అధ్యక్షులు వంకదార సుబ్బారావు, ఉపాధ్యక్షులు గుంటూరు పూర్ణప్రసాద్, చిట్టిబాబు, కార్యదర్శి టి.మనోహర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ బొల్లంపల్లి బుజ్జి, నూకవరపు శ్రీలక్ష్మీ, క్రియాశీలక సభ్యులు బసవయ్య, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగించుకోవాలి

## -మండల వైద్యాధికారి సుమంత్

**కొల్లిపర,మే 5 ప్రభాతవార్త:** మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు.సోమవారం మండల పరిధిలోని పిడపర్రులో వైద్యాధికారులు ప్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపు నిర్వహించారు.ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ వేసవికాలంలో గర్భిణీలు తగిన జాగ్రత్రలు తీసుకోవా లన్నారు. బీపీ,షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాల మేరకు మందులు వాడుకోవాలన్నారు.దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి నెల తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాల న్నారు.కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ మున్నీసా బేగం,డీఈవో బొమ్ము కోటిరెడ్డి,ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.



# పేదల ఉపాధి కోసమే ఉపాధిహామీ పనులు : ఎపిఓ వెంకయ్య

**కొల్లిపర,మే 5 ప్రభాతవార్త:** పేదప్రజలకు ఉపాధి కల్పించటానికే ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు ఎపిఓ వెంకయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని చివలూరు, కొల్లిపర,వల్లభాపురం,మున్నంగి తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా వెంకయ్య



మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా నిరుపేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ రామకోటయ్యకు అరుదైన పురస్కారం

**మాచర్లటౌన్, మే 5 ప్రభాతవార్త:** రోటరీక్లబ్ ఆఫ్ మాచర్లకు చెందిన డాక్టర్ కొండవీటి రామకోటయ్య గత 25 సంవత్సరాలుగా సాహసోపేతంగా నాటు పడవల ద్వారా ప్రయాణించి, అటవీ మార్గం ద్వారా నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న వలస ప్రాంతాలకు చెందిన సుమారు 500 కుటుంబాలకు చెందిన చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేస్తూ, పోలియో రహిత ప్రపంచం కోసం కృషి చేసినందుకు గాను రోటరీ ఇంటర్నేషనల్ 'రీజనల్ సర్వీస్ అవార్డ్ ఫర్ పల్స్ పోలియో ఫ్రీ' పురస్కారం అందుకున్నారు. డాక్టర్ వెలగపూడి లక్ష్మణదత్తు ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో రోటరీ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ కాట్రగడ్డ శరత్‌చౌదరి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. రామకోటయ్యతోపాటుగా 10 బృంద సభ్యులను కూడా ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ కేపీ రంగారావు, కేపీసీ -1 యూనిట్ హెడ్ వి.వి.రమణ, డిస్ట్రిక్ అవార్డు కమిటీ చైర్మన్ డాక్టర్ విష్ణుబాబు, అసిస్టెంట్ గవర్నర్ సుమిత్ర కుమార్, ప్రెసిడెంట్ కృష్ణకుమారి, సెక్రటరీ నిమ్మగడ్డ సురేఖ, ట్రెజరర్ అన్నపురెడ్డి లక్ష్మి, ప్రోగ్రాం కన్వీనర్లు ఇక్కుర్తి శంకర్, తిర్లిక శ్రీనివాసరావు, ప్రోగ్రాం ఆర్గనైజర్, పఠాన్ నాగూర్‌వలి, రోటరీ సభ్యులు, సన్నిహితులు, వివిధ సేవా సంస్థల అధ్యక్షులు, సభ్యులు, కేసీపీ యూనియన్ నాయకులు, కేసీపీ హెచ్‌ఆర్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.



# పిజిఆర్ఎస్‌కు ఎనిమిది అర్జీలు

**పొన్నూరు, మే 5,ప్రభాతవార్త:** ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)కు వివిధ సమస్యలకు సంబంధించిన ఎనిమిది అర్జీలు అందినట్లు తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు.



అందులో రెవెన్యూకు సంబంధించి ఆరు అర్జీలు, పంచాయితీరాజ్‌కు సంబంధించి ఒక అర్జీ, సర్వేకి సంబంధించి ఒక అర్జీ వచ్చిందన్నారు. వీటిని పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపినట్లు చెప్పారు. ప్రతి సోమవారం జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, మండల సర్వేయర్ అడపాల సత్యనారాయణ, కార్యాలయ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రామారావు, మండల వ్యవసాయాధికారి దేగల వెంకట్రామయ్య, ఐసిడిఎస్ ప్రాజెక్టు సీడీపిఓ ఎస్.వెంకట రమణ,ఆర్అండ్‌బి ప్రతినిధి ప్రభాకరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎంఈఓను కలిసిన ఎపిటిఎఫ్ నాయకులు

**పొన్నూరు, మే 5,ప్రభాతవార్త:** పొన్నూరు మండల నూతన విద్యాశాఖాధికారి-2గా



బాధ్యతలు స్వీకరించిన కొల్లి విజయభాస్కర్‌ను మండల ఎపిటిఎఫ్ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకేలతో, శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొల్లి విజయభాస్కర్ మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులందరూ కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంఈఓను కలిసిన వారిలో ప్రధానకార్యదర్శి మల్లంపాటి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు ఎంఎం ఖుద్దూస్, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా, పి.బాలకృష్ణ, షేక్ తమీజ్, ఎ.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసరావు, మేకా శ్రీనివాసరావు, షేక్ అన్వర్, వెంకటరత్నం, రమేష్, రిటైర్డ్ టీచర్ షేక్ బద్రుద్దీన్ తదితరులున్నారు.

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**పొన్నూరు, మే 5,ప్రభాతవార్త:** పట్టణ పరిధిలోని 19వ వార్డు ఎస్టీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే



వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలు ముఖ్య అతిధిగా పాల్గొన్న ఐసిడిఎస్ ప్రాజెక్టు సెక్టార్ సూపర్‌వైజర్ శ్యామల మాట్లాడుతూ ప్రీస్కూల్ విద్య ముగించుకున్న విద్యార్థులకు ఎలిమెంటరీ స్కూల్‌కు వెళ్లాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతోపాటు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, సమదుస్తులు తదితరాలన్నీ ఉచితంగా అందజేస్తారని చెప్పారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రీస్కూలలో చేర్పించాలన్నారు. ప్రీ స్కూల్ విద్య పూర్తి చేసుకొన్న విద్యార్థులకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్లను అందజేసి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పలువురు గర్భిణీస్త్రీలకు శ్రీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికారం యొక్క లాభాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సిహెచ్ కుమారి, కె.వెంకటేశ్వరమ్మ, కె.కుసుమ కుమారి, సిహెచ్ శిరీష, ఎఎన్ఎం సుజాత తదితరులు పాల్గొన్నారు.

# 'ఐ యామ్ గేమ్' షూటింగ్ షురూ


దుల్కర్ సల్మాన్ హీరోగా, నహాస్ హిదాయత్ దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మకమైన సినిమా "ఐ యామ్ గేమ్" తిరువనంతపురంలో గ్రాండ్ పూజతో షూటింగ్ ప్రారంభమైయింది. ఈ చిత్రాన్ని దుల్కర్ సల్మానే తన స్వంత బ్యానర్ వేఫారర్ ఫిల్మ్స్ పై నిర్మిస్తున్నారు. పూజ కార్యక్రమానికి ప్రధాన తారాగణం హాజరయ్యారు. అందులో ప్రముఖ నటులు యాంటోని వర్గీస్, తమిళ దర్శకనటుడు మిస్కిన్ ముఖ్యంగా పాల్గొన్నారు. మిస్కిన్ ఈ చిత్రంతో మలయాళంలోకి అడుగుపెడుతున్నారు. ఈ చిత్రానికి కథను సజీర్ బాబ, ఇస్మాయిల్ అబుబక్కర్, బిలాల్ మొయిదు అందించారు. డైలాగ్ రైటర్స్‌గా ఆధర్ష్ సుకుమారన్, షహబాస్ రషీద్ పని చేస్తున్నారు. ఇది దుల్కర్ సల్మాన్‌కు 40వ చిత్రం కావడం విశేషం, అలాగే నహాస్ హిదాయత్ బ్లాక్‌బస్టర్ ఆర్‌డిఎక్స్ తర్వాత దర్శకత్వం వహిస్తున్న ప్రాజెక్ట్ కావడం మరో హైలెట్. యాంటోని వర్గీస్, మిస్కిన్ ఈ చిత్రంలో భాగమవుతున్నారని ప్రకటించడంతో ఇప్పటికే అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొంది. తిరువనంతపురంలో చిత్రీకరణ మొదటి షెడ్యూల్ కొనసాగుతోంది. ఇది దుల్కర్ ఇప్పటి వరకు చేసిన మలయాళ చిత్రాలలో అత్యంత భారీ బడ్జెట్ చిత్రంగా రూపొందుతోంది. ఇందులో హైవోల్టేజ్ యాక్షన్



సన్నివేశాలు ఉండబోతున్నాయి. ప్రత్యేకంగా రూపొందించిన టైటిల్ పోస్టర్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, సినిమాపై భారీ అంచనాలు నెలకొల్పింది. సినిమాటోగ్రఫీ - జిమ్షీ ఖలీద్, సంగీతం - జేక్స్ బిజోయ్, ఎడిటింగ్ - చమన్ చాకో, ప్రొడక్షన్ డిజైనర్ - అజయన్ చల్లిసేరీ, మేకప్ - రోనెక్స్ జేవియర్, కాస్ట్యూమ్ - మాషర్ హంస, ప్రొడక్షన్ కంట్రోలర్ - దీపక్ పరమేశ్వరన్, అసోసియేట్ డైరెక్టర్ - రోహిత్ చంద్రశేఖర్, - మాన్స్య మంజిత్, లిరిక్స్, వి. తౌఫిక్ (గుడ్డు తెలుపు), పోస్టర్ డిజైన్ - టెన్ పాయింట్, సౌండ్ డిజైన్ - సింక్ సినిమా, సౌండ్ మిక్సింగ్ -కన్నన్ గణపత్.

# త్రిడీలో 'జగదేకవీరుడు అతిలోక సుందరి' రీ రిలీజ్

టాలీవుడ్ నుంచి వచ్చి అతి పెద్ద సక్సెస్ సాధించిన సినిమాల్లో ఒకటిగా నిలిచిన చిత్రం జగదేకవీరుడు అతిలోక సుందరి. అంతేకాదు మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లో ఓ మైలురాయిగా నిలిచిన సినిమా ఇది. 1990వ సంవత్సరం మే నెల 9వ తేదీన విడుదలైన ఈ సినిమా అప్పట్లో ఓ సంచలనమే. అయితే ఈ ఏడాది ఈ సినిమా 35వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మే 9న మళ్లీ థియేటర్లలో విడుదలకు సిద్ధం చేశారు. అది కూడా 2డి అండ్ 3డి



ఫార్మాట్లలో. ఈ సోషియోఫాంటసీ డ్రామాకు విజనరీ దర్శకుడు కే. రాఘవేంద్రరావు దర్శకత్వం వహించగా.. వైజయంతి మూవీస్ బ్యానర్‌పై ప్రముఖ నిర్మాత అశ్వినీ దత్ నిర్మించారు. ఈ చిత్రాన్ని వైజయంతి మూవీస్ బ్యానర్‌కి ఒక గేమ్‌చేంజర్‌గా ఆయన ఇప్పటికీ భావిస్తుంటారు. ఈ చిత్రంలో మెగాస్టార్ చిరంజీవికి జోడిగా శ్రీదేవి నటించి ప్రేక్షకుల మనసులను గెలుచుకుంది. అమ్రిష్ పురి, అల్లు రామలింగయ్య, కన్నడ ప్రభాకర్, బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, రామిరెడ్డి, బేబీ శాలిని, బేబీ షామ్లీ వంటి ప్రతిభావంతులైన నటీనటులు కీలక పాత్రలు పోషించారు. అయితే ఈ క్లాసిక్ చిత్రాన్ని లేటెస్ట్ ప్రింట్‌తో నేటితరం ప్రేక్షకుల ముందు పెట్టాలనే సవాలుతో చిత్ర బృందం ఎంతో కష్టపడింది. మూడు సంవత్సరాల పాటు ఎన్నో చోట్ల, ఎంత వెతికినా కూడా అసలైన నెగటివ్ దొరకలేదు. చివరికి దొరికిన కాపీ కూడా చాలా దెబ్బతిని ఉంది. అయినప్పటికీ, ప్రసాద్ కార్పొరేషన్ సహకారంతో చిత్రబృందం అవిశ్రాంతంగా శ్రమించి ప్రైమ్ ఫోకస్ సాయంతో 3డీ రూపానికి తీసుకురావడంలో విజయవంతమయ్యారు. 2018లో జగదేకవీరుడు అతిలోక సుందరి నెగటివ్ రీల్ కోసం వెతుకులాట మొదలుపెట్టారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ప్రతి మూలకు ఫోన్ చేసి, చిన్న థియేటర్లలోనూ ఉపయోగపడే రీల్ ఉందేమో అడిగి తెలుసుకుంది చిత్రబృందం. అయితే కొన్నిచోట్ల రీల్స్ పూర్తిగా డికంపోజ్ కాగా, చివరకు 2021లో విజయవాడలోని అప్పారావు అనే వ్యక్తి వద్ద ఉపయోగపడే ప్రింట్ రీల్ ఒకటి దొరికిందని చిత్ర బృందం చెబుతోంది. అదికూడా దుమ్ము దూళితో నిండిపోయి మసకబడిపోయిన స్థితిలో ఉండగా.. చిత్రయూనిట్ అంతా ఎంతో కష్టపడి పునరుద్ధరణ ప్రారంభించారట. రీల్ ఎక్కడ ఎక్కడ కట్ అయిందో అక్కడ దానికి మరమ్మతు చేసి, జాగ్రత్తగా స్కాన్ చేశారు. ఫ్రేమ్ వారీగా ఉన్న డిజిటల్ స్క్రాచెస్‌ను తొలగించారు. తర్వాత చిత్రాన్ని రెజల్యూషన్‌లో డిజిటైజ్ చేసి, అవుట్‌పుట్‌గా మార్చారు. భారతీయ సినిమాలో ఇప్పటివరకు ఎవరూ ప్రయత్నించని విధంగా, చిత్రాన్ని 3డి రూపంలోకి మార్చే సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. అనేక ఏళ్ల శ్రమ, నిబద్ధతతో పునరుద్ధరించిన ఈ చిత్రాన్ని ఇప్పుడు సరికొత్తగా థియేటర్స్‌లోకి తీసుకొస్తున్నారు. గతంలో కంటే మెరుగైన అనుభూతితో 2డి, 3డి ఫార్మాట్లలో మే 9 నుంచి మళ్లీ థియేటర్లలో మీరు ఈ జగదేకవీరుడు అతిలోక సుందరి చిత్రాన్ని ఎంజాయ్ చేయొచ్చు. సో.. మెగా ఫ్యాన్స్ అండ్ టాలీవుడ్ ఆడియన్స్ బీ రెడీ.

# శ్రీతేజ్‌ను పరామర్శించిన అల్లు అరవింద్, బన్నీ వాసు

సంధ్య థియేటర్ తొక్కిసలాటలో ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను కిమ్స్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసి ఏషియన్ ట్రాన్స్ కేర్ రిహాబిలిటేషన్ కేంద్రానికి తరలించిన విషయం తెలిసిందే. రిహాబిలిటేషన్ కేంద్రంలో ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న శ్రీతేజ్‌ను సోమవారం ఉదయం నిర్మాత అల్లు అరవింద్, నిర్మాత బన్నీ వాసు పరామర్శించారు. శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. శ్రీతేజ్ హాస్పిటల్‌లో ఉన్నప్పటి నుంచి అతని యోగ క్షేమాలను అల్లు అర్జున్, అల్లు అరవింద్, బన్నీ వాసు ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటూనే ఉన్నారు. శ్రీతేజ్ హాస్పిటల్ ఖర్చులతో పాటు, అతని కుటుంబానికి హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్, మైత్రీ మూవీస్ నిర్మాతలు నవీన్ ఎర్నేని, యలమంచలి రవిశంకర్‌లు ఆర్థికంగా సహాయం చేసిన సంగతి తెలిసిందే. శ్రీతేజ్ మళ్లీ ఎప్పటిలానే నార్మల్ స్థితికి వచ్చి, అందరితో కలిసి స్కూల్‌కు వెళ్లే



వరకు, అలాగేభవిష్యత్‌లో అతనికి ఏఅవసరం వచ్చినా అతనికి, అతని ఫ్యామిలీకిఅండగా ఉండేందుకు అల్లుఅర్జున్ సైతం కమిటై ఉన్నారు. కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స మొదలు, ప్రస్తుతం రిహాబిలిటేషన్ సెంటర్‌లో ట్రీట్‌మెంట్ వరకు ఎప్పటికప్పుడు అల్లు అరవింద్, బన్నీ వాసులను పంపించి, శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిని అల్లు అర్జున్ తెలుసుకుంటూనే ఉన్నారు.

# 'తెరచాప' టీజర్ లాంచ్

అనన్య క్రియేషన్స్ బ్యానర్ పై కైలాష్ దుర్గం నిర్మాతగా జోయల్ జార్జ్ రచనా దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం తెరచాప. నవీన్ రాజ్ శంకరపు, పూజ సుహాసిని, స్రీలు ముఖ్యపాత్రలో నటిస్తూ రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, జగదీష్ ప్రతాప్ బండారి, రాఖి, నాగ మహేష్, ఫిష్ వెంకట్, అశోక్, నాగి, అప్పారావు, రైసింగ్ రాజు, రాజేష్ భూపతి తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించారు. అజీమ్, వెంకట్ సినిమాటోగ్రాఫర్లుగా పనిచేసిన ఈ చిత్రానికి ప్రజల క్రిష్, ఎం ఎల్ రాజా సంగీతాన్ని అందించారు. కాగా హైదరాబాదులోని ప్రసాద్ ల్యాబ్లో హీరో కార్తీక్ రత్నం, హరికథ దర్శకుడు మ్యాగీ చేతుల మీదగా ఈ చిత్ర టీజర్ లాంచ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా హరికథ దర్శకుడు మ్యాగి మాట్లాడుతూ, పృథ్వికి నమస్కారం. ఈ సినిమా టీం గురించి నాకు పెద్దగా తెలీదు, కానీ వీళ్ళు పెట్టిన ఎఫోర్ట్స్ నేను టీజర్‌లో చూశాను. సినిమాలో మంచి కంటెంట్ ఉంది. కచ్చితంగా ఈ సినిమా హిట్ అవుతుందని నాకు నమ్మకం ఉంది అన్నారు. నటుడు 30 ఇయర్స్ పృద్వి మాట్లాడుతూ,



తెరచాప ఒక అద్భుతమైన సినిమా. నవీన్‌ని చూస్తుంటే తమిళ హీరో విక్రమ్ గుర్తొస్తున్నాడు. ఆయన సినిమా కోసం ఎంత కష్టపడతాడో నవీన్ కూడా అంతే కష్టపడుతున్నాడు. కచ్చితంగా ఇతను మన టాలీవుడ్‌కి విక్రమ్ లాంటి హీరో అవుతాడు. ఈ సినిమా కోసం నవీన్ చాలా కష్టపడ్డాడు. అతన్ని చాలా అభినందించాలి. రాత్రి పగలు కష్టపడ్డాడు అన్నారు. డైరెక్టర్ జోయెల్ జార్జ్ మాట్లాడుతూ, ఈ సినిమాని మంచి మాస్‌సినిమాగా తీసాం. అలాగే ఇందులో కొంచెం తమిళ నేపథ్యం ఉంటుంది. ఇందుకుసంబంధించి రిఫరెన్స్‌లు కూడా సినిమాలో మీరుచూడవచ్చు. ఈసినిమా కోసం మా నటులు, టెక్నీషియన్స్ చాలా కష్టపడ్డారు. వాళ్ళ సహకారం లేకుంటే ఈ సినిమా ఇంత అద్భుతంగా వచ్చుం డేది కాదు.

# 'థగ్ లైఫ్' నుంచి ఫస్ట్ సింగిల్

పాన్ ఇండియా స్థాయిలో ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల్లో థగ్ లైఫ్ ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇండియన్ సినిమాలో రెండు పవర్ హౌసెస్ ఉలగనాయగన్ కమల్ హాసన్, విజనరీ డైరెక్టర్ మణిరత్నం మూడున్నర దశాబ్దాల తరువాత ఈ సినిమాతో మళ్లీ కలసి రావడం విశేషం. వీరి కాంబినేషన్ లో వచ్చిన లెజెండరీ మూవీ నాయకుడు భారత చలనచిత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది. అందుకే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. మాఫియా గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగే ఈ కథలో ఇంటెన్స్ డ్రామా, ఎమోషన్స్‌తో నిండిన కథనాన్ని థగ్ లైఫ్ అందించబోతోంది. ఈ ఉత్సాహానికి మరింత ఊపునిచ్చే అంశం హీరో సింబు కీలక పాత్రలో కనిపించనున్నాడు. ఈ పాత్ర కథకు బలాన్ని, డైనమిజాన్ని అందించనుంది. ఈ చిత్రంలో త్రిషా కృష్ణన్, సాన్యా మల్హోత్రా, అశోక్ సెల్వన్, అభిరామి, ఐశ్వర్య లక్ష్మి, జోజు జార్జ్ ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రంలోని ఫస్ట్ సాంగ్ జింగుచా వెడ్డింగ్ యాంథమ్‌గా అదరగొట్టింది. రెహమాన్ తన ప్రత్యేక శైలిలో ఆధునిక బాణీలతో ఈ పాటను అద్భుతంగా మలిచారు. మంగ్లీ, శ్రీకృష్ణ, ఆశిమా మహాజన్, వైశాలి సామంత్ ప్లజెంట్ వోకల్స్‌తో పాటకు ప్రాణం పోశారు. అనంత శ్రీరామ్ రాసిన లిరిక్స్ పాటకి పండుగ వాతావరణాన్ని ఇచ్చాయి. ఇది శబ్దాల, నృత్యాల, సాంస్కృతిక ఉత్సవంగా నిలుస్తోంది. సాంగ్ విజువల్‌గా ఐఫీస్ట్ లా వుంది. కమల్ హాసన్ తన ప్రజెన్స్‌తో కట్టిపడేశారు, సాన్యా మల్హోత్రా ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో అద్భుతంగా మెప్పించింది. సింబు, త్రిష, ఇతర నటులు కూడా తమ ప్రజెన్స్ పాటను మరో స్థాయికి తీసుకెళ్ళారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రవి కె చంద్రన్, ఎడిటింగ్: శ్రీకర్ ప్రసాద్, ప్రొడక్షన్ డిజైన్: శర్మిష్ట రాయ్, స్టంట్స్: అన్బరివ్ ఈ సినిమాను కమల్ హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ ఆనంద్ కలిసి రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్ బ్యానర్లపై నిర్మిస్తున్నారు. ఉదయనిధి స్టాలిన్ రెడ్ జైయింట్ మూవీస్ ఈ చిత్రాన్ని ప్రెజెంట్ చేస్తోంది.



శ్రేష్ఠ్ మూవీస్ (ఎన్ సుధాకర్ రెడ్డి) ద్వారా ఈ సినిమా తెలుగులో గ్రాండ్‌గా విడుదలవుతుంది. గతంలో విక్రమ్, అమరన్ లాంటి బ్లాక్‌బస్టర్లు అందించిన ఈ సంస్థ ఇప్పుడు థగ్ లైఫ్‌ను తీసుకొస్తోంది. సినిమా జూన్ 5న విడుదల కానుంది. తారాగణం: కమల్ హాసన్, సింబు, త్రిషా కృష్ణన్, అలీ ఫజల్, అశోక్ సెల్వన్, పంకజ్ త్రిపాఠి, జోజు జార్జ్, అభిరామి, ఐశ్వర్య లక్ష్మి, సాన్యా మల్హోత్రా, సాంకేతిక బృందం: రచన, దర్శకత్వం: మణిరత్నం, నిర్మాతలు: కమల్ హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ ఆనంద్, బ్యానర్లు: రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, ప్రెజెంటర్: ఉదయనిధి స్టాలిన్ (రెడ్ జైయింట్ మూవీస్).



ప్రగ్యా జైస్వాల్ నయా లుక్

# జూనియర్‌లతో రానా దగ్గుబాటి, 'లోకా లోకా' క్రూ సందడి

మియామి ఎఫ్1 వీకెండ్ ఈసారి ఒక దేశీ ట్విస్ట్‌తో మరింత సంచలనం రేపింది. ఇండియన్ యాక్టర్, ఎంటర్‌ప్రెన్యూర్ రానా దగ్గుబాటి, తన లోకా లోకా టకీలా టీంతో కలిసి నగరంలోని అత్యంత ఎక్స్‌క్లూజివ్ పార్టీల్లో సందడి చేస్తూ కనిపించారు. హాలీవుడ్ గ్లామర్, హిప్‌హాప్ స్టార్‌లు, ఇండియన్ స్టైల్‌లో ఈ వేడుకలో 50 సెంట్స్, ఫ్లో రిడా, ఆస్కార్ విజేత క్యూబా గూడింగ్ జూనియర్‌లు రానా, అతని టీంతో కలిసి సందడి చేశారు. ఈ జోష్ మియామి నగరమంతా చర్చగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా తన విజన్‌కి పేరుపొందిన రానా, ఈ వేడుకలో తన భాగస్వాములు అయిన ఇండియన్ మ్యూజిక్ స్టార్ అనిరుధ్, సీరియల్ ఎంటర్ ప్రెన్యూర్ శ్రీ హర్ష వడ్లమూడితో కలిసి తమ ప్రీమియమ్ టకీలా బ్రాండ్ అయిన లోకా లోకాను ప్రమోట్ చేస్తున్నారు. ఎఫ్1 మియామి గ్రాండ్ ప్రిక్స్‌కు ప్రపంచం నలుమూలల నుండి సెలబ్రిటీలు, రేసింగ్ స్టార్లు వచ్చి చేరగా, లోకా లోకా పార్టీ హైప్రొఫైల్ నెట్‌వర్కింగ్‌కి స్టేజ్‌గా నిలిచింది. ఫోటోలు, వీడియోల్లో రానా లైట్ మూడ్‌లో కనిపించగా, క్యూబా గూడింగ్ జూనియర్‌తో నవ్వులు పంచుకున్నారు, అలాగే 50 సెంట్స్‌తో బ్యాక్‌స్టేజ్‌లో కలిసాడు. ఇంతలో 50 సెంట్స్ తన సర్ప్రైజ్ పెర్ఫార్మెన్స్‌తో సందడిని మరింత పెంచాడు. ఇది ఇండియన్ ట్యాలెంట్, అమెరికన్ స్టైలుతో కలసిన ఒక స్టైలిష్ కలయికగా మారింది. ప్రపంచ లైఫ్స్టైల్ వర్గాల్లో లోకా లోకా మంచి పేరు తెచ్చుకుంటున్న తరుణంలో, రానా భారత్‌లో తన నెక్స్ట్ జెన్ బ్రాండ్ , కంటెంట్ సామ్రాజ్యాన్ని నిర్మిస్తుండగా, ఇలాంటి సందర్భాలు ఆయనను ఒక రియల్ కల్చరర్ బ్రిడ్జిగా నిలుపుతున్నాయి ఇండియన్ క్రియేటివ్ ఎనర్జీని, వ్యాపారవేత్తల ప్రతిభను గ్లోబల్ నెట్‌వర్కుల్లోకి తీసుకెళ్తున్నారు. ఎఫ్1 వీకెండ్ అంతా స్పీడ్ గురించి ఐతే రానా దగ్గుబాటి, లోకా లోకా స్టైల్ అండ్ సెలబ్రేషన్.



# ఎమోషనల్ మూవీ 'సింగిల్'

కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్ లో హోల్సమ్ ఎంటర్‌టైనర్ సింగిల్‌తో అలరించబోతున్నారు. ఈ చిత్రంలో కేతిక శర్మ, ఇవానా కథానాయికలుగా నటించారు. వెన్నెల కిషోర్ కీలక పాత్ర పోషించారు. సింగిల్ మే 9న థియేటర్లలోకిరానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ కార్తీక్ రాజు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**మీ సినిమాలు హారర్ యాక్షన్ టచ్‌తో ఉంటాయి కదా,.. సింగిల్ లాంటి లవ్ ఫన్ మూవీ చేయడం ఎలా అనిపించింది?**

నా ఫస్ట్ తమిళ్ సినిమా కామెడీ ఎంటర్టైనర్. ఎస్పీబీ ప్రొడ్యూస్ చేశారు. బేసిగ్గా నేను విఎఫ్ఎక్స్ సూపర్వైజర్‌ని. పోకిరి, ఒక్కడు, వర్షం, అతడు, సైనికుడు ఇలా చాలా పెద్ద తెలుగు సినిమాలకి వర్క్ చేశాను. అప్పుడే సినిమా డైరెక్షన్ పై ఆసక్తి ఏర్పడింది. సందీప్ కిషన్‌తో నిను వీడని నీడను సినిమా చేశాను.



**ఈ కథ శ్రీ విష్ణుకి ఎప్పుడు చెప్పారు?**

కోవిడ్ సమయంలో ఈ కథని శ్రీ విష్ణుకి చెప్పాను. అప్పుడాయన బ్రోచేవారెవరు చేశారు. ఆ సినిమా నాకు చాలా ఇష్టం.

**కేతిక, ఇవానా గురించి?**

ఇవానా, కేతిక ఇద్దరు అద్భుతమైన యాక్టర్స్. లవ్ టుడే సినిమా చూసినప్పుడు ఇవాళ పర్ఫార్మెన్స్ నాకు చాలా నచ్చింది ఇందులో కూడా తన పర్ఫార్మెన్స్ క్యూట్‌గా ఉంటుంది. కేతికే కూడా తన పాత్రని అద్భుతంగా చేసింది. ఈ కథలో ఇద్దరి క్యారెక్టర్స్ ఈక్వల్ గా ఉంటాయి.

**గీతా ఆర్ట్స్ గురించి?**

గీతా ఆర్ట్స్‌లో వర్క్ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. సినిమాకి కావలసిన ప్రతిదీ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సమకూర్చారు. చాలాఎంజాయ్ చేస్తూ ఈ ప్రాజెక్టుని చేశాం.

# 'శుభం' ప్రిరిలీజ్ ఈవెంట్

ప్రముఖ నటి సమంత నిర్మాణ రంగంలోకి అడుగు పెట్టారు. సమంత నేతృత్వంలోని వస్తున్న తొలిచిత్రం శుభం. ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద సమంత నిర్మిస్తున్న ఈ చిత్రాన్నికి ప్రవీణ్ కంద్రేగుల దర్శకత్వం వహించారు. ఈ సినిమాకు వివేక్ సాగర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, క్లింటన్ సెరెజో సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ క్రమంలో విశాఖపట్నంలో ప్రిరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో..సమంత మాట్లాడుతూ, వైజాగ్‌కు వస్తే ప్రతీ సారి సినిమా బ్లాక్ బస్టర్ వస్తోంది. వైజాగ్‌లో అభిమానుల్ని చూసి నాకు నిజమైన ప్రేమ ఏంటో అర్థమైంది. మా డైరెక్టర్ ప్రవీణ్ ఎనర్జీ చూసి నేను అంతా మర్చిపోయాను. నిర్మాతగా నేను ఓ కొత్త ఆలోచనతో ఈ శుభం సినిమాను స్టార్ట్ చేశాను. కొత్త వారితో కొత్త కథల్ని చేసి అందరినీ అలరించాలనే ఉద్దేశంతో ట్రా లా లా ప్రొడక్షన్ బ్యానర్‌ను స్టార్ట్ చేశాను. అదే నా లక్ష్యం. మే 9న ఫ్యామిలీతో కలిసి మా మూవీని చూడండి. ఈ సినిమాను చూసి థియేటర్ నుంచి ఓ మంచి నవ్వుతో బయటకు వస్తారు అని అన్నారు.



ప్రవీణ్ కంద్రేగుల మాట్లాడుతూ, శుభం సినిమా అద్భుతంగా ఉంటుంది. ఇంత వరకు తెలుగులో ఇలాంటి కంటెంట్ రాలేదు. ఇలాంటి కొత్త కంటెంట్ రావడం చాలా అరుదు. ఇలాంటి హారర్, కామెడీ జానర్‌లో చిత్రాలు రాలేదు. ఇలాంటి సినిమాలకు ఇప్పుడు బ్రాండ్ అయ్యారు. సమంత లాంటి వారు లేకపోతే మా శుభం ఇక్కడి వరకు వచ్చి ఉండేది కాదు. నన్ను నమ్మి రాజ్ అండ్ డీకే సినిమా బండి అవకాశం ఇచ్చారు. నేను వారికి ఎప్పుడూ రుణపడిఉంటాను అన్నారు. రైటర్ వసంత్ మరింగంటి మాట్లాడుతూ, సమంత వల్లే ఈ ప్రాజెక్ట్ ఇక్కడి వరకు వచ్చింది. సమంత వల్లే ఈ ప్రాజెక్ట్ గురించి అంతా మాట్లాడుకుంటున్నారు. ప్రవీణ్‌ది చిన్న పిల్లాడి మనస్తత్వం. సినిమా పట్ల ఎక్కువ ప్యాషన్ ఉంటుంది. మేం సినిమా బండికి కలిసి పని చేశాం. రాజ్ మాకు ఎన్నో ఇన్ పుట్స్ ఇచ్చారు. సీరియల్స్‌ని అందరూ తక్కువ చేసి మాట్లాడుతుంటారు. కానీ నాకు వాటిపై చాలా గౌరవం ఉంటుంది. అదే ఇందులో హారర్ ఫాంలో చూపించాం. కుటుంబ సమేతంగా ఈ మూవీని చూడొచ్చు. మే 9న మా చిత్రం రాబోతోంది. అందరూ చూడండి అని అన్నారు. హర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ, మెయిల్ చిత్రం తరువాత ఒక సారి ఎయిర్ పోర్టులో రాజ్ అండ్ డీకే సర్ నన్ను గుర్తు పట్టారు. అప్పుడే శుభం చిత్రానికి నాంది పడినట్టుంది. శుభం కథ అద్భుతంగా ఉంటుంది అన్నారు. నటుడు చరణ్ మాట్లాడుతూ, వైజాగ్‌లో షూటింగ్ చేసి వెళ్లిన తరువాత చాలా బాధగా అనిపించింది. వైజాగ్‌ను వదిలి వెళ్లాలని అనిపించలేదు. ఇక్కడ షూట్ చేసిన చిత్రాలన్నీ హిట్ అవుతుంటాయి. మా కాలేజీలో సమంతకి ఓ రేంజ్ క్రేజ్ ఉండేది. సమంత అంటే నాకు చాలా అభిమానం. ఆమె చాలా కష్టపడుతుంటాం అన్నారు. శ్రీనివాస్ గవిరెడ్డి మాట్లాడుతూ, సమంత చాలా దేరింగ్‌గా శుభం సినిమాను నిర్మించారు. ఈ చిత్రంలో మాతగా కనిపిస్తారు. ఈ చిత్రంతో ఎంతో మంది ఆర్టిస్టుల్ని పరిచయం చేసి మాతగా మారారు. ఇంకా ఇలాంటి చిత్రాలెన్నో నిర్మించారు. ప్రవీణ్ కంద్రేగుల చాలా మంచి వ్యక్తి. వసంత్ రైటింగ్ అద్భుతంగా ఉంటుంది. హిమాన్ సెట్స్‌లో చాలా సీరియస్‌గా ఉండేవారు. మృదుల కెమెరా వర్క్ అందరికీ నచ్చుతుంది. ఈ చిత్రంతో నాకు చాలా మంది మంచిస్నేహితులు అయ్యారు. మే 9న మా చిత్రం రాబోతోంది.

6-5Pg5exHMNWJQEP.qxd:6-5Pg5exHMNWJQEP.qxd 01/01/01 7:41 AM Page 1





## విదేశాల్లో నిర్మించే సినిమాలపై
# 100 శాతం టారిఫ్
## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్, మే 5:** టారిఫ్ బాంబుతో ప్రపంచ దేశాలతోపాటు అమెరికన్లనూ అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వణికిస్తున్నారు. ఇప్పటికే సుంకాల మోతతో పలు రంగాలను కుదిపేసిన ఆయన.. సినీ పరిశ్రమనూ వదల్లేదు. విదేశాల్లో చిత్రీకరించి అమెరికాలో విడుదల చేసే సినిమాలపై 100 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు తాజాగా సంచలన ప్రకటన చేశారు. కొందరు హాలీవుడ్‌ను నాశనం చేస్తున్నారని, అందుకే ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదని ట్రంప్ వెల్లడించారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. 'అమెరికాలో సినీ పరిశ్రమ వేగంగా పతనమవుతోంది. మా దర్శక, నిర్మాతలు, స్టూడియోలను యునైటెడ్ స్టేట్స్ నుంచి దూరం చేసేందుకు ఇతర దేశాలు అన్ని రకాలుగా ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. దీంతో హాలీవుడ్, ఇతర సినీరంగ విభాగాలు నాశనమవుతున్నాయి. ఇతర దేశాలు చేస్తున్న సమష్టి కుట్ర ఇది. దీన్ని దేశ భద్రతకు ముప్పుగా పరిగణిస్తున్నాం. అందువల్ల, విదేశీ గడ్డపై నిర్మించి మన దేశంలోకి వచ్చే సినిమాలపై 100 శాతం సుంకం విధించే ప్రక్రియను వెంటనే ప్రారంభించేలా వాణిజ్య శాఖ, వాణిజ్య ప్రతినిధులకు అధికారాలు ఇస్తున్నా' అని ట్రంప్ రాసుకొచ్చారు. దీనిపై అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ స్పందిస్తూ 'మేం దానిపై పనిచేస్తున్నాం' అని సమాధానమిచ్చారు.

అయితే, అమెరికాలో సినిమాలను విడుదల చేసే విదేశీ నిర్మాణ సంస్థలకు ఈ టారిఫ్‌లు విధిస్తారా? ఓవర్సీస్‌లో నిర్మించే అమెరికా సినిమాలపై వేస్తారా అన్న దానిపై స్పష్టం లేదు. త్వరలోనే దీనిపై పూర్తి వివరాలు వెల్లడి కానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సినిమాలను వస్తువుగా కాకుండా మేధో సంపత్తిగా పరిగణిస్తుండటంతో వీటిపై ఎలాంటి టారిఫ్‌లు విధించడం లేదు. అయితే, హాలీవుడ్ వెలుపల షూటింగ్‌లు చేసే సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాలకు కొన్ని నగరాలు భారీ ఎత్తున పన్ను మినహాయింపులు కల్పిస్తున్నాయి.

దీంతో ఇటీవల కాలంలో చాలా నిర్మాణ సంస్థలు తమ కార్యకలాపాలను హాలీ వుడ్ నుంచి టొరంటో (కెనడా), డబ్లిన్ (ఐర్లాండ్) వంటి నగరాలకు తరలించాయి. ఈ క్రమంలోనే ట్రంప్ తాజా చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

# కెనడా నుంచి హిందువులను పంపించేయండి
## ఖలిస్థానీల దుష్ప్రచారం




**ఒట్టావా, మే 5:** కెనడాలో ఖలిస్థానీల దుశ్చర్యలు ఆగడం లేదు. తాజాగా ఆ దేశం నుంచి 8 లక్షల మంది హిందువులను వెనక్కి పంపించాలంటూ వేర్పాటువాదులు టొరంటోలోని మాల్టన్ గురుద్వారాలో ఓ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు భారత ప్రధాని మోదీ, హోమ్‌మంత్రి అమిత్‌షా, విదేశాంగ మంత్రి జైశంకర్ బొమ్మలను అభ్యంతరకర రీతిలో ఓ బోనులో పెట్టి ప్రదర్శించారు. ఇటీవల ఖలిస్థానీ మద్దతుదారులు ఓ గురుద్వారా, మందిరంలో విధ్వంసం సృష్టించారు. ఆ తర్వాత ఈ కార్యక్రమం జరగడం గమనార్హం.

కెనడాలోని హిందూ సమాజానికి చెందిన ఓ నాయకుడు షవన్ బిండా ఈ విడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఇది భారత ప్రభుత్వంపై చేస్తున్న ఆందోళన కాదు. ఖలిస్థానీ గ్రూపునకు ఉన్న హిందూ వ్యతిరేకత ఇది. కెనడాలో జరిగిన అతి భయంకరమైన దాడికి ఈ గ్రూపే కారణం' అని రాసు కొచ్చారు. ఆయన కనిష్కా బాంబింగ్ ఘటనను గుర్తు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

కెనడాకు చెందిన విలేకరి డానియల్ బోర్డమన్ కూడా హిందూ వ్యతిరేకతను రెచ్చగొడుతూ ఖలిస్థానీలు నిర్వహించిన కార్యక్రమం విడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అంతేకాదు ఖలిస్థానీలపై చర్యలు తీసుకోవడంలో కొత్త ప్రధాని మార్క్ కార్నీకిక మాజీ ప్రధాని ట్రూడోకు ఏమైనా తేడా ఉందా అని ప్రశ్నించారు.

ఖలిస్థానీలు కేంద్ర మంత్రులను బెదరించడం ఇదే తొలిసారి కాదు. ఇటీవల రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్‌సింగ్ బిట్టూను హత్య చేయడానికి వారు కుట్రలు పన్నుతున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో లీకైన కొన్ని స్క్రీన్‌షాట్లు తన దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. కేంద్రమంత్రి అమిత్‌షాపై కూడా ఖలిస్థానీ సంస్థ వారిస్ పంజాబ్‌దే నాయకులు కక్ష పెంచుకొన్నట్లు పేర్కొన్నారు

# పాకిస్థాన్‌కు భారత్ వరుస షాక్‌లు
## తాజాగా సలాల్ డ్యామ్ నీటిసరఫరా నిలిపివేత

**న్యూఢిల్లీ, మే 5:** పహల్గాం ఉగ్రదాడికి భారత్ నిశ్శబ్దంగా ప్రతీకార చర్యలు మొదలుపెట్టింది. ఇప్పటికే బాగ్‌లిహార్ డ్యామ్ నీటిని ఆపేయగా తాజాగా సలాల్ డ్యామ్‌ను కూడా మూసివేసింది. ఈ రెండు హైడ్రో పవర్ ప్రాజెక్టుల రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన పూడికతీత పనులు చేపట్టింది. ఇప్పటికే సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతో దీనికి సంబంధించిన సమాచారాన్ని పాక్‌కు వెల్లడించలేదు. తొలిసారి ఆ ఒప్పందానికి భిన్నంగా భారత్ తీసుకొన్న తొలిచర్యగా నిపుణులు చెబుతున్నారు. ఇదే సమయంలో జమ్ముకశ్మీర్‌లో నిలిచిపోయిన ఆరు ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జమ్ములోని రాంబన్‌లో చినాబ్ నదిపై ఉన్న బాగ్‌లిహార్ జలాశయం నుంచి నీటి సరఫరాను భారత్ నిలిపివేసింది. విద్యుదుత్పత్తికి ఉద్దేశించిన ప్రాజెక్టు నుంచి నీటిని వదలకపోవడం వల్ల పాక్‌లోని పంజాబ్ ప్రావిన్సుకు సాగునీరు అందడం లేదు. ఉపగ్రహ చిత్రాలు దీనిని ధ్రువీకరిస్తున్నాయి. జీలం నదిపై ఉన్న కిషన్‌గంగ జలాశయం నుంచి కూడా నీటిని పాక్‌కు వెళ్లనివ్వకుండా అడ్డుకోవాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. అంతేకాకుండా జమ్ము కశ్మీర్‌లోని డ్యామ్‌లలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకునే పనులను భారత్ వేగవంతం చేస్తోంది. బాగ్‌లిహార్, సలాల్ డ్యామ్‌లలో పూడికతీత పనులను భారత్ చేపట్టింది. ఈ ప్రాజెక్టుల్లో పూడికతీత పనులు చేపట్టడం ఇదే తొలిసారి. ఇంతకు ముందు ఇలాంటి చర్యలపై పాకిస్థాన్ అభ్యంతరం చెప్పేది. సింధునదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతో పాక్‌కు చెప్పకుండానే ఇప్పుడు భారత్, డ్యాంల నీటినిల్వ సామర్థ్యాన్ని పెంచుతోంది. తద్వారా విద్యుత్ ఉత్పత్తి



సామర్థ్యాన్ని భారత్ పెంచుకునే వీలు ఉంటుంది. గతవారంనుంచే రిజర్వాయర్‌లో బురదను తొలగించేందుకు ఫ్లషింగ్ ప్రక్రియను భారత్ మొదలుపెట్టింది. దాదాపు మూడు రోజులపాటు ఇది కొనసాగింది. ఈ పనులను ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌హెచ్‌పిసి పర్యవేక్షిస్తోంది. ఇలాంటి ప్రాజెక్టులు ఈ ప్రాంతంలో అరడజను కంటే ఎక్కువగా ఉన్నాయి. వాటిలో కూడా ఇదే విధంగా పూడికతీత పనులు భారత్ చేపడితే పాకిస్థాన్‌కు నీరు వెళ్లడం తగ్గుతుంది. పాకిస్థాన్‌లో వ్యవసాయ రంగం 80 శాతం సింధూ నదీ జలాలపైనే ఆధారపడుతోంది. ఈ నేపథ్యంలో భారత్ తీసుకుంటున్న చర్యలు దాయాదిపై పెను ప్రభావాన్ని చూపుతాయి. బురద తొలగింపు పనుల కోసం డ్యాంలలో ఉన్న నీటిని ఒకేసారి కిందకు వదలాల్సి వస్తుంది. అందుకే ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు చీనాబ్ నదిలో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగింది. పాకిస్థాన్ వైపు వరద లాంటి పరిస్థితి సంభవించింది. సలాల్ ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 690 మెగావాట్లు. బాగ్‌లిహార్ ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 900 మెగావాట్లు. సలాల్ డ్యామ్‌ను 1987లో, బాగ్‌లిహార్‌ను 2009లో ప్రారంభించారు. అయితే వీటిలో బురద తొలగింపునకు గతంలో పాకిస్థాన్ ఒప్పుకోకపోవడం వల్ల వీటి సామర్థ్యం కంటే తక్కువగానే అక్కడ విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. సింధు నదీ జలాల ఒప్పందం నిలిపివేయడంలో పాక్‌తో సంబంధం లేకుండానే ఈ ప్రాజెక్టుల్లో పూడికతీత పనులను భారత్ చేపట్టింది. ముఖ్యంగా జమ్ముకశ్మీర్ ప్రాంతంలో గతంలో నిలిచిపోయిన ఆరు ప్రాజెక్టుల నిర్మాణాన్ని కూడా కేంద్రం వేగవంతం చేయాలని భావిస్తోంది. ఈ ఆరు పూర్తయిన తర్వాత, జమ్ము కశ్మీర్ 10 వేల మెగావాట్ల వరకు విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంటుంది.

సింధు జలాల ఒప్పందం ప్రకారం పాక్‌కు కేటాయించిన మూడు నదుల్లో విద్యుత్ ఉత్పత్తి డ్యాంలను మాత్రమే నిర్మించే అవకాశం భారత్‌కు ఉండేది. ఇప్పుడు ఆ ఒప్పందాన్ని పక్కనపెట్టడంతో భారత్ పెద్ద ఎత్తున నీటి నిల్వ ప్రాజెక్టులు చేపట్టవచ్చు. సింధూ జలాల ఒప్పందం అమల్లో లేకపోవడం వల్ల పాక్‌కు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం భారత్‌కు లేదు. మన ప్రాజెక్టుల్లో ఇష్టం వచ్చిన మార్పులు చేసుకోవచ్చని సెంట్రల్ వాటర్ కమిషన్ మాజీ అధిపతి కుష్వీందర్ వోహ్రా పేర్కొన్నారు.



## ఉద్రిక్తతలు కొనసాగితే భారత్ కంటే పాక్‌కే
# ఎక్కువ నష్టం
## మూడీస్ సర్వే

**న్యూఢిల్లీ, మే 5:** పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ ఉద్రిక్తతలు ఇలాగే కొన సాగితే పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బ తింటుందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ హెచ్చరించింది. ఉద్రిక్తతల వల్ల భారత్‌తో పోల్చు కుంటే పాకిస్థానే తీవ్రంగా నష్టపోతుందని తెలి పింది. ఉద్రిక్తతల కారణంగా పాకిస్థాన్ వృద్ధి రేటు మందగించడం, నిధుల సేకరణకు పాక్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో ఇబ్బందులు వంటివి తలెత్తుతాయని మూడీస్ పేర్కొంది. పాకిస్థాన్‌కు బాహ్య అప్పుల లభ్యత పరిమితమై పోవడంతోపాటు ఆ దేశ విదేశీ మారకద్రవ్య నిల్వలు కరిగిపోతాయని మూడీస్ హెచ్చరిం చింది. ఇప్పుడు విదేశీ అప్పుల చెల్లింపులకు అవి సరిపోని పరిస్థితి నెలకొన్నట్లు వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో కూడా పాకిస్థాన్ ఐఎంఎఫ్ నిబంధనలు పాటించాల్సి ఉంటుందని పేర్కొంది. అదేవిధంగా భారత ఆర్థికవ్యవస్థ బలంగానే ఉంటుందని, స్థిరమైన వృద్ధిరేటును నమోదు చేస్తుందని మూడీస్ తెలిపింది. దీనికి తోడు నాణ్యమైన ప్రభుత్వ వ్యయాలు, ప్రజల వినిమయ శక్తి చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉంటా యంది. ప్రస్తుతప్రాంతీయ ఉద్రిక్తతల ప్రభావం అతిస్వల్పంగానే ఉంటుందని పేర్కొంది. భారత ఆర్థిక కార్యకలాపాల్లో పెద్దగా ఇబ్బందులు ఉం టాయని అనుకోబోమని, ఎందుకంటే భారత్‌కు పాక్‌తో ఉన్న ఆర్థిక సంబంధాలు అతి తక్కువని, భారత్ మొత్తం ఎగుమతుల్లో ఇస్లామాబాద్‌కు వెళ్లేవి 0.5శాతం మాత్రమేనని మూడీస్ వెల్లడిం చింది. 'ఇక మా జియోపొలిటికల్ అంచనా ప్రకా రం భారత్-పాక్ మధ్య పరిమిత స్థాయిలోనే సైనిక ప్రతిస్పందనలు ఉండవచ్చు. ఇక సమయాన్ని బట్టి అప్పుడప్పుడు ఇవి ఎగసిపడ వచ్చు. ఇరు దేశాలకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇలానే జరుగుతోంది. అంతేకాని విస్తృతస్థాయి సైనిక ఘర్షణకు ఇవి దారితీయవు' అని మూడీస్ రేటింగ్ ఏజెన్సీ పేర్కొంది.

# స్వల్పశ్రేణి క్షిపణిని పరీక్షించిన పాకిస్థాన్

**ఇస్లామాబాద్, మే 5:** 120 కి.మీ లక్ష్యం ఛేదించే ఫతా క్షిపణిని ప్రయోగించిన పాకిస్థాన్ పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి క్షిపణి ప్రయోగంతో పాక్ కవ్వింపు చర్యలకు పాల్పడింది. భూతలంపైకి 120 కి.మీ లక్ష్యం ఛేదించే ఫతా క్షిపణిని ప్రయోగించింది. ఈ మేరకు స్థానిక టెలివిజన్ ఛానల్ పీటీవీ న్యూస్ తెలిపింది. ప్రయోగ పరీక్ష విజువల్స్‌ను కూడా ప్రసారం చేసింది. సైనికుల కార్యాచరణ, సంసిద్ధతను నిర్ధరించడం, క్షిపణుల అధునాతన నావిగేషన్ వ్యవస్థ సహా కీలకమైన సాంకేతిక పరిమితులను ధ్రువీకరించడమే లక్ష్యంగా తాజా ప్రయోగం చేపట్టినట్లు పాకిస్థాన్ తెలిపింది. అయితే ఇటీవలే 450 కి.మీ లక్ష్యం ఛేదించే అబ్దాలి క్షిపణిని ప్రయోగించింది దాయాది దేశం. ఇప్పుడు ఫతా సిరీస్ బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాన్ని చేపట్టింది. అయితే ఏప్రిల్ 24, 25 తేదీల్లో కరాచీ తీరం వెంబడి ఎకనామిక్ ఎక్స్‌క్లూవ్ జోన్‌లో భూతలం నుంచి భూతలం పైకి క్షిపణి ప్రయోగాలు నిర్వహించేందుకు పాకిస్థాన్ నోటిఫికేషన్ జారీ చేసింది. అనంతరం ఏప్రిల్ 2627 మధ్య మరోసారి అలాంటి ప్రకటనే చేసింది. ఇటీవల ఏప్రిల్ 30 మే 2 మధ్య మరోసారి పరీక్షలు చేపడుతున్నట్లు ప్రకటించింది. ఇప్పుడు 120 కి.మీ లక్ష్యం ఛేదించే క్షిపణిని ప్రయోగించింది. పహల్గాం దాడి తరువాత భారత ప్రభుత్వం పాక్‌తో సంబంధాలను తెంచుకోవడానికి అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. దీంతో 11 రోజులుగా వాస్తవాధీన రేఖ వెంబడి పాక్ సైన్యం వరుసగా కాల్పులు జరుపుతోంది. ఉగ్రదాడి అనంతరం భారత్ తమపై ప్రతీకార దాడి చేసే



అవకాశం ఉందని పాక్ మంత్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం తమ సరిహద్దులో భారీ స్థాయిలో సైన్యాన్ని మోహరిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు గగనతల రక్షణ, ఫిరంగి వ్యవస్థలను సిద్ధం చేస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఏప్రిల్ 23న ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంది కేంద్ర ప్రభుత్వం. 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలని నిర్ణయించింది. పాక్ హైకమిషన్ అధికారులను పర్సనాలిటీ నాన్ గ్రాటాగా ప్రకటించింది. వారంలోపు భారతదేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. సార్క్ వీసా మినహాయింపు పథకం కింద అందించిన వీసాలను రద్దు చేయాలని నిర్ణయం తీసుకుంది. పాక్‌కు చెందిన వస్తువుల ప్రత్యక్ష లేదా పరోక్ష దిగుమతులపై తక్షణ నిషేధం విధించింది.



# గుండీలు ఎక్కువ ఉన్నాయని నీట్‌కు నో..
## సకాలంలో స్పందించిన కానిస్టేబుల్

**చెన్నై, మే 5:** వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ 2025 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. అయితే పరీక్ష రాసేందుకు వచ్చిన తమిళనాడులోని ఓ విద్యార్థినికి వింత అనుభవం ఎదురైంది. తాను వేసుకున్న డ్రెస్‌కు ఎక్కువ బటన్స్ ఉన్నాయని పరీక్షకు అనుమతి ఇవ్వలేదు. కానీ, అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ మహిళ కానిస్టేబుల్ చేసిన సాయం వల్ల పరీక్షను రాయగలిగింది. తిరుప్పూర్ జిల్లాలోని ఏవీపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ కూడా నీట్ పరీక్ష కేంద్రంగా ఉంది. విద్యార్థులను అధికారులు చెక్ చేసిన తర్వాత లోపలికి అనుమతిస్తున్నారు. ఈ క్రమంలోనే కనిమొళి అనే విద్యార్థి పరీక్ష రాయడానికి అక్కడికి వచ్చింది. హాల్ టికెట్, ఫొటోను పరీక్షించారు. ఆ తర్వాత ఆమె ధరించిన డ్రెస్‌కు ఎక్కువ బటన్స్ ఉన్నాయని, అది నిబంధనలకు విరుద్ధమని విద్యార్థిని లోపలికి అనుమతించలేదు. దీంతో ఆ విద్యార్థిని, ఆమె కుటుంబ సభ్యులు కలిసి బటన్స్ తొలగించేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలోనే అక్కడే విధుల్లో ఉన్న ఓ మహిళ కానిస్టేబుల్ ఆ విద్యార్థికి జరిగింది చూసింది. వెంటనే ఆమె దగ్గరకు వచ్చి తన స్కూటీపై షాప్‌కు తీసుకెళ్లింది. అక్కడ ఓ కొత్త డ్రెస్ కొనుగోలు చేసి ఇచ్చింది. పరీక్షా సమయం లోపే విద్యార్థిని కేంద్రానికి తీసుకొచ్చింది. సకాలంలో విద్యార్థినికి సాయం చేసినందుకు మహిళ కానిస్టేబుల్‌ను అందరూ అభినందిస్తున్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటలకు వరకు నీట్ పరీక్ష జరిగింది. దేశ వ్యాప్తంగా జరిగే ఈ పరీక్షకు నియమాలు కఠినంగానే ఉంటాయి. మధ్యాహ్నం 1.30 లోపే విద్యార్థులను పరీక్ష హాలులోకి అనుమతి ఇచ్చారు. నిమిషం ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు లోపలికి అనుమతి ఉండదు. ఉదయం 11 గంటల నుంచే లోపలికి అనుమతించారు. నిమిషం నిబంధనం కారణంగా పలు కేంద్రాల్లో ఆలస్యంగా వచ్చిన కొంతమంది విద్యార్థులను లోనికి అనుమతించలేని ఘటనలు కూడా కొన్ని చోట్ల జరిగాయి. ఉంగరాలు, చెవిపోగులు, గొలుసులు వంటివి ధరించకూడదని, అబ్బాయిలు అయితే ఫుల్ హ్యాండ్స్ ఉన్న షర్టులు వేసుకోకూడదన్న నిబంధనలు ఉన్నాయి.

# పాకిస్థాన్ నిధుల్లో కోత పెట్టండి..
## ఎడిబి అధ్యక్షుడితో సమావేశంలో కేంద్ర మంత్రి నిర్మల డిమాండ్

**న్యూఢిల్లీ, మే 5:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా పాకిస్తాన్‌పై భారత్ అన్ని రకాల చర్యలను చేపడుతోంది. దాని ఆర్థిక మూలాలను దెబ్బతీసే ప్రయత్నాలను భారత సర్కారు వేగవంతంగా చేసింది. ఈక్రమంలోనే ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఎడిబి) అధ్యక్షుడు మసాతో కందాతో భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమావేశమయ్యారు. ఉగ్రవాద కార్యకలాపాలకు వేదికగా మారిన పాకిస్తాన్‌కు నిధుల కేటాయింపును తగ్గించాలని ఆమె కోరారు. పాకిస్తాన్ ప్రభుత్వం, సైన్యం నుంచి ఉగ్రవాద సంస్థలకు నిధులు మళ్లుతున్నాయని నిర్మల పేర్కొన్నారు. ఫలితంగా ఉగ్రవాదం వ్యాప్తి జరుగుతోందన్నారు. ఇటలీ ఆర్థిక మంత్రి గియాన్‌కార్లో జియోర్గెట్టితో జరిగిన భేటీలోనూ ఇదే అంశాన్ని నిర్మలా సీతారామన్ ప్రస్తావించారని అధికార వర్గాలు తెలిపాయి. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఎటిఎఫ్) గ్రేలిస్టులో మళ్లీ పాక్‌ను చేర్చాలని ఆమె కోరారని పేర్కొన్నాయి. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న పాకిస్తాన్ ప్రస్తుతం ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఎడిబి), అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి రోజులు వెళ్లదీస్తోంది. వివిధ రంగాల అభ్యున్నతి కోసమని చెబుతూ ఈ సంస్థల నుంచి పాకిస్తాన్ అప్పులు తీసుకుంటోంది. ఎఫ్ఏటీఎఫ్ గ్రే



లిస్టులో మళ్లీ పాక్‌ను చేరిస్తే 2024 జులైలో మూడేళ్ల కాల వ్యవధి కోసం రూ.59వేల కోట్ల (7 బిలియన్ డాలర్ల) రుణ ప్యాకేజీని పాకిస్తాన్‌కు ఐఎంఎఫ్ మంజూరు చేసింది. దీనిపైనా ఐఎంఎఫ్ ఎదుట ఆందోళన వ్యక్తం చేయాలని భారత సర్కారు యోచి స్తోంది. ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్టులో మళ్లీ పాకిస్తాన్‌ను చేర్చాలని ఐరోపాదేశాలను భారత్ బలంగా డిమాండ్ చేస్తోంది. అందుకు అనుకూలంగా నిర్ణయం వెలువడితే పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థకు భారీ నష్టం కలుగుతుంది. ఆ దేశం అంతర్జాతీయ సంబంధాలు దెబ్బతింటాయి. అంతర్జాతీయ స్థాయిలో పాకిస్తాన్ ఆర్థిక ప్రతిష్ఠ దెబ్బతింటుంది. పాకిస్తాన్‌కు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు అందించే నిధుల వినియోగంలో పారదర్శకత అవసరమని భారత్‌వాదిస్తోంది. తద్వారా పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలకు నిధులు చేరకుండా నిలువరించొచ్చని భారత సర్కారు సూచిస్తోంది. దీనివల్ల ప్రాంతీయసుస్థిరత సాధ్యమవుతుందని అంటోంది.



# అమెరికాలో భారతీయ విద్యార్థి అరెస్టు

**నార్త్‌కరోలినా, మే 5:** అమెరికాలో ఉన్నత విద్య కోసం వెళ్లిన ఓ భారతీయ యువకుడు కటకటాలపాలయ్యాడు. చట్టాన్ని అతిక్రమించి మోసానికి పాల్పడినట్లు తేలింది. నార్త్ కరోలినాలో చోటుచేసుకున్న ఈ ఘటనలో, 21 ఏళ్ల కిషన్ కుమార్ సింగ్ అనే యువకుడు గైల్‌ఫోర్డ్ కౌంటీ పోలీసులకు పట్టుబడ్డాడు. వృద్ధ మహిళను మోసం చేసేందుకు అతను ఫెడరల్ ఏజెంట్‌లా నటించినట్టు అధికారులు వెల్లడించారు. స్టోక్స్‌డేల్ అనే ప్రాంతంలో నివసించే 78 ఏళ్ల వృద్ధురాలికి కొన్ని అనుమానాస్పద ఫోన్ కాల్స్ వచ్చాయి. కాల్ చేసిన వ్యక్తులు తమను ఫెడరల్ అధికారులు అని చెబుతూ, ఆమె బ్యాంకు ఖాతా ఒక నేరంలో భాగమైందని భయపెట్టారు. వృద్ధురాలిని నమ్మబలికి, ఆమె డబ్బును తక్షణమే విత్‌డ్రా చేసి, భద్రత కోసం' తమకు అంద జేయాలని ఒత్తిడి చేశారు. ఈ క్రమం లో, ఆమె ఇంటికి ఫెడరల్ ఏజెంట్‌లా వేషధారణలో వచ్చిన వ్యక్తి కిషన్ కుమార్ సింగ్. డబ్బు తీసుకోవడానికి వచ్చిన క్షణానికే పోలీసులు అతన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అప్పటికే ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. కిషన్ కుమార్ సింగ్ విద్యార్థి వీసాతో 2024లో అమెరికా వచ్చాడని పోలీసులు తెలిపారు. ఒహాయోలోని సిన్సినాటి ప్రాంతంలో నివాసముంటున్న అతడు నేరంలో నేరుగా పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. గైల్‌ఫోర్డ్ కౌంటీ షెరీఫ్ డానీ హెచ్. రోజర్స్ కూడా అరెస్ట్‌ను అధికారికంగా ధృవీకరించారు. ఈ కేసులో దోషిగా తేలితే, కిషన్ కుమార్ సింగ్‌కు అమెరికా చట్టాల ప్రకారం కఠిన శిక్షలు ఎదురవుతాయి. వీసా రద్దు కావడం, ఆయనపై దేశం నుంచి బహిష్కరణ వలె చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంచనా.

# నెలలతరబడి తీర్పులు పెండింగ్‌పై సుప్రీం అసహనం



**న్యూఢిల్లీ, మే 5:** రిజర్వులో ఉంచిన తీర్పుల ప్రకటనలో నెలల తరబడి జాప్యంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పెండింగ్ లో ఉన్న తీర్పులపై నివేదికను నాలుగు వారాల్లోగా సమర్పించాలని అన్ని హైకోర్టులను దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. సోమవారం ఝార్ఖండ్‌కు చెందిన నలుగురు జీవిత ఖైదీల పిటిషన్‌ను విచారించిన సమయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 67 క్రిమినల్ కేసుల్లో తీర్పును రిజర్వ్ చేసిన తర్వాత ప్రకటించకపోవడం పట్ల ఝార్ఖండ్ హైకోర్టుపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. 2022లో ఝార్ఖండ్ హైకోర్టు తమ క్రిమినల్ అప్పీళ్లపై తీర్పు రిజర్వ్ చేసిం దని, కానీ ప్రకటించలేదని నలుగురు జీవిత ఖైదీలు ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఉదయం విచారణ చేపట్టింది. ఈ పరిణామంపై తీవ్రమైన అసహనం వ్యక్తం చేసింది. ఆ అంశంపై కొన్ని మార్గదర్శకాలను చట్టబద్ధం చేస్తామని ఈ సందర్భంగా ధర్మాసనం వెల్లడించింది. 2025 జనవరి 31వ తేదీ లేదా అంతకుముందు వరకు తీర్పు రిజర్వ్ అయినప్పటికీ ప్రకటించని క్రిమినల్ కేసుల తోపాటు ఇంకా తీర్పు కోసం వేచి ఉన్న అన్ని కేసులకు సంబంధించిన వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలి. అందులో క్రిమినల్, సివిల్ విషయాలు విడిగా ఉండాలి. అది సింగిల్ లేదా డివిజన్ బెంచ్ అనే విషయం అయినా క్లారిటీగా ఉండాలి అంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఝార్ఖండ్ హైకోర్టు నివేదికను పరిశీలించిన తర్వాత సుప్రీంకోర్టు ఆ ఆదేశాలను జారీ చేసింది. 2022 జనవరి నుంచి 2024 డిసెంబర్ వరకు డివిజన్ బెంచ్ విచారించిన 56 క్రిమినల్ కేసుల్లో రిజర్వ్ అయినా తీర్పు ప్రకటించలేదని నివేదికలో హైకోర్టు పేర్కొంది. అంతకుముందు 11 క్రిమినల్ కేసుల్లో తీర్పు ప్రకటించలేదని తెలిపింది. దీంతో సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. గతంలో కూడా సకాలంలో తీర్పులు ప్రకటించకపోవడంపై హైకోర్టులకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కొంతకాలం క్రితం, అనిల్ రాయ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్ కేసులో జోక్యం చేసుకుంది.

# జైళ్లు టార్గెట్‌గా మరో ఉగ్రదాడికి కుట్ర
## జమ్ము కాశ్మీర్‌లో జైళ్ల భద్రత పెంపు



**శ్రీనగర్, మే 5:** జమ్ముకశ్మీర్‌లో మరోభారీ ఉగ్రదాడి జరిగే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు భద్రతా బలగాలను అప్రమత్తం చేశాయి. ఈసారి ముష్కరులు జైళ్లను లక్ష్యంగా చేసుకోనున్నట్లు తెలిసింది. జమ్ముకశ్మీర్ జైళ్లలో ఉన్న కీలక ఉగ్రవాద నాయకులను విడిపించేందుకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. నిఘా వర్గాల హెచ్చరికలతో శ్రీనగర్ సెంట్రల్ జైల్, కోట్ బాల్వాల్ జైల్, జమ్ములోని జైళ్లకు భారీ ఎత్తున భద్రత కల్పించారు. పహల్గాం ఉగ్రదాడి దర్యాప్తులో భాగంగా చాలా మంది స్లీపర్ సెల్స్, ఓవర్ గ్రౌండ్ వర్కర్లను తీసుకొచ్చి ఈ జైళ్లలో ఉంచారు. వీరితో పాటు సైనిక వాహనంపై దాడికేసులో నిందితులైన నిస్సార్, ముష్తాక్ సహచరులను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ప్రశ్నిస్తోంది. ఈనేపథ్యంలో జైళ్లపై దాడి జరగొచ్చనే సమాచారం నిఘా వర్గాలకు సమాచారం అందింది. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) డీజీ శ్రీనగర్‌లో ఉన్నతాధికారులతో ఇందుకోసమే సమావేశమైనట్లు సమాచారం. 2023నుంచి జమ్ముకశ్మీర్‌లో జైళ్ల భద్రతను సీఐఎస్ఎఫ్ జవాన్లే చూసుకుంటున్నారు. ఇదే సమయంలో జమ్ము కశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో సోమవారం భద్రతా దళాలు ముష్కరులు పన్నిన కుట్రను ఛేధించాయి. సైనిక బలగాలను లక్ష్యంగా చేసుకునేందుకు ఉగ్రవాదులు దాచిన కమ్యూనికేషన్ పరికరాలు, ఐదు ఐఈడీలను స్వాధీనం చేసుకున్నాయి. ఈ స్థావరం సురాన్ కోట్ ప్రాంతానికి అత్యంత సమీపంలోనే ఉంది. భద్రతా దళాలు, జమ్ముకశ్మీర్ పోలీసుల జాయింట్ ఆపరేషన్‌లోనే ఈ స్థావరాన్ని గుర్తించి, ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు. పహల్గాం దాడి తర్వాత కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘిస్తున్న పాకిస్థాన్ సరిహద్దుల్లో కవ్వింపులు కొనసాగిస్తూనే ఉంది. గత 11 రోజులుగా నియంత్రణ రేఖ వెంబడి కాల్పులు జరుపుతున్న పాక్, మే 4,5 తేదీల్లో అర్ధరాత్రి దాటినతర్వాత కాల్పులకు దిగారు. పలు చెక్‌పోస్టుల వద్ద చిన్న ఆయుధాలతో పాక్ రేంజర్లు కాల్పులు జరిపినట్లు భారత సైన్యం తెలిపింది. కుప్వారా, బారాముల్లా, పూంఛ్, రాజౌరి, నౌషెరా, సుందర్బని, అఖ్నూర్ సెక్టార్లలో కాల్పులు జరిగాయని వెల్లడించింది. పాక్ రేంజర్ల కాల్పులకు తగిన రీతిలో భారత్ బదులిచ్చినట్లు సైనిక వర్గాలు తెలిపాయి.

# పాక్ ఆర్మీచీఫ్ మేకపోతు గాంభీర్యం

**కరాచి, మే 5:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్‌లో వణుకు బయల్దేరి పైకి మేకపోతు గాంభీర్యంతో ఉంది. ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ కూడా అదే బాటలో ఉన్నారు. భారత్ మాపై దాడులకు పూనుకుంటే ధీటుగా బదులిస్తామంటూ చెపుతున్నాడు. తాము ప్రాంతీయ శాంతికి కట్టుబడి ఉన్నప్పటికీ జాతీయ ప్రయోజనాలను దేశ ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోడానికి మాసైనికులు సిద్ధంగా ఉన్నారంటూ మునీర్ చెప్పుకొచ్చాడు. పహల్గాం దాడికి వారం ముందు



మునీర్ పాకిస్థాన్‌లో చేసిన కాశ్మీర్‌పై చేసిన ప్రసంగమే కారణమని భారత నిఘా వర్గాలు అనుమానించాయి. ఓవర్సీస్ పాకిస్థాన్‌కన్వెన్షన్‌లో మాట్లాడుతూ మన ఉద్దేశ్యం స్పష్టం కాశ్మీర్ గతంలోను మన జీవనాడిగా ఉంది. భవిష్యత్తులోనూ ఉంటుందని దానిని మనంఎ ప్పటికీ మరిచిపోలేం. కశ్మీరీ సోదరుల పోరాటంలో వారిని ఒంటరిగా వదిలేయలేం. మనజీవితంలోని ప్రతి అంశం లోనూ హిందువులకంటే భిన్నమని భావించిన మనపూర్వీకుల ఆలోచనలను అప్పుడే వారుగుర్తుంచుకుంటారని అన్నాడు. ఈ వ్యాఖ్యల తర్వాతనే పహల్గాం దాడిచోటుచేసుకుంది. అదే సమయంలో పాక్ వాయుసేనకు చెందిన రవాణా నిఘా విమానాలను కరాచినుంచి లాహోర్, రావల్పిండి బేస్‌లకు తరలించడం అనుమానాలను బలపరుస్తోంది. 2019లో పుల్వామాలో సీఆర్‌పిఎఫ్ వాహనంపై దాడిజరిగినపుడు మునీర్‌పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ అధిపతిగా ఉన్నారు. ఆ దాడి ఆయన కనుసన్నల్లోనే జరిగిం దని చెపుతారు. ఇపుడు ఆయనే ఆర్మీచీఫ్ కావడంతో భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ఉగ్రమూకను ఉసిగొలుపుతున్నారన్న ఆరోపణలున్నాయి.

# మైనింగ్ దోపిడిలో కాకాణి, అనిల్ తోడు దొంగలు

## - టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర

**నెల్లూరు, మే 5, ప్రభాతవార్త :** అక్రమ మైనింగ్ దోపిడిలో కాకాణి, అనిల్ దోడు దొంగలు అని, ఒకరికి ఒకరు అండగా నిలవడంలో ఆశ్చర్యమేమి లేదని శాసనమండలి సభ్యులు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం నందు సోమవారం శాసనమండలి సభ్యులు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాకాణిపై విచారణ, అరెస్టు ఉత్తర్వులో ఉలిక్కిపడిన అనిల్ తానూ మైనింగ్, ఇరిగేషన్ శాఖ అక్రమాలపై విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందని ముందే ఎదురుదాడికి దిగారని అనిపిస్తోందని అన్నారు. అక్రమ మైనింగ్ చేశారు కాబట్టే కాకాణి పారిపోయారు.. తప్పు చేయకపోతే ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారు కదా అని అన్నారు. వీపీఆర్ కుటుంబం మైనింగ్ వ్యాపారం మొదలు పెట్టిన 10 ఏళ్ల తర్వాత అనిల్ పుట్టారు, జగన్ తాత రాజారెడ్డికి మైన్స్ అమ్మిన చరిత్ర వీపీఆర్ కుటుంబానిదని అన్నారు. కాకాణిపై పెట్టిన అక్రమ కేసులకు, కూటమి వేదింపులకు భయపడం, వెనుకడుగు వేయమని నిన్నటి రోజున మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు ఆయనలోని అభద్రతాభావంను స్పష్టం చేస్తున్నాయన్నారు. కాకాణిపై కేసులు పెట్టింది ఎవరు అనిల్..? కాకాణి అక్రమ మైనింగ్‌పై నాటి వైసీపీ ప్రభుత్వం, జిల్లా అధికారులు చోద్యం చూస్తూ చేతులు ముడుచుకుంటే సోమిరెడ్డి ఫిర్యాదుతో జోక్యం చేసుకున్నది కేంద్ర మైనింగ్ శాఖ కాదా.? నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, జిల్లా కలెక్టర్, ఎస్పీల నుండి కేంద్ర మైనింగ్ శాఖ వారు సమాచారం తెప్పించుకుని కాకాణి అక్రమ మైనింగ్ చేస్తున్నారని నిర్ధారించుకున్న మాట వాస్తవం కాదా..? వైసీపీ ప్రభుత్వంలో ఏనాడైనా మైనింగ్ వ్యాపారులు కోర్టుకు వెళ్ళారా అని ప్రశ్నించిన అనిల్.. మీ భ్రుత్వంలో జరిగిన దౌర్జన్యం గురించి మేము చెప్పాలా..? గజగజా వణకడం తప్ప కోర్టు మెట్లు ఎక్కే ధైర్యం ఉందా నాడు వ్యాపారులకు..? నామైన్ లోకి చొరుబడి అక్రమంగా మైనింగ్ తవ్వుకుంటున్నారని, అమ్ముకుంటున్నారని రుస్తు మైన్స్ వారు కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెస్తే నాటి ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఎస్పీ పట్టించుకున్నారా..? అన్నారు. తోడేరులోని 5 ప్రాంతాలలో మాజీ మంత్రి కాకాణి అక్రమంగా మైనింగ్‌ను తవ్వి, తన మైన్స్‌లో తెచ్చిపోసి, వారిది నాది అంతా కలిపి అమ్ముకుంటున్నారని రుస్తుం యాజమాన్యం గగ్గోలు పెడితే సీఎం, చీఫ్ సెక్రటరీ, డీజీపీ కార్యాలయాలు నాడు స్పందించాయా అని ప్రశ్నించారు. అక్రమ మైనింగ్ చేస్తున్న చిత్రాలు, 14 ప్రొక్లెయిన్లు, 30 డంపర్‌లు, గౌడన్ల నిండా ఉన్న జిలెటిన్ స్టిక్స్‌ను వీడియోలు తీసి కేంద్ర మైనింగ్ సెక్రటరీకి పంపితే తప్ప నాడు అక్రమ మైనింగ్ ఆగలేదు అన్నారు. 5 ఏళ్ల పాటు సోమిరెడ్డి మొదలుకొని క్రింది స్థాయి కార్యకర్త వరకు అక్రమ కేసులతో వేధించడమే కాక అక్రమ మైనింగ్, అరాచకాలు, దౌర్జన్యాలు చేసిన కాకాణిపై కేసులు పెట్టక జై కొట్టాలా అనిల్ అని అన్నారు. వీపీఆర్ తండ్రి వేమిరెడ్డి కోటారెడ్డి 50 ఏళ్ల క్రితం నుండే మైనింగ్ వ్యాపారంలో ఉన్నారు.

బత్తనపల్లి, అమ్మవారి పాలెం, బాల దుర్గ గని, మాటా గని, జానకి రామ్ తదితర మైన్‌లు నిర్వహించారు. ఆఫ్రికా, ఇండోనేషియాతో సహా ప్రపంచ వ్యాప్తంగా మైనింగ్ వ్యాపారం చేసిన చరిత్ర వీపీఆర్ కుటుంబానిది. జగన్ తాత రాజారెడ్డికి మైన్స్ అమ్మిన కుటుంబం వీపీఆర్‌ది.

# గాంధీ జయంతి నాటికి స్వచ్ఛ ఆంధ్ర సాధన

## మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ

**నెల్లూరు, మే 5, ప్రభాతవార్త - వైద్యం** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అక్టోబర్ 2 గాంధీ జయంతి నాటికి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా రాష్ట్రంలో పేరుకున్న చెత్తను తొలగించేలా చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. సోమవారం ఉదయం నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం డంపింగ్ యార్డు వద్ద బయోమైనింగ్ రీసైక్లింగ్ యూనిట్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ జిగ్మా గ్లోబల్ ఎన్విరాన్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో వేగంగా రీ సైక్లింగ్ పనులు జరుగుతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, పది లక్షల అప్పులతో పాటు 85 లక్షల టన్నుల చెత్త మిగిల్చి వెళ్లిందన్నారు. రాష్ట్రంలో 6500 టన్నుల చెత్త ప్రతి నిత్యం వస్తుందన్నారు. చెత్త తొలగింపు కాంట్రాక్టులో కూడా వైఎస్సార్‌సీపీ నిర్లక్ష్యం వహించిందన్నారు. తమ ప్రభుత్వం రాగానే పారదర్శకంగా టెండర్లు పిలిచామన్నారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో దొంతాలిలో డంపింగ్ యార్డులో 3 లక్షల టన్నులు, అల్లీపురం డంపింగ్ యార్డులో 30 వేల టన్నులు చెత్త ఉందన్నారు. అల్లీపురం డంపింగ్ యార్డులో తొలగింపుకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి 20 ఏళ్లుగా ప్రయత్నిస్తున్నారన్నారు. అల్లీపురం డంపింగ్ యార్డులో ఇప్పటికే 5 వేల టన్నుల చెత్తను రీ సైక్లింగ్ చేశారన్నారు. మరో రెండు నెలల్లో మొత్తం చెత్త తొలగించి అన్ని హంగులతో పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల పరిధిలో ఉన్న చెత్తను తొలగించి రీ సైక్లింగ్ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమీషనర్ నందన్, టీడీపీ సీనియర్ నాయకులు వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళ పాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, టీడీపీ నగర అధ్యక్షులు మామిడాల మధు, కార్పొ రేషన్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# అధికారులకు సిఎం చంద్రబాబు అభినందనలు

**విజయవాడ, మే5, ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి పనుల పున:ప్రారంభ కార్యక్రమం విజయవంతం కావడంలో కీలకపాత్ర పోషించిన అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. సభ నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో సమావేశమయ్యారు. ఎక్కడా ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా, ప్రజలు ఇబ్బందులు పడకుండా పగడ్బందీగా ఏర్పాట్లు చేశారని ప్రశంసించారు. భవిష్యత్‌లోనూ ఇదే తరహాలో సమిష్టిగా సమన్వయంతో పని చేసి ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతమయ్యేలా చూడాలని సూచించారు. పర్యటన ఆసాంతం సక్సెస్ అయ్యేలా సమన్వయం కోసం అన్ని స్థాయిల్లో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకోవడం, విస్తృతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించడం ద్వారా సభ సజావుగా సాగిందని అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మంత్రి నారాయణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 6 నుండి ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డు మూసివేత

**ఇంద్రకీలాద్రి, మే 5, ప్రభాతవార్త** దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం ఈనెల 6 నుండి 8 వరకు ఘాట్‌రోడ్డు మూసివేస్తున్నట్లు ఇఒ కె రామచంద్రమోహన్ తెలిపారు. ఘాట్‌రోడ్డుపై కొండచరియలకు మెష్ వేస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని దృష్టిలో వుంచుకుని కనకదుర్గానగర్ నుండి దుర్గమ్మవారి ఆలయానికి చేరుకోవాలన్నారు. భక్తులు దేవస్థానంవారు ఏర్పాటు చేసిన ఉచిత బస్సుల ద్వారా ఆలయానికి చేరుకోవాలన్నారు. అలాగే విశాఖ, చెన్నై నుండి వాహనాల ద్వారా వచ్చేవారు తమ వాహనాలను సీతమ్మవారి పాదాల వద్ద పార్కింగ్ చేసుకుని అక్కడినుండి ఉచిత బస్సులో ఆలయానికి రావాలన్నారు. హైదరబాద్ మార్గం నుండి వచ్చేవారు పున్నమి ఘాట్ వద్ద తమ వాహనాలు పార్కింగ్ చేసుకుని అక్కడినుండి దేవస్థానం వారి ఉచిత బస్సుల్లో ఆలయానికి రావాలన్నారు.

# వేదాద్రి యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు

## -7న బ్రహ్మోత్సవాలు ప్రారంభం -11న శ్రీస్వామివారి కళ్యాణ మహోత్సవం

**జగ్గయ్యపేట, మే 5, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామంలో యుగాల నుండి వేంచేసివున్న శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు ఈనెల 7వ తేదీ నుండి ప్రారంభించేందుకు ప్రభుత్వ యంత్రాంగం సన్నాహాలు పూర్తిచేసింది. ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్‌బాబు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్తు తరపున కెసిపి సిమెంట్స్ ఏజిఎం రామ్‌ప్రసాదు సోమవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ్‌నారాయణరెడ్డిని కలుసుకుని వేదాద్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఇఒ సురేష్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 7 తేదీన శ్రీస్వామి వారిని పెండ్లి కుమారుని చేస్థామని, 8వ తేదీన అంకురార్పణ, ధ్వజారోహణ, 9న శేషవాహన సేవ, 10న హనుమంతసేవ, 11న శ్రీభూనీళా సమేత శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం, 12న తెప్పోత్సవం, 13న చూర్ణోత్సవం (చక్రతీర్థం) వసంతోత్సవం, పూర్ణాహుతి, ధ్వజావరోహణ, 14న పవళింపు సేవలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు.

పావనకృష్ణ నదీ తీరమునా కొలువుదీరిన నరసింహా క్షేత్రములో వేదాద్రి పుణ్యక్షేత్రం ఒకటి. విజయవాడ-హైదరాబాదు ప్రధాన రహదారిలో చిల్లకల్లు కూడలికి 10 కిలోమీటర్ల దూరంలో ఈక్షేత్రం వుంది. పంచనారసింహ (జ్వాలా, సాలగ్రామ, వీర, యోగానంద, లక్ష్మీనరసింహమూర్తు)లు క్షేత్రంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నలుమూలల నుండి భక్తులను ఆకర్షిస్తూ ప్రఖ్యాత చెందియున్నది. సుప్రసిద్ధ పౌరాణిక క్షేత్రమునకు చారిత్ర ప్రసిద్ధివుంది. ఈఆలయం ప్రాకారాదుసుమారు తొమ్మిది వందల సంవత్సరములకు పూర్వం రెడ్డి రాజులతో నిర్మాణమయ్యింది. ఆలయ ఉంచన కల వ్యాఖ్యలతో, సర్వాంగసుందరంగాతీర్చిదిద్దబడి సర్వతో ముఖాభివృద్ధిచెంది భాసిల్లుతోంది. ఈక్షేత్రం కవిత్రయంలో ఒకరైన ఎర్రాప్రగడ, కవిసార్వభౌముడు శ్రీనాధుడు మహాకవులు నారాయణతీర్థులు, వాగ్గేయకారులు దర్శించి కృతార్థులైనట్లు చారిత్రప్రశస్థివుంది. ప్రశాంతమైన వాతావరణం కృష్ణవేణి తరంగనాదములతో ప్రకృతి సహజ సౌందర్యములను నిండుగా అలంకరించుకొని భక్తకోటికి ముక్తిమార్గమై అలరారుతుంది. ఈదేవాలయమునకు ప్రస్తుత వంశపారంపర్య ధర్మకర్తలు డాక్టర్ వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్తు ధార్మిక కృషి చేస్తున్నారు. దేవాదాయ శాఖ తరపున కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్‌బాబు పాలనా వ్యవహారాలు నిర్వహిస్తున్నారు. ప్రతి నిత్యం పూజాకార్యక్రమాలు ఉదయం గం.11లకు శ్రీస్వామివారి తులసీ సహస్రనామార్చన, రాత్రి గం.7.30లకు శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారికి కుంకుమ సమస్రనామార్చన, అష్టోత్తర నామార్చన నిర్వహిస్తారు. యాత్రికులకు బసచేయుటకు దేవాలయంలో గదుల వసతి కల్పించారు.



దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ్‌నారాయణరెడ్డికి వేదాద్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్‌బాబు

# కొత్తగా గిరిజన హాస్టళ్లు

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త :** తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో కొత్తగా గిరి జన హాస్టళ్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ హాస్టళ్లు వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభమవుతాయి. తొలుత హైదరాబాద్ లోని బేగంపేట, రామంతపూర్ ప్రాంతాల్లో గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టళ్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. వీటికోసం కోసం రూ.20 లక్షలు, రూ. 1.33 కోట్లు ఖర్చు చేయనున్నారు.

# జస్టిస్ వర్మ నోట్లకట్టల కేసులో సుప్రీంకు నివేదిక ఇచ్చిన కమిటీ!



**న్యూఢిల్లీ, మే 5:** జస్టిస్ యశ్వంత్‌వర్మ ఇంట్లో నోట్లకట్టలు లభించిన వైనంపై సుప్రీంకోర్టు నియమించిన ముగ్గురు న్యాయమూర్తుల విచారణ కమిటీ 40 రోజుల తర్వాత తన నివేదికను చీఫ్‌జస్టిస్ సంజీవ్‌ఖన్నాకు అంద చేసింది. ఇక నగదు రికవరీ అంశానికి సంబంధించి కూడా కమిటీ తన నివే దికలో సమగ్రంగా పొందుపరిచిందని సమాచారం. గడచిన మార్చి 25వ తేదీ సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యుల విచారణ కమిటీని నియమించింది. జస్టిస్ షీల్‌నాగు, జస్టిస్ జిఎస్ సంధావాలియా, జస్టిస్ అనుశివరామన్ అను విభిన్న రాష్ట్రాలకు చెందిన న్యాయమూర్తులను ఈ కమిటీలో నియమించింది. జస్టిస్ వర్మకు వ్యతిరేకంగా వచ్చిన ఆరోపణలన్నింటిపైనా విచారణ చేయాలని ఆదేశించిన సుప్రీంకోర్టు ప్రస్తుతం వర్మను అలహాబాద్ హైకోర్టు సిట్టింగ్ జడ్జిగా నియమించింది. జస్టిస్ వర్మ అధికారిక నివాసంలో కూడా ఈ కమిటీ సోదాలు చేసింది. కమిటీ ముందు జస్టిస్ వర్మ తనపై ఉన్న ఆరోపణలన్నీ అవాస్తవాలని పేర్కొన్నారు. తన ఇంట్లో లభించినట్లు చెపుతున్న నగదు తన ఇంటి ఔట్‌హౌస్‌లో లభించిందని, ప్రధాన నివాసంలో కాదని తన కుటుంబం నివసిస్తున్న భవనంలో కానేకాదని వాదించారు. స్టోర్ రూమ్‌లో ఎప్పుడూ కూడా తాను నగదును దాచిపెట్టడం అనేది తన జీవితంలోనే లేదని అన్నారు. ఇదొక కుట్ర పూరితంగా మాత్రమే జరిగినట్లు భావిస్తున్నానని, ముందస్తు వ్యూహంతోనే తనపై కొందరు కుట్రలు చేసినట్లు తెలుస్తోందని చెప్పారు. ఎవరైనా అందరూ తిరుగాడే స్టోర్‌రూమ్‌లో బహిరంగంగా నగదును భద్రపరుచుకుంటారా అని ప్రశ్నించారు. తన లివింగ్ రూమ్‌కు పూర్తిగా దూరంగా ఉన్న ప్రాంతంలో జరిగిందని, మధ్యలో అడ్డుగోడ కూడా ఉందని, ఈలోపు మీడియా కూడా సొంత విచారణ జరిపి అప్రతిష్టపాలు చేసిందన్నారు.

# తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

## కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

**సిరిపూర్‌కాగజ్‌నగర్, (ఆదిలాబాద్), ప్రభాతవార్త:** తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. కొమరంభీమ్ ఆసీఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఆయన సోమవారం అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక చరిత్ర ఉందని ఉన్నారు. భూమి కోసం, భుక్తి కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఆదివాసీల జిల్లా ఇది అని కొనియాడారు. 3,900 కోట్ల రూపాయల విలువైన పనులను మొదలు పెట్టారు. కేంద్ర ప్రభుత్వం పిఎం సడక్ యోజన కింద దేశవ్యాప్తంగా రోడ్లు నిర్మిస్తోందని చెప్పారు. రహదారులు మెరుగ్గా ఉండే దేశాన్నే అభివృద్ధి చెందిన దేశంగా భావిస్తారని పేర్కొన్నారు. వ్యవసాయం, ఉపాధి, రవాణా, మౌలిక వసతులు అనే నాలుగు అంశాలు దేశాభివృద్ధిని నిర్దేశిస్తాయన్నారు.

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రాల మధ్య అనుసంధానం పెంచేందుకు కీలకమైన ప్రాజెక్టును కేంద్రం చేపట్టిందని, రోడ్డు కనెక్టివిటీలో భాగంగా క్లిష్టమైన వంతెనలు, సొరంగమార్గాలు నిర్మిస్తున్నామని ఆయన వివరించారు. జోజిలా పాస్ టన్నెల్ వంటి నిర్మాణాలను చేపట్టారని, సూర్యాపేట నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. నాగపూర్ నుంచి విజయవాడ కారిడార్ చేపట్టినట్లు ఆయన చెప్పారు. తెలంగాణ, మహారాష్ట్ర మధ్య రోడ్డు కనెక్టివిటీ మరింత పెరగనుందని. భద్రాచలం, బాసర, మేడారం వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలను జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తున్నట్లు ఆయన వివరించారు. జగిత్యాల - కరీంనగర్ హైవే విస్తరణ పనులను కూడా త్వరలోనే చేపడతామన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకు ఎన్నో ప్రాజెక్టులు చేపట్టారని అందులో భాగంగా అంబర్‌పేటలో నిర్మించిన పైవంతెనను కూడా ప్రారంభించినట్లు స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణలో భాగంగా ఎలక్ట్రిక్, సిఎన్‌జీ వాహనాలను కేంద్రం ప్రోత్సహిస్తోందని, పెట్రోల్ వాహనాలకు బదులుగా విద్యుత్ వాహనాలు ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ

వీటితో రవాణా ఖర్చు బాగా తగ్గడమే కాకుండా పర్యావరణ హితంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు రైతు అంటే కేవలం ఆహార ధాన్యాలు మాత్రమే ఉత్పత్తి చేసేవారని, ప్రస్తుతం రైతు అంటే విద్యుత్ దాత, ఇందన దాత, పవన విద్యుత్ దాత, బిట్యుమిన్, హైడ్రోజన్ దాతలుగా మారారని అన్నారు. విదర్భలో రైతుల ఆత్మహత్యలు నివారించేందుకు అమృత్ సరోవర్ కింద చెరువల నిర్మాణ చేపట్టారని, దీని ద్వారా పంటలకు సమృద్ధిగా నీటిని అందించినట్లు వివరించారు. అదేవిధంగా తెలంగాణలో కూడా నీటిని నిల్వ చేసుకుని రైతలుకు, భవిష్యత్తు తరాలకు నీటిని అందించాలని ఆయన సూచించారు.

సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లా డుతూ కశ్మీర్ నుంచి కన్యా కుమారి వరకు కనెక్టి విటీని పెంచడం మోడీ సర్కార్ లక్ష్యమని అన్నారు. తెలం గాణలో జాతీయ రహదారుల విస్తీర్ణం 5వేల కి.మీ దాటిందని చెప్పారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రూ.3,900 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు. ప్రారంభోత్సవాలు చేశారు.

# ఆర్‌టిసి సమ్మె నేపథ్యంలో మంత్రి పొన్నంతో పలు సంఘాల నేతల చర్చలు

## సమ్మెకు వెళ్లొద్దని మంత్రి సూచన

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఈ నెల 7 నుంచి(6 అర్థరాత్రి) నుంచి సమ్మెకి కొన్ని సంఘాలు వెళుతున్న నేపథ్యంలో సోమవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కొన్ని సంఘాలు చర్చలు జరిపాయి. మినిస్టర్ క్వార్టర్స్‌లో రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని ఆర్‌టిసిలోని పలువురు సంఘాల నేతలు కలిశారు. మంత్రిని కలిసిన వారిలో ఆర్‌టిసి జేఏసి చైర్మన్ టిఎంయూ జనరల్ సెక్రెటరీ అశ్వర్థామ రెడ్డి, ఎన్‌ఎంయూ జనరల్ సెక్రెటరీ నరేందర్, కార్మిక సంఘ్ జనరల్ సెక్రెటరీ ఎర్ర స్వామికుమార్, ఎస్‌టిఎంయు జనరల్ సెక్రెటరీ పున్న హరి కృష్ణ ఉన్నారు. ఆర్‌టిసిలోని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి గారి దృష్టికి సంఘాల నేతలు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ సంఘాల నాయకులతో మాట్లాడుతూ.. ఆర్‌టిసి సమస్యలపై సంస్థ సంక్షేమం కోరే ఎవరైనా, ఎప్పుడైనా కలిసి సమస్యలు చెప్పుకోవచ్చని.. ఎల్లప్పుడూ మీకు ఎప్పుడు అందుబాటులోనే ఉంటానని మంత్రి తెలిపారు. సమస్యలు వినడానికి తాను, ముఖ్యమంత్రి కార్యాలయం తలుపులు కూడా ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం ఈ మూడింటికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇప్పుడిప్పుడే సంస్థ కోలుకుంటోందని, సమస్యలు తొలుగుతు న్నాయని.. ఈ సమయంలో సమ్మె చేయవద్దని ఆర్‌టిసి కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నట్టు మంత్రి పొన్నం తెలిపారు. కార్మికులు, సిబ్బంది సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికీ తీసుకుపోయి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటానని తెలిపారు. ఆర్‌టిసికి 16 నెలలుగా ఎన్నో మంచి కార్యక్రమాలు చేశామన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులు సమ్మె చేస్తే ప్రజలు ఇబ్బందులు పడుతారని ఆందోళన వ్యక్తం చేశారు. గత 10 సంవత్సరాలుగా ఆర్‌టిసిని గత పాలకులు నిర్వీర్యం చేశారని.. ఒక్క బస్సు కొనుగోలు చేయలేదు. ఒక్క ఉద్యోగం కూడా నియామకం చేయలేదు, సిసిఎస్, పిఎఫ్ పైసలు వాడుకున్నారని మంత్రి పొన్నం మండిపడ్డారు. ఆర్‌టిసి ఉద్యోగులకు 2013 నుండి చెల్లించాల్సిన బాండ్ మొత్తం రూ.400 కోట్లు చెల్లించింది కాంగ్రెస్ సర్కారేనని గుర్తు చేశారు. 2017 పే స్కేల్ 21 శాతం ఇచ్చింది.. సంవత్సరానికి రూ. 412 కోట్లు భారం పడుతుందన్నారు. పిఎఫ్ ఆర్గనైజేషన్ సుదీర్ఘ కాలంగ పెండింగ్‌లో ఉన్న రూ. 1039 కోట్లు చెల్లించాం. నెలవారీ పిఎఫ్ కంట్రిబ్యూషన్ జనవరి 2024 నుండి క్రమం తప్పకుండా చెల్లించబడుతుందన్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సిసిఎస్ బకాయిలు ఉద్యోగులకు రూ. 345 కోట్లు చెల్లించామన్నారు. నెలవారీ సిసిఎస్ కంట్రిబ్యూషన్ జనవరి2024 నుండి క్రమం తప్పకుండా చెల్లించబడుతుందని.. 1500 మంది కారుణ్య నియామకాలు చేపట్టామన్నారు. ప్రభుత్వం ఆర్‌టిసిలో 3038 మంది ఉద్యోగులను రిక్రూట్‌మెంట్ చేయడానికి అనుమతి ఇచ్చిందన్నారు.

**సమ్మె జయప్రదం చేయాలని జెఏసి కవాతు**

ఆర్‌టిసిలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7(6అర్థరాత్రి) నుంచి సమ్మె చేయతలపెట్టిన జెఏసి అధ్వర్యంలో సోమవారం సాయంత్రం కార్మికులు కవాతు నిర్వహించారు. కార్మికుల కవాతు ప్రభుత్వ, యాజమాన్యాలకు కనువిప్పు కలగాలని.. సమ్మెలో పేర్కొన్న డిమాండ్స్ పరిష్కరింప చేయాలని కోరారు. ఇప్పుడు కాక పోతే ఇంకెప్పుడు ఉద్యమం చేసే అవకాశం ఉండదు. ఇదే చివరి అవకాశం, ఇదే చివరి పోరాటం, రండి కదలండి, కదిలించండి, బాంచెన్ బతుకులు వీడండి.. భరిగేసి బరిలోదిగండి.. సమ్మె సమరభేరి మ్రోగించండి అంటూ నినాదాలు చేస్తూ సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఆర్‌టిసి కళాభవన్ నుంచి ఆర్‌టిసి బస్ భవన్ వరకు కార్మికులు జెఏసి అధ్వర్యంలో కవాతు నిర్వహించారు.

# శ్రవణ్‌రావు మధ్యంతర బెయిల్ రద్దుకు పిటిషన్

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో సుప్రీంకోర్టు నుంచి అరెస్టు కాకుండా మధ్యంతర బెయిల్ పొందిన మీడియా అధినేత శ్రవణ్‌రావు విషయంలో కఠినంగా వ్యవహరించాలని పోలీసులు నిర్ణయించారు. సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ ఉత్తర్వుల ప్రకారం పోలీసుల విచారణకు సహకరించాల్సిన శ్రవణ్‌రావు దానికి భిన్నంగా వ్యవహరిస్తుండడంతో ఆయనుకున్న బెయిల్‌ను రద్దు చేయించేందుకు సిట్ పోలీసులు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు వెలుగు చూడకముందు అమెరికాకు వెళ్లిపోయిన శ్రవణ్‌రావు సుప్రీంకోర్టులో పోలీసుల అరెస్టు నుంచి లభించిన మధ్యంతర బెయిల్ తరువాతే భారత్‌కు రావడం తెలిసిందే. దీని తరువాత ఆయనను పోలీసులు మూడుసార్లు విచారించడం తెలిసిందే. అయితే పోలీసుల విచారణలో ఆయన పెద్దగా సహకరించలేదని తెలిసింది. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వాడిన ఫోన్లను అప్పగించాలని కోరినా శ్రవణ్‌రావు పట్టించుకోలేదని తెలిసింది. పోలీసులు కోరిన ఫోన్లకు బదులు వేరే ఫోన్లను ఆయన ఇవ్వడంతో సిట్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా శ్రవణ్‌రావు వైఖరి, ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఆయనుకున్న మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయించాలని సిట్ అధికారులు నిర్ణయించారు.

# రక్షణ శాఖ కార్యదర్శితో ప్రధాని మోడీ భేటీ

## ఉద్రిక్తతల తాజా పరిస్థితిపై చర్చలు



**న్యూఢిల్లీ, మే 5:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్రమైన ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అదే సమయంలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ ఏ క్షణమైనా దాడి చేయొచ్చన్న ఊహాగానాలు వెలువడుతున్న వేళ, ప్రధాని నరేంద్రమోడీతో భారత రక్షణ కార్యదర్శి రాజేశ్‌కుమార్‌సింగ్ సోమవారం మధ్యాహ్నం సమావేశమయ్యారు. ఆదివారం వైమానికదళ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, శనివారం నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠితో ప్రధాని మాట్లాడారు. ఈ ఇద్దరితో మోడీ భద్రతా పరిస్థితిపై చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అరేబియా సముద్రంలోని క్లిష్టమైన మార్గాల్లోని పరిస్థితిని ప్రధానికి నేవీచీఫ్ త్రిపాఠి వివరించారు. వైమానికదళ చీఫ్, నేవీ చీఫ్‌తో మాట్లాడిన మోడీ, తాజాగా రక్షణ కార్యదర్శితో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పహల్గాంలో 26 మందిని బలిగొన్న ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలని కేంద్రం ఇప్పటికే ప్రతిన బూనింది. ఈ క్రమంలో గత మంగళవారం జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఆర్మీకి పూర్తి స్వేచ్ఛనివ్వాలని ప్రధాని మోడీ నిర్ణయించారు. దీంతో భద్రతా ఉన్నతాధికారులతో ఇప్పుడు వరుసగా కీలక భేటీలు నిర్వహిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

యుద్ధ సన్నద్ధత చర్యలు ప్రారంభించామని సంకేతాలు న్నట్లుగా గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై జెట్ విమానాల ల్యాండింగ్, టేకాఫ్ విన్యాసాలు కూడా చేసింది. త్రివిధ దళాధిపతులతో వేరువేరుగా సమావేశాలు నిర్వహించిన తర్వాత ఇపుడు కొత్త రక్షణశాఖ కార్యదర్శితో జరిగిన సమావేశం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. నేరుగా రంగంలోకి దిగి దాడులు చేయకపోయినా పాకిస్థాన్‌ను నలువైపులా దిగ్బంధం చేస్తున్న భారత్ సింధు జలాల నిలిపివేత, బగలిహార్, సలాల్‌డ్యామ్‌లలో నీటిని నిలిపివేసింది. ఎగుమతి దిగుమతులు కూడా రద్దు చేసుకుంది. అదే క్రమంలో పాక్ ఓడలను కూడా నిషేధించింది. భారత్ ఓడలను పాక్‌వైపు వెళ్లవద్దని కూడా ఆదేశాలు జారీ చేసింది. భారత్ గగనతలాన్ని పాక్ విమానాలకు మూసివేసింది. అలాగే పాక్ కూడా భారత విమానసర్వీసులను తమ గగనతలం లోకి అనుమతించడం లేదు. సరిహద్దుల్లో ఇప్పటికీ కవ్వింపు కాల్పులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రధాని మోడీ వేరువేరుగా నిర్వహిస్తున్న సమావేశాలు అత్యంత ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి.

ఇదిలా ఉంటే భారత్‌పై పాకిస్థాన్ సైబర్ దాడులకు దిగినట్లు తెలుస్తోంది. భారత రక్షణ వెబ్‌సైట్లు లక్ష్యంగా పాకిస్థానీ హ్యాకర్లు సైబర్ దాడులు చేసినట్లు సమాచారం. ఇండియన్ మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీస్, మనోహర్ పారికర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలిసిస్ సంస్థలపై హ్యాకింగ్ చేసి విలువైన సమాచారాన్ని సేకరించినట్లు వారు పేర్కొన్నట్లు చెప్పాయి. రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వరంగ సంస్థ అయిన ఆర్మర్డ్ వెహికల్ నిగమ్ లిమిటెడ్ అధికారిక వెబ్‌సైట్‌ను శాశ్వతంగా క్లోజ్ అయ్యేలా హ్యాకర్లు ప్రయత్నించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. దీంతో వెబ్‌సైట్‌ను క్షుణ్ణంగా ఉద్దేశపూర్వకంగా ఆడిట్ చేయడానికి ఆఫ్‌లైన్‌లో ఉంచినట్లు చెప్పాయి. అదే సమయంలో సైబర్ భద్రతా నిపుణులు, ఏజెన్సీలు చురుకుగా పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నాయి. భద్రతా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, డిజిటల్ రక్షణను బలోపేతం చేయడానికి, తదుపరి చొరబాటు ప్రయత్నాల నుంచి రక్షణ కల్పించడానికి అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. భవిష్యత్తులో సైబర్ బెదిరింపుల వల్ల ఎలాంటి నష్టం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడంపై దృష్టి సారించినట్లు వెల్లడించాయి

## దేశ ఆర్థికాభివృద్ధికి రైతు వెన్నెముక

### బయోచార్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని ప్రారంభించిన కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ

**నందిగామ, మే 5, ప్రభాతవార్త:** దేశఆర్థిక అభివృద్ధికి రైతే వెన్నెముక అని, మారుతున్న నేటి ఆధునిక ప్రపంచంలో బయోచార్ కోర్ సేంద్రియ విధానం రైతులకు తెలియాల్సి న అవసరం ఎంతైనా ఉందని కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ స్పష్టం చేశారు. సోమవారం నందిగామ మండలం కన్హ శాంతివనంలో బయోచార్ సెంటర్ ఆఫ్ ఎక్స లెన్స్ కేంద్రాన్ని కేంద్ర, రాష్ట్ర మంత్రులతో కలిసి ప్రారంభించారు. బయోచార్ కోల్ విధానం ద్వారా గ్రామీణ ప్రాంతంలో చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూ రుతుందని, దీనితోపాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించిన వారమవుతామని అన్నారు. హర్ట్‌ఫుల్‌నెస్ కన్హ శాంతివనంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరి మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో హర్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్ కమలేష్ డి పాటిల్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు డి శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపిలు డికె అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, స్థానిక బిజెపి, కాంగ్రెస్ నాయ కులు నెల్లి శ్రీవర్దన్‌రెడ్డి, అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్దన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, కొమ్ము కృష్ణ, ఎఎంసి డైరెక్టర్ సి నర్సింలు, మంకాల శ్రీశైలం తదితరులు ఉన్నారు.

## ఆర్‌టిసి ఆస్పత్రిలో డిఎన్‌బి పిజి మెడికల్ కోర్సులు

### మూడు విభాగాల్లో సీట్ల మంజూరు

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టిసి) అధ్వర్యంలో తార్నాకలో ఆర్‌టిసి ఉద్యోగులు, కార్మికుల కోసం ఆసుపత్రి కొనసాగుతోంది. తార్నాకలో కొనసాగుతున్న ఆసుపత్రిలో డిఎన్‌బి పిజి మెడికల్ కోర్సులకి అనుమతులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్ తార్నాకలోని టిజిఎస్‌ఆర్‌టిసి ఆసుపత్రిలో డిప్లొమేట్ ఆఫ్ నేషనల్ బోర్డ్ (డిఎన్‌బి) పిజి మెడికల్ కోర్సులకు అనుమతి లభించింది. మూడు విభాగాల్లో ఏడు సీట్లను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎంఎస్) మంజూరు చేసింది. డిఎన్‌బి పిజి మెడికల్ కోర్సులకు అనుమతి కోరుతూ ఎన్‌బీఈఎంఎస్‌కు టిజిఎస్‌ఆర్‌టిసి యాజమాన్యం దరఖాస్తు చేసింది. సంస్థలోని ఉద్యోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించేందుకు తమ ఆసుపత్రిలో పిజి మెడికల్ కోర్సులకు అక్రిడిటేషన్ ఇవ్వాలని ప్రతిపాదించింది. దరఖాస్తును సమగ్రంగా పరిశీలించిన ఎన్‌బీఈఎంఎస్.. జనరల్ మెడిసిన్‌లో 3 సీట్లను, జనరల్ సర్జరీలో 2 సీట్లను, ఆర్థోపెడిక్ సర్జరీలో 2 సీట్లను మంజూరు చేసింది. 3 సంవత్సరాల పిజి కోర్సులకు నీట్ ఆధారంగా, 2 సంవత్సరాల డిప్లొమా కోర్సులకు డీఎన్‌బీపీడీసీఈటీ ద్వారా ప్రవేశాలు జరుగుతాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ కోర్సులు ప్రారంభం కానున్నాయి. తార్నాక ఆసుపత్రిలో డిఎన్‌బి పిజి మెడికల్ కోర్సులకు అనుమతి లభించడంపై టిజిఎస్‌ఆర్‌టిసి యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. డిఎన్‌బి పిజి కోర్సులకు అనుమతి లభించడంతో .. ఆసుపత్రిలో వైద్య సేవలు మరింతగా బలోపేతమవుతాయని సంస్థ ఎండి విసి సజ్జనార్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కోర్సుల వల్ల నాణ్యమైన వైద్యులు ఆసుపత్రిలో ప్రాక్టీస్ చేస్తారని, ఇది ఆర్‌టిసి ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. సిబ్బందికి మెరుగైన వైద్యం అందించేందుకు తార్నాక ఆస్పతిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా ఆర్‌టిసి యాజమాన్యం తీర్చిదిద్దిందని గుర్తు చేశారు. ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలను అందించి సంపూర్ణ ఆరోగ్య ఆర్‌టిసిగా మార్చేందుకు యాజమాన్యం కృతనిశ్చయంతో ఉందన్నారు. డిఎన్‌బి పిజి మెడికల్ కోర్సులకు అనుమతి తీసుకురావడంలో కీలకపాత్ర పోషించిన మెడికల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శ్రీనివాస్, మాజీ ఓఎస్‌డీ డాక్టర్ సైదిరెడ్డి.. డాక్టర్లు సుస్మిత, ప్రమోద్ కుమార్, ప్రదీప్ కుమార్, రాజ్ కుమార్ లను టిజిఎస్‌ఆర్‌టిసి యాజమాన్యం అభినందించింది. హైదరాబాద్ బస్ భవన్‌లో సోమవారం ఆర్‌టిసి ఉన్నతాధికారులతో కలిసి ఎండి విసి సజ్జనార్ సన్మానించారు. కార్యక్రమంలో ఈడీ మునిశేఖర్, సీపీఎం ఉషాదేవి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజామూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి అక్రమాల్లో ఏడుగురు కార్యదర్శుల సస్పెన్షన్

### 120 మంది ఉద్యోగులకు నోటీసులు

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** పత్తి కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో పలువురు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల ఉద్యోగులు తారెత్తుతున్నారు. ఈ కుంభకోణానికి సంబంధించి వరంగల్ వ్యవసాయ మార్కెట్, జనగామ, చిన్నకోడూరు, చెన్నూర్, భద్రాచలం, పెద్దపల్లి, ఆదిలాబాద్ కు చెందిన ఏడుగురు వ్యవసాయ మార్కెటింగ్ కార్యదర్శులు సస్పెండయ్యారు. అలాగే మరో 120 మంది కింది స్థాయి సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం పత్తి కొనుగోళ్ల అక్రమాలపై విచారణను వేగవంతం చేయడంతో మరి కొందరు అక్రమార్కుల గుండెల్లో గుబులు మొదలైంది. కాగా రైతులకు తెలియకుండా నకిలీ పత్రాలతో పత్తి అమ్మకాలు చేసి అక్రమాలకు పాల్పడిన విషయమై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. పత్తి సాగు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయటంతో పాటు, నకిలీ టీఆర్ తాత్కాలిక రిజిస్ట్రేషన్ పుస్తకాలు ముద్రించి జిన్నింగ్ మిల్లర్లకు అప్పజెప్పటం, ఒక మండలంలో పనిచేస్తూ మరో మండలానికి చెందిన రైతుల పేరిట ధ్రువపత్రాలు ఇవ్వడం వంటి పలు అక్రమాలు జరిగినట్లు గుర్తించింది. ఈ అవినీతి అక్రమాల్లో కొందరు మార్కెటింగ్, వ్యవసాయ శాఖ ఏఈవోలు, ఏవోల పాత్ర ఉన్నట్లు బయటపడింది. వ్యవసాయ శాఖ జారీ చేసిన వేలాది సాగు ధ్రువీకరణ పత్రాలతో రైతుల నుంచి తక్కువ ధరకు పత్తి కొని, కనీస మద్దతు ధరకు సీసీఐకు అమ్మి అక్రమార్కులు లాభపడ్డారు. ఆదిలాబాద్, కొత్తగూడెం తదితర జిల్లాల్లో పత్తి సాగు చేసిన విస్తీర్ణానికి మించి విక్రయాలు జరిగాయి.

## 2,322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల రాతపరీక్ష ఫలితాలు విడుదల

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2,322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రాతపరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. 2,322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన పరీక్ష ఫలితాలను మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు సోమవారం విడుదల చేసింది. నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు 42,244 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 40,423 మంది రాతపరీక్షకు హాజరయ్యారు. హాజరైన అభ్యర్థుల మార్కుల వివరాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్‌లో సోమవారం అప్‌లోడ్ చేశారు. మెడికల్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో మార్కులను అందుబాటులో ఉంచామని, అభ్యర్థులు తమ మార్కుల వివరాలను చెక్ చేసుకోవాలని బోర్డు సోమవారం ప్రకటనలో తెలిపింది. త్వరలోనే ప్రొవిజనల్ మెరిట్‌లిస్టును విడుదల చేస్తామని మెడికల్ బోర్డు ప్రకటించింది.

## సబ్‌రిజిస్ట్రార్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

### టిఎన్‌జిఒ కేంద్ర సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** పెద్దఅంబర్‌పేట్ సబ్‌రిజిస్ట్రార్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని టిఎన్‌జిఒ కేంద్ర సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విధినిర్వహణలో ఉన్నా పెద్దఅంబర్‌పేట్ సబ్‌రిజిస్ట్రార్ ఎల్ రవీందర్‌పై సోమవారం శ్రీనివాస్‌యాదవ్ అనే వ్యక్తి దుర్భాషలాడుతూ దాడిచేసి అగౌరవపరిచిన ఘటనను సంఘం తీవ్రంగా ఖండించింది. అతనికి అభ్యంతరాలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి కానీ దాడి చేయడం హేయమైన చర్య అని టిఎన్‌జిఒ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్‌ఎం హుస్సేని ముజీబ్ మండిపడ్డారు. సబ్‌రిజిస్ట్రార్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్‌మెంట్ అదనపు ఇన్‌స్పెక్టర్ జనరల్ వెంకటరాజేశ్‌కు వినతిపత్రం సమర్పించినట్టు టిఎన్‌జిఒ నేతలు తెలిపారు. మంగళవారం డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డిజిపి)ని కూడా కలిసి ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్‌చేసి చర్యలు తీసుకోవాలని టిఎన్‌జిఒ నేతలు డిమాండ్ చేశారు.

# రైతుల ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వ ప్రోత్సాహం

### అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

### పాల్గొన్న వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**ధారూరు, మే 5, ప్రభాతవార్త:** రైతులు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసనసభాపతి, వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ, అన్నం పెట్టే అన్నదాతలకు కాపాడుకోవడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశమని, రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో వ్యవసాయం చేసేలా శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన కల్పించాలని వారు తెలిపారు. రైతులకు నాణ్యమైన వంగడాల ు అందించినట్లయితే నష్టాల బారిన పడకుండా ఉంటారని చెప్పారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎక్కువగా వర్షాధార పంటలపైనే ఆధారపడి ఉంటారని, రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు చేస్తూ పంట మార్పిడి వేసుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు శాస్త్రీయ పరిజ్ఞానంతో పంటలు పండించాలని, యూరియా, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని వారు సూచించారు. రైతులు ఉద్యానవన పంటల ు వేసే విధంగా ప్రోత్స హించాలని అన్నారు. భూసార పరీక్షలు నిర్వహించి వాటిక ుగుణంగా పంటలు సాగు చేయాలని మంత్రి తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు పంట బీమా ను వర్తింప చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇప్పటికీ రైతు బీమా, రైతు భరోసా కింద 33 వేల కోట్ల నిధుల ు మంజూరు చేయడం జరిగిందని వారు తెలిపారు. రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి మాట్లాడుతూ, ధరణి వల్ల లక్షల మంది భూమి హక్కు ను కోల్పోయారని, ఎన్నికల సమయంలో ధరణి స్థానంలో సమగ్ర రెవె న్యూ చట్టం తీసుక ువస్తామన్న మాట నిలబెట్టుకొని భూభారతి చట్టం ద్వారా భూమి హక్కులు కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి, జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ వాయిస్ ఛాన్సర్ జానయ్య, అడిషనల్ డైరెక్టర్ విజయకుమార్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్ రెడ్డి, రైతు సంక్షేమ కమిటీ సభ్యులు భూమి సునీల్, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామగుండంలో ఎరువుల ఉత్పత్తికి బ్రేక్

### నేటి నుండి 40 రోజులపాటు మరమ్మతులు

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** రాష్ట్ర రైతాంగానికి యూరియాను అందించే రామగుండం ఎరువుల కర్మాగారం ఈ నెల 6వ తేది నుంచి ఉత్పత్తి నిలిపివేస్తోంది. వార్షిక మరమ్మతుల కార ణంగా ప్లాంట్‌ను షట్‌డౌన్ చేస్తున్నారు. ఏప్రిల్ నెలలోనే షట్‌డౌన్ చేయాల్సి ఉండగా ఉత్పత్తి అవసరాల దృష్ట్యా ఈ నిర్ణయాన్ని ఇప్పటి వరకూ పొడిగించారు. ప్లాంట్‌లో కీలకమైన హీట్ ట్రాన్స్‌ఫర్ రిఫార్మర్ (హెచ్‌టీఆర్), అమ్మోనియా పైప్‌లైన్లు, ఇతర యంత్రాల మరమ్మతులు చేయనున్నారు. ఈ మరమ్మతు పనులను హెచ్‌టీఆర్‌కు సంబంధించి గోద్రేజ్ సంస్థ నిర్వహించ నుంది. సుమారు 30 నుంచి 40రోజుల పాటు ఈ మరమ్మతులు జరుగనున్నాయి. జూన్ 6 నుంచి 15వ తేదీలోగా ప్లాంట్‌లో తిరిగి ఉత్పత్తి దశలోకి వచ్చే అవకాశం ఉనట్లు ప్లాంటు అధికవర్గాలు వెల్లడించాయి. వర్షాకాల సీజన్ ప్రారంభ సమయానికి కానీ ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. కాగా గతేడాది రామగుండం ఎరువుల కర్మాగారంలో 11.94లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి జరిగితే రాష్ట్రానికే 4.68లక్షల టన్నులు సరఫరా చేసింది. మిగతా యూరియాను ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సరఫరా చేశారు. రామగుండం షట్‌డౌన్‌తో ఉత్పత్తి నిలిపి వేయడంతో వ్యవసాయశాఖలో కొంత టెన్షన్ మొదలైంది. సాధారణంగా ఏప్రిల్‌లో షట్‌డౌన్ చేసుకున్నా మే మాసంలో ఉత్పత్తి జరుగుతుంది కనుక వర్షాకాల సీజన్‌కు యూరియా అందుతుంది. ఈసారి మేలో షట్‌డౌన్ చేశారు.

### అర్హతలతో సంబంధం లేకుండా పూర్వ విఆర్‌ఎ, విఆర్‌ఒలకు

## జిపిఒలుగా అవకాశం కల్పించాలి

### ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన టిజిఆర్‌ఎస్‌ఎ

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** అర్హతలతో సంబంధం లేకుండా.. పూర్వ విఆర్‌ఎ, విఆర్‌ఒలకు జిపిఒలుగా అవకాశం కల్పించాలని తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసి యేషన్(టిజిఆర్‌ఎస్‌ఎ) నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టిజిఆర్‌ఎస్‌ఎ గౌరవ అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి సమక్షంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.భిక్షం సోమవారం రెవెన్యూ ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రం సమర్పించారు. రెవెన్యూ విభాగంలో నేరుగా వీఆర్‌ఏలుగా నియామకమై 2018–19లలో వీఆర్‌ఓలుగా 250 మంది పదోన్నతి పొందినట్టుగా గుర్తు చేశారు. వీరంతా కూడా ప్రస్తుతం వివిధ విభాగాల్లో సేవలు అందిస్తున్నారన్నారు. వీరంతా మళ్లీ రెవెన్యూ శాఖలోకి వచ్చి సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ జిపిఒల నియామకానికి సంబంధించిన జిఒలో పేర్కొన్న కొన్ని నిబంధనలు అడ్డుగా ఉన్నా యన్నారు. ఐదేళ్ల సర్వీసు అనే నిబంధన వీరికి తీవ్రఆటంకంగా మారిందని గుర్తు చేశారు. చాలామంది వీర్వోలు పదో తరగతి విద్య అర్హతతో అనేక సంవత్సరాల సేవలు అందించాంని, రెవెన్యూ శాఖలో వారి అనుభవాన్ని ఉపయోగించుకోవడానికి వారిని రెవెన్యూ శాఖలో జిపివోలుగా అవకాశం కల్పించాలన్నారు.

పూర్వ వీఆర్‌ఏ, వీఆర్‌ఓలలో చాలామంది ఇంటర్మీడియట్ నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిల వరకు విద్యార్హతలను కలిగి ఉన్నారన్నారు. గతంలో వారు రెవెన్యూ శాఖలో కొనసాగిన సమయంలో విధుల్లో సమగ్ర అనుభవాన్ని కలిగి ఉన్నారన్నారు.

భూ పరిపాలనతో వారికి పరిచయం ఉండటం వలన వారికి జీపీఓలుగా అవకాశం కల్పిస్తే అంకితభావంతో పనిచేస్తూ ముఖ్యంగా భూ భారతి చట్టం వచ్చిన నేపథ్యంలో వారు సమర్థవంతంగా పని చేస్తారన్నారు.

చాలామంది పూర్వ వీఆర్‌ఏ, వీఆర్‌ఓలు జీపీఓ పోస్టులకు వివిధ సాంకేతిక కారణాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేక పోయారన్నారు. ఇలాంటి కేసులను జిల్లా కలెక్టర్, సీసీఎల్‌ఏ పునఃపరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఐదు సంవత్సరాల సర్వీసు లేనప్పటికీ ఇతరత్రా అర్హత కలిగి ఉన్నవారందరికీ, పూర్వ వీఆర్‌ఓలకు జీపీఓలు చేసేందుకు కనీస విద్యార్హత పదో తరగతి చేయాలన్నారు. టీజీఆర్‌ఎస్‌ఏ వినతి పత్రంలో పేర్కొన్న అన్ని రకాల అంశాల పట్ల అధికారులు సానుకూలంగా స్పందించారన్నారు.

అతి త్వరలోనే అధికారంగా ప్రకటన రానున్నట్టుగా తెలిపారు. పూర్వ వీఆర్‌ఏ, వీఆర్‌ఓలకు అర్హతలతో సంబంధం లేకుండా గ్రామ పాలన అధికారులుగా(జీపీఓ) అవకాశం కల్పించాలని తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసి యేషన్(టీజీఆర్‌ఎస్‌ఏ) కోరింది.

# ఆన్‌లైన్‌లో నీరా ఉత్పత్తులు

### త్వరలో అందుబాటులోకి రానున్న వెబ్‌సైట్

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త :** నీరా, ఇతర తాటి ఉత్పత్తుల అమ్మకాల ద్వారా కల్లు గీత వృత్తి దారులకు లబ్ధి చేకూర్చేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గతంలోనే ఈ నీరా ఈ పథకం ఉన్నా.. దాని మరింత సమర్ధవంతంగా అమలు చేసేందుకు సన్నాహలు చేస్తున్నారు. ఇంటి వద్దకే నీరా వచ్చేలా ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక కార్పొ రేషన్ సంస్థ ఈకొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ర్యాపిడో, ఓలా వంటి ఈబైక్ సర్వీసెస్‌లో ఈ పార్సిల్ సర్వీసుల ద్వారా వినియోగదారులు కోరుకున్న చోటుకు నీరా డెలివరీ చేయ నున్నట్టు తెలిపారు. నీరా కావల్సి న వారు 9121815883, 9666988888 నంబర్లకు కాల్ చేసి, ఎంత కావాలో చెప్పి, యూపీఐ ద్వారా నగదు విక్రయానికి సిద్ధంగా ఉన్న నీరా టిన్లుచెల్లించి, లొకేషన్ పెడితే అక్కడికే తేనీరాను పంపుతామన్నారు. గతంలో బాటిళ్లలో నీరాను సరఫరా చేయగా, ప్రస్తుతం కోక్ మాదిరిగా 250 ఎంఎల్. 500 ఎంఎల్ టిన్ల మాదిరిగా సరఫరా చేస్తామంటున్నారు. ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకున్న ఈ టిన్స్ తోపాటు అవసరమైతే లీటర్ బాటిళ్లలో సరఫరా చేస్తున్నారు.

అవసరమైతే పబ్స్, రెస్టారెంట్లుకూ సరఫరా చేస్తామని నిర్వాహకులు చెబుతున్నారు. త్వరలో తేనీరా కోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందిస్తామని, ఉప ఉత్పత్తుల అమ్మకాలు నీరాతోపాటు ఇతర తాటి ఉత్ప త్తుల అమ్మకాల చేపట్టనున్నట్టు నిర్వా హకులు తెలిపారు. తాటి, ఈత బెల్లం, తాటి, ఈత సిరప్ పామ్ బూస్ట్, పామ్ గ్రా న్యూల్స్, తాటి ముంజలు, తాటి, ఈత పండ్లు, గేగులతోపాటు, ప్రత్యేకంగా తాటాకు, ఈతాకులతో తయారుచేసిన చాపలు, బుట్టలు, విసన కర్రలు, ఇంటి అలంకరణ వస్తువులను కూడా ఆన్లైన్ ద్వారా కూడా విక్రయిస్తామంటున్నారు. వీటి విక్రయంతో మరింత మంది గౌడ వృత్తిదారులకు ఉపాధి దొరుకుతుందని భావిస్తున్నామంటున్నారు. తాటి ఉత్పత్తుల విక్రయానికి సోషల్ మీడి యాను ఉపయోగించుకుంటామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మద్యం అమ్మకాలకు ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని నిర్ణయం తీసకున్న విషయం తెలిసిందే.

# మంత్రులకు 10 శాతం కమీషన్లు ఇవ్వాల్సిందేనా?

### కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా తప్పదా?

### కాంగ్రెస్ కార్యకర్తలకేనా ఇందిరమ్మ ఇళ్లు?

### బిజెపి ఎంపి ఈటల రాజేందర్




సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల మధ్య పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటికీ వాటిని చెల్లించలేదని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, అయినప్పటికీ మంత్రులకు మాత్రం 10 శాతం కమీషన్ ఇస్తున్న దయనీయ పరిస్థితి నెలకొందన్నారు.

అయినప్పటికీ వారు బిల్లులు పొందలేక గగ్గోలు పెడు తున్నారన్నారు. పోలీస్‌శాఖ, ఆర్‌టిసి ఉద్యోగులు దాచుకున్న తమ డబ్బులు తీసుకోలేని స్థితిలో ఉన్నారు. రుణాలు పొందలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇంత అసమర్థ పాలన సాగిస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కుదించేస్తున్న ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఈ రాష్ట్రాన్ని పరిపాలించే నైతిక హక్కు ఎక్కడుంది? అంటూ ప్రశ్నించారు. వృద్ధాప్య, దివ్యాంగులకు కొత్త పెన్షన్ల విషయం దేవుడెరుగు రాష్ట్రంలో పాత పెన్షన్లు రద్దు చేయడమే గానీ, కొత్త పెన్షన్లకు దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు వేసినా, నిజమైన అర్హులకు ఇళ్లు ఇవ్వకుండా, కాంగ్రెస్ కార్యకర్తలకే ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమిస్తారని హెచ్చరిస్తున్నామన్నారు.

రాష్ట్రంలో అకాల వర్షాల కారణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయిందని, రైతులు తీవ్ర నష్టంతో కన్నీళ్లు పెడుతున్నారన్నారు. తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కేంద్రం నిధులతో నిర్మించనున్న అభివృద్ధి పనులకు భూమిపూజలు, ప్రారంభోత్స వాలు జరుగుతున్నాయన్నారు. అమృత్ నగరాల పేరిట కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు. కొంపల్లి ప్రాంతంలో ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి కేంద్రానికి ప్రతిపాదన అందిస్తామన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలను మరింత తగ్గించేందుకు కేంద్రాన్ని మరిన్ని నిధులు కేటాయించాలని కోరుతామన్నారు.

బిసి జనాభా రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఉన్నా, కాంగ్రెస్ ఇటీవల చేసిన కులగణనలో వారి సంఖ్యను తక్కువగా చూపించి అన్యాయం చేసిందన్నారు. దేశానికి ఓబిసిని ప్రధానమంత్రిగా అందించిన ఘనత బిజెపికి దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యార్థులు, రైతులు, పేదల పట్ల ప్రయారిటీ లేదు. రెసిడెన్షియల్ స్కూళ్లను కిరాయికి తీసుకుని నడుపుతూ, వాటికీ కిరాయిలు చెల్లించని దౌర్భాగ్య స్థితి నెలకొందని మండిపడ్డారు.



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు వినతిపత్రం ఇస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, గణేష్‌చారి, బాలరాజుగౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్ తదితరులు

## గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో బిసి సంఘాల భేటీ

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** రాష్ట్ర అసెంబ్లీలో బిసిలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిసి బిల్లును గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఎలాంటి సవరణలు లేకుండా యధావిధిగా ఆమోదించి రాష్ట్రపతికి పంపించిన సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలోని బీసీ సంఘాల ప్రతినిధులు సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్రంలో బిసి ఉద్యమం రోజురోజుకు బలపడుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వంతో గవర్నర్ తమ విశిష్ట అధికారాలను ఉపయోగించి 42 బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందేలా, అలాగే దేశంలోని సామాజిక రిజర్వేషన్లపై విధించిన 50 పరిమితిని ఎత్తివేసేలా, కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు జాజుల వెల్లడించారు.

గవర్నర్ గారిని కలిసిన బీసీ ప్రతినిది బృం దంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కురుమ, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మణి మంజరిసాగర్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కక్షతోనే ఎసిబికి పట్టించారు..

### తెలంగాణ నాన్ గెజిటెడ్ సంఘం

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** వికారాబాద్ ఇఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీధర్‌ను కక్షపూరితంగా ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ ఎసిబికి పట్టించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలంగాణ నాన్ గెజి టెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. సోమవారం ఎక్సైజ్ భవన్‌లోని సమావేశ మందిరంలో ఎక్సైజ్ మినిస్టీయల్ ఉద్యోగుల సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వికారాబాద్‌లో ఎక్సైజ్ సూపరిండెంట్ కార్యాలయంలో పని చేసే శ్రీధర్‌కు హెడ్ కానిస్టేబుల్ టీఏ బిల్లులను మంజూరు ఫిబ్రవరిలో ఇవ్వగా ,మార్చిలో 3న హెడ్ కానిస్టేబుల్ బ్యాంక్ ఖాతాలో డబ్బులు పడ్డాయన్నారు సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్‌ను హెడ్ కానిస్టేబుల్ ఉద్దేశ పూర్వకంగా ఏసీబీకి ఏప్రిల్‌లో పట్టిడంపై టీఎన్జీఓస్ సంఘం నాయకులు వ్యతిరేకించారు. ఎస్‌టివో కార్యలయంలో బిల్లుల మంజూరులకు అందరు కానిస్టేబుళ్లు ఇచ్చిన రీతిలో మీరు డబ్బులు ఇవ్వాలని అడిగినందుకు శ్రీధర్‌ను ఏసీబీకి పట్టించడం సరికాదంటున్నారు. ఎక్సైజ్ శాఖలో అందరు కలిసిమెలిసి ముందుకు సాగుతున్న తరుణంలో ఇలాంటి ఘటన ఉద్యోగులందరిలో భయాందోళనలు చోటు చేసుకున్నాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ఎక్సైజ్ శాఖలోని ఇక నుంచి ఎవ్వరి టీఏ బిల్లులను మినిస్ట్రియల్ సీనియర్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సూపరిండెంట్లు చేయమని నిర్ణయం తీసుకున్నట్లు టిఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ తెలిపారు.




సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

## 60 యేళ్లు పాలించిన కాంగ్రెస్ కులగణన ఎందుకు చేయలేదు?

### తెలంగాణలో కులగణన అంతంతమాత్రమే

### బిజెపి ఎంపి ఆర్. కృష్ణయ్య

**హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త:** కులగణన చేపట్టాలని బిసి సంఘాల నేతలుగా తాము ఎప్పటి నుంచో పోరాటం చేస్తున్నామని బిజెపి ఎంపి ఆర్ కృష్ణయ్య అన్నారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. 2010లో కులగణన చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి, తూతూ మంత్రంగా సర్వేచేసి వదిలి పెట్టారన్నారు. బిజెపి ప్రభుత్వం వచ్చిననాటి నుంచి ఈ విషయంపై ప్రధాని మోడీని పలు మార్లు కలిసి విన్నవించామని అన్నారు. నరేంద్రమోడీ సర్కారు జనగణనలో కులగణన చేయాలని నిర్ణయించిందని తెలిపారు. అంతేగాక దేశం కోసం, దేశ ప్రజల కోసం నరేంద్ర మోడీ సర్కారు ఇంత చేస్తుంటే ఇదంతా మా ఒత్తిడి వల్లే జరిగిందని కాంగ్రెస్ నాయకులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను కాంగ్రెస్ నాయకులను ఒకటే అడుగుతున్నానని, 60 యేళ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ కులగణన ఎందుకు చేయలేదు? అని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా అనేకసార్లు ధర్నాలు, నిరసనలు జరిగినా కాంగ్రెస్ కులగణన సర్వే ఎందుకు చేపట్టలేదు? అని ఆర్.కృష్ణయ్య నిలదీశారు.

## అందాల పోటీల మీదున్న శ్రద్ధ సిఎం రేవంత్‌రెడ్డికి రైతు అవస్థలపై లేదు

### పంటలు నష్టపోయిన వారిని వెంటనే ఆదుకోవాలి

### మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** అందాల పోటీలమీద ఉన్న శ్రద్ధ సిఎం రేవంత్‌రెడ్డికి రైతుల అవస్థలపై లేదని.. కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న రైతు మరణాలు ము మ్మాటికి ప్రభుత్వ హత్యలేనని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని సోమవారం పరిశీలించి రైతులను పరామర్శించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న రైతుల మరణాలకు సిఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి నాగేశ్వరరావే బాధ్యులన్నారు. అందాల పోటీలపై పోటీపడి సమీక్షలు నిర్వహిస్తున్న నాయకులకు కొనుగోలు కేంద్రాల్లోనే కుప్పకూలుతున్న రైతుల గుండెకోత వినిపించడం లేదా అని ప్రశ్నించారు. బోనస్ భారం తగ్గించేందుకు కొర్రీలు పెడుతున్నారని.. సర్కారు, మిల్లర్లు కలిసి డబుల్‌గేమ్ ఆడుతూ రైతులను నిండా ముంచుతున్నారని తెలిపారు. పంట కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు వేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.500 కోట్ల పంట బోనస్ తక్షణమే విడుదల చేయాలన్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు.

6-5pg10exM.qxd:6-5pg10exM.qxd 01/01/01 7:44 AM Page 1



# సెంచరీ ముందు బోల్తా


ఆయూష్ మాత్రే


ప్రభ్ సిమ్రనే


రియాన్ పరాగ్

## ముగ్గురు యంగ్‌స్టర్స్ మిస్

## మూడు మ్యాచుల్లో పరిణామం

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)-2025, సీజను 18 రసవత్తరంగా సాగుతోంది. హోరాహోరీగా సాగుతున్న మ్యాచ్‌లు అభిమానులకు ఫుల్ మజానిస్తున్నాయి. యంగ్ ప్లేయర్ల నుంచి సీనియర్ల వరకూ సత్తా చాటుకుంటున్నారు. ముఖ్యంగా యువ ఆటగాళ్లు ప్రతీ బంతిని బౌండరీ దాటించాలని ప్రయత్నిస్తున్నారు. సెంచరీ బాదేసి ప్రపంచానికి తమ సత్తా ఏంటో చూపించాలని తహతహలాడుతున్నారు. ఈ నేపథ్యంలో 48 గంటల్లో జరిగిన మూడు మ్యాచ్‌ల్లో ముగ్గురు యంగ్‌స్టర్లు సెంచరీ ముంగిట బోల్తా పడ్డారు. చిన్నస్వామి వేదికగా ఆర్సీబీతో ఈ నెల 3న జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ యువ సంచలనం ఆయూష్ మాత్రే అదరగొట్టాడు. 214 పరుగుల భారీ ఛేదనలో ఆయూష్ పోరాటం వల్లే సీఎస్కే విజయం అంచుల దాకా వెళ్లింది. 17 ఏళ్ల ఆయూష్ ఐపిఎల్‌లో ఆడుతుంది నాలుగో మ్యాచే అయినా ఛేజింగ్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. ఒత్తిడిలో పరిస్థితులను తట్టుకొని మరీ అదరగొట్టాడు. మాత్రే 48 బంతుల్లోనే 94 పరుగులు చేశాడు. ఎంగ్డి బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించి క్యాచౌట్ అయ్యాడు. అలా కెరీర్‌లో తొలి సెంచరీని 6 పరుగుల తేడాతో మిస్ చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో సిఎస్కే పరుగుల తేడాతో ఓడింది. ఇక రాజస్థాన్ రాయల్స్ యంగ్ ప్లేయర్ రియాన్ పరాగ్ ఆదివారం నాటి కోల్‌కతా మ్యాచ్‌లో సూపర్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. 207 పరుగుల ఛేదనలో రాజస్థాన్ 8 రన్స్‌కే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

ఈ దశలో పరాగ్ సూపర్ ఇన్నింగ్స్‌తో రాజస్థాన్‌ను మళ్లీ గేమ్‌లోకి తీసుకొచ్చాడు. అద్భుత బ్యాటింగ్‌తో జట్టును విజయం వైపునకు నడిపించాడు. ఈ క్రమంలోనే 90ల్లోకి ఎంట్రీ ఇచ్చాడు. పరాగ్ క్రీజులో ఉన్నంతసేపు రాజస్థాన్‌దే విజయం. కానీ 95 వ్యక్తిగత పరుగుల వద్ద పరాగ్‌ను హర్షిత్ రానా చక్కటి బంతితో బోల్తా కొట్టించి పెవిలియన్ చేర్చాడు. దీంతో పరాగ్ ఇన్నింగ్స్ ముగిసింది. ఐపీఎల్‌లో తొలి సెంచరీకి 5 పరుగుల దూరంలో నిలిచిపోయాడు. ఆఖర్లో కోల్‌కతా అద్భుతంగా బౌలింగ్ చేసి 1 పరుగు తేడాతో విజయం సాధించింది. కాగా సొంతగడ్డపై ఈ నెల 4న జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై పంజాబ్ ఘన విజయం సాధించింది.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ 236 పరుగులు చేసింది. పవర్ ప్లే లోనే 2 వికెట్లు పడినా పంజాబ్ ఈ స్థాయి స్కోరు సాధించిందంటే కారణం ప్రభ్ సిమ్రనే. ఓపెనర్‌గా వచ్చిన ఈ యువ సంచలనం మొదట్నుంచి బాదుడు మీదే ఉన్నాడు. రన్‌రేట్ 10కి తగ్గకుండా చూసుకుంటూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ క్రమంలోనే సెంచరీకి చేరువయ్యాడు.

అయితే 91 వ్యక్తిగత పరుగుల వద్ద ప్రభ్‌ను దిగ్వేశ్ రాఠీ పెవిలియన్ చేర్చాడు. చివర్లో శశాంక్ సింగ్ మెరుపులతో పంజాబ్ భారీ స్కోర్ నమోదు చేసింది.



## మాడ్రిడ్ ఓపెన్ సబలెంకా సొంతం

### కోకో గౌఫ్‌పై సంచలన విజయం

**న్యూఢిల్లీ:** ప్రపంచ అగ్రశ్రేణి ప్లేయర్ కోకో గౌఫ్‌తో జరిగిన పోరులో అరినా సబలెంకా సంచలన విజయం సాధించింది. కోకో గౌఫ్‌పై 6-3, 7-6 (7-3) తేడాతో ఉత్కంఠభరితమైన విజయంతో తన మూడవ మాడ్రిడ్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకుంది. గౌఫ్ ఇగా స్వియాటెక్‌పై ఫైనల్‌లో అద్భుతమైన విజయం సాధించడం ద్వారా ఆకట్టుకుంది. దీంతో మూడు మాడ్రిడ్ ఓపెన్ టైటిళ్లను గెలుచుకున్న ఏకైక క్రీడాకారిణిగా పెట్రా క్విటోవాతో అరినా సబలెంకా చేరింది. ప్రపంచ నంబర్ వన్ సబలెంకా తొలి సెట్‌లో ఆధిపత్యం చెలాయించింది, కానీ హెచ్చుతగ్గుల మధ్య సాగిన రెండో సెట్‌లో గౌఫ్ బలవంతంగా టైబ్రేక్ ఇవ్వడంతో ఛాంపియన్‌షిప్ పాయింట్‌ను వృధా చేసుకుంది. దీంతో 30 తేడాతో గౌఫ్ కోలుకుని 3-3తో ఆధిక్యంలోకి వెళ్లడంతో మ్యాచ్‌పై పట్టు సాధించేందుకు ఇరువురూ తీవ్ర యత్నాలు చేశారు. కానీ డబుల్ ఫాల్ట్ 26 ఏళ్ల సబలెంకాకు విజయాన్ని అందించింది. ఫలితంగా బెలారసియన్ సబలెంకా ప్రపంచంలోనే అత్యుత్తమ క్రీడాకారిణిగా నిలిచింది. ఇక సబలెంకా అద్భుతమైన ఆరంభాన్ని ఇచ్చింది, ఇందులో వరుసగా 17 పాయింట్లు గెలిచింది, కానీ గౌఫ్ ధైర్యంగా కోలుకోవడంతో ఆమె రెండవ సెట్‌లో 5-3 ఆధిక్యంలోకి వచ్చింది. 21 ఏళ్ల అమెరికన్ క్రీడాకారిణి ఆరు బ్రేక్ పాయింట్లను కాపాడుకుని సబలెంకా 5-5తో ఆధిక్యంలోకి వెళ్లిన తర్వాత ఆమె పునరాగమనాన్ని అడ్డుకుంది. కానీ సబలెంకా 2025లో ఇప్పటివరకు ఆరోసారి జరిగిన ఫైనల్లో ఒత్తిడిలో తన పట్టును నిలుపుకుంది, బ్రిస్బేన్ మరియు మియామిలలో ఆమె విజయాలకు మాడ్రిడ్ టైటిల్‌ను జోడించింది. కాగా మాడ్రిడ్‌లో ఆమె మునుపటి విజయాలు 2021 మరియు 2023లోవచ్చాయి. అలాగే ఆమె 2024లో స్వియాటెక్‌తో రన్నరప్‌గానిలిచింది. టోర్నమెంట్‌లో అత్యధిక విజయాల కోసం ఆమె చెక్ క్రీడాకారిణి పెట్రా క్విటోవా (2011, 2015, 2018)తో సమానంగా ఉంది. ప్రపంచ నంబర్ 1 11,000 కంటే ఎక్కువ ర్యాంకింగ్ పాయింట్లను సాధించిన మూడవ మహిళగా సబలెంకా అవతరించింది.

## తెలంగాణ అమ్మాయికి 3 పతకాలు

### జిమ్నాస్టిక్స్‌లో రెండు స్వర్ణాలు, ఒక రజతం



**న్యూఢిల్లీ:** తెలంగాణకు చెందిన యువక్రీడాకారిణి, జిమ్నాస్టిక్స్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తోంది. పుణెలో జరిగిన జాతీయ సీనియర్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్‌లో, ఒకే రోజు మూడు పతకాలు గెలిచి నిష్క అగర్వాల్ సంచలనం సృష్టించింది. నిష్క అగర్వాల్ వాల్టింగ్ టేబుల్, ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, బ్యాలెన్సింగ్ బీమ్ విభాగాల్లో స్వర్ణం మరియు రజత పతకాలు గెలిచింది. ఈ చాంపియన్‌షిప్‌లో రెండు గోల్డ్ సహా, మూడు పతకాలను సాధించి తన సత్తా చాటింది. ఢిల్లీలో ముగిసిన ఈ మెగా టోర్నీలో నాలుగు ఈవెంట్లలో పోటీ పడ్డ నిష్క అగర్వాల్ మూడింటిలో పతకాలు గెలిచింది. ఫ్లోర్ ఎక్సర్సైజ్ విభాగంలో 11.433 స్కోరుతో టాప్ ప్లేస్‌తో గోల్డ్ నెగ్గింది. తర్వాత ఇదే చాంపియన్‌షిప్‌లో వాల్టింగ్ టేబుల్ విభాగంలో మంచి ఆధిక్యత కనపరచి 12.883 స్కోరుతో మరో స్వర్ణ పతకాన్ని ఖాతాలో వేసుకుంది. వీటితో పాటు, మరో మారు బ్యాలెన్సింగ్ బీమ్ విభాగంలో పోటీ పడ్డ నిష్క అగర్వాల్ 10.967 స్కోరుతో రెండో ప్లేస్‌తో సిల్వర్ మెడల్‌ను గెలిచింది. కాగా డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో నిష్క అరంగేట్రం చేసింది. టేబుల్ వాల్ట్‌లో స్వర్ణం, జిమ్నాస్టిక్స్ ఆల్ రౌండ్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించింది. అలాగే ఉజ్బెకిస్థాన్‌లో జరిగిన ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో నిష్క టేబుల్ వాల్ట్ ఈవెంట్‌లో ఆమె స్వర్ణం గెలిచింది. ఇక జాతీయ టోర్నీలో రాణించడం ద్వారా కొరియాలో జూన్ 12 నుంచి మొదలయ్యే ఏషియన్ చాంపియన్‌షిప్‌కి ఎంపికైంది.

## ఐసిసి ర్యాంకింగ్స్‌లో..

# టి20, వన్డేల్లో టాప్‌లో భారత్

## టెస్టుల్లో ఆస్ట్రేలియాదే పైచేయి

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ క్రికెట్‌లో టీమిండియా, ఆస్ట్రేలియా క్రికెట్ జట్లు అన్ని ఫార్మాట్లలో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయి. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) సోమవారం విడుదల చేసిన వార్షిక ర్యాంకింగ్స్ ప్రకారం గత ఏడాది మే నుండి ఇప్పటి వరకు జరిగిన అన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లను 100 శాతం బేస్‌గా తీసుకుని, గత రెండు సంవత్సరాల మ్యాచ్‌లను 50 శాతం విలువతో లెక్కించి ఈ ర్యాకింగ్స్‌ను విడుదల చేసింది. ఈ ర్యాంకింగ్స్‌లో భారత్ టి20, వన్డే ఫార్మాట్లలో అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా, టెస్ట్ క్రికెట్‌లో మాత్రం ఆస్ట్రేలియా తన సింహాసనాన్ని మళ్లీ కైవసంచేసుకుంది. వన్డేల్లో భారత్ 124రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా (రెండు జట్లు 109 పాయింట్లు) భారత్‌కు వెనుకంజలో ఉన్నా, శ్రీలంక, పాకిస్తాన్ (104పాయింట్లు) కూడా పోటీగా నిలుస్తు న్నాయి. ఈజాబితాలో దక్షిణాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్, ఇంగ్లాండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్ వంటి జట్లు దిగువ స్థానాల్లో ఉన్నాయి. అదే విధంగా టి20 ఫార్మాట్‌లోనూ భారత్ తన ఆధిపత్యాన్ని మరింత బలంగా చూపించింది. ఇటీవలే టి20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు 271 రేటింగ్ పాయింట్లతో టాప్‌లో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్ ఉన్నారు. దక్షిణాఫ్రికా, శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ వరుసగా ఆరు నుండి పదవ స్థానాల్లో ఉన్నాయి. ఇక ప్రస్తుతం వరల్డ్ టెస్ట్ చాంపి యన్‌షిప్ విజేత అయిన ఆస్ట్రేలియా 126 రేటింగ్ పాయిం ట్లతో టెస్ట్ ఫార్మాట్‌లో నంబర్ వన్ జట్టుగాఉంది. ఇక ఈ ఏడాది ఆస్ట్రేలియాతో ఫైనల్‌లో తలపడనున్న దక్షిణాఫ్రికా 111 పాయింట్లతో మూడవ స్థానంలో ఉండగా, భారత్ నాల్గవ స్థానానికి పడిపోయింది. న్యూజిలాండ్, శ్రీలంక, పాకిస్తాన్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, ఐర్లాండ్ జట్లు వరుసగా టాప్ 10లో స్థానం పొందాయి.

## ఆస్ట్రేలియా పర్యటనలో..

## భారత్ మహిళా జట్టుకు ఒక విజయం

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో జరిగిన మూడో గేమ్‌లో నవనీత్ కౌర్ ఏకైక గోల్ చేయడంతో భారత మహిళా హాకీ జట్టు ఒకే ఒక విజయంతో సరిపెట్టుకుంది. పెర్త్ హాకీ స్టేడియంలో జరిగిన చివరి మ్యాచ్‌లో భారత మహిళల హాకీ జట్టు ఆస్ట్రేలియా జట్టును 10 తేడాతో ఓడించి ఆస్ట్రేలియా పర్యటనను ముగించింది. భారత ఫార్వర్డ్ నవనీత్ కౌర్ 21వ నిమిషంలో ఏకైక గోల్ చేసి ఈ పర్యటనలో ఏకైక విజయాన్ని నమోదు చేసింది. మొదటి క్వార్టర్‌లో ఆస్ట్రేలియా ఆధిపత్యం చెలాయించడంతో పాటు, రెండు పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకుంది. అయితే, భారత రక్షణ 0-0తో స్కోరును నిలుపుకునేందుకు బలంగా నిలిచింది. రెండవ క్వార్టర్‌లో నవనీత్ ఆటలోని ఏకైక గేమ్‌ను స్కోర్ చేయడంతో భారతదేశం ఆధిక్యంలో నిలిచింది. రెండవ అర్ధభాగంలో ఇరు జట్లు గోల్ సాధించాలని తీవ్ర ప్రయత్నాలు చేశాయి, కానీ భారత్ జట్టు పట్టుదలతో గోల్ చేసి తమ స్వల్ప ఆధిక్యాన్ని విజయవంతంగా కాపాడుకుంది. చివరి క్వార్టర్‌లో, ఆస్ట్రేలియాకు కీలకమైన పెనాల్టీ కార్నర్ లభించింది, అయితే, వారు స్కోరును సమం చేసే అవకాశాన్ని వృధా చేసుకుని, విజయాన్ని భారత్ జట్టుకు అప్పగించింది. కాగా ఆస్ట్రేలియా మహిళల హాకీ జట్టుతో జరిగిన మొదటి రెండు ఆటల్లో భారత్ 0-2 మరియు 2-3 తేడాతో ఓడిపోయింది.

వాణిజ్యం

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మే 5:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో మగిశాయి. విదేశీ మదుపర్ల కొనుగోళ్లు, అంతర్జాతీయంగా వాణిజ్య ఘర్షణలు తగ్గుముఖం పట్టిన వేళ మన సూచీలు రాణించాయి. భారత్ అమెరికా మధ్య కూడా త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరొచ్చన్న అంచనాలు కూడా ఇందుకు తోడయ్యాయి. అంతర్జాతీయ విపణిలో క్రూడాయిల్ సరఫరాను పెంచేందుకు ఒపెక్‌ప్లస్ దేశాలు నిర్ణయించడంతో చమురు ధరలు భారీగా తగ్గాయి. ఇది కూడా సెంటిమెంట్‌ను బలపరిచింది. అదానీ గ్రూప్ షేర్లతో పాటు ఎంపిక చేసిన బ్యాంక్, ఆటో షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. సెన్సెక్స్ ఉదయం 80,661.62 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 81,049.03 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 294.85 పాయింట్ల లాభంతో 80,796.84 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 114 పాయింట్ల లాభంతో 24,461.15 వద్ద స్థిరపడిం ది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.27గా ఉంది. అదానీ పోర్ట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎటర్నల్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కోటక్ మహీంద్రా, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, టైటాన్, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 60 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు ధర 3,318 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## ఇక అమెరికాకు భారత్ 'ఆపిల్'

**వాషింగ్టన్, మే 5:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌ల కారణంగా ఆ దేశ మార్కెట్‌ను భారత్ తయారీ ఆపిల్ ఫోన్లు ఆక్రమించ నున్నాయి. ఈ ఏడాది జూన్ త్రైమాసికం నాటికి భారత్‌లోని ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రా నిక్స్ ఫ్యాక్టరీల నుంచి కనీసం 12 14 బిలియన్ డాలర్ల ఫోన్లను అక్కడికి ఎగుమతి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ త్రైమాసికం తర్వాత కూడా ఇదే స్థాయిలో ఎగుమతులు చేయగలిగితే 2026 ఆర్థిక సంవత్సరానికి 40 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లు భారత్ ఎగుమతి చేసినట్లు అవుతుంది. మన దేశంలో తయారయ్యే 100 యాపిల్ ఫోన్లలో 80 ఫోన్లు అమెరికాకే చేరనున్నాయి. 2024లో జూన్ త్రైమాసి కంలో దాదాపు 1.1 కోట్ల ఐఫోన్లు విక్రయించాం. అంటే సగటున ఒక దాని ధర 1,100 బిలి యన్ డాలర్లు అనుకొన్నా దాని విలువ 12.1 బిలియన్ డాలర్లు. వాస్తవానికి ఆపిల్ అతి తక్కువ విక్రయాలు జరిపింది ఆ త్రైమాసికం లోనే. అంటే ఈసారి 12 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విక్రయిం చొచ్చు. ఇక భారత మార్కెట్లో ఈ ఫోన్ల డిమాండ్ చాలా వేగంగా పెరుగుతోంది అని ఓ నిపుణుడువెల్లడించాడు. ఇటీవల కంపెనీ సీఈవో టిమ్‌కుక్ కూడా ఈ విషయాన్ని వెల్లడించారు. అమెరికా మార్కెట్లో జూన్ త్రైమాసికంలో విక్రయించే ఐఫోన్లలో అత్యధికంగా భారత్‌లో తయారైనవే ఉంటాయని.. అదేఐపాడ్స్, మ్యాక్‌బుక్, యాపిల్ వాచ్‌లు, ఎయిర్‌పాడ్స్ వంటివి మాత్రం వియత్నాంనుంచి దిగుమతి చేసుకొంటామన్నారు. గతంలో భారత్‌లో తయారు చేసిన ఐఫోన్లు యూకే, తుర్కియే, జపాన్ వంటి మార్కెట్లకువెళ్లేవి. కానీ, వాటిని ఇప్పుడు రీరూట్ చేశారు. ఇప్పుడు ఎగుమతుల డిమాండ్‌ను అందుకోవా లంటే యాపిల్ భారత్‌లో ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 22 బిలియన్ డాలర్ల నుంచి గణనీయంగా పెంచాల్సి ఉంటుంది.

## అతిథ్య రంగంలో కోటిన్నర ఉద్యోగాలు



**న్యూఢిల్లీ, మే 5:** ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లభిస్తే దేశీయంగా రెస్టారెంట్ రంగం 2028 నాటికి 1.5 కోట్ల మందికి ఉద్యోగావకాశాలు కల్పించగలదని నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఎఐ) వైస్ ప్రెసిడెంట్ జొరావర్ కల్రా తెలిపారు. ఇందుకోసం పరిశ్రమ హోదా కల్పించాలని, జిఎస్‌టిపై ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ ప్రయోజనాల్లాంటివి ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం 85లక్షల మంది ఈ రంగంలో ఉద్యోగావకాశాలు పొందుతున్నా రు. ఎన్ఆర్ఎఐలో సుమారు 5 లక్షల రెస్టారెంట్లకు సభ్యత్వం ఉంది. సొంత ప్రైవేట్- లేబుల్ బ్రాండ్లతో క్విక్ కామర్స్ విభాగం లో దూసుకెళ్లిపోతున్న స్విగ్గీ, జొమాటో లాంటి ఫుడ్ డెలివరీ అగ్రిగేటర్లతో నెలకొన్న వివాదం సామరస్యంగా సద్దుమణుగుతుందని కల్రా ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా ఇండియా ఫుడ్‌సర్వీ సెస్ రిపోర్ట్ 2024అంచనా ప్రకారం ఈరంగం విలువ 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.5,69 లక్షల కోట్లు. ఇది 2028 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.7.76 లక్షల కోట్లకు పెరుగు తుందని అంచనా వేసింది. రెస్టారెంట్ రంగా న్ని అభివృద్ధి చేసే సాంకే తిక అంశాలను నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ రంగం ప్రపంచ ఆర్థికవ్యవస్థలో డైనమిక్‌గా వ్యవహరిస్తోం ది. వీటి కార్యకలాపాలను పెంచడంలో సాంకేతికత కీలకపాత్ర పోషిస్తుంది. డిజిటల్ పేమెంట్ సొల్యూషన్స్, ఇది క్లౌడ్-ఆధారిత నిర్వహణ సాఫ్ట్‌వేర్‌లో ట్రాకింగ్‌ను క్రమబద్ధీకరించడానికి, వ్యర్థాలు, నిర్వహణ ఖర్చులను తగ్గించడానికి సహాయపడుతుంది.

## డాలర్‌కు ప్రమాదం: వారెన్ బఫెట్

**ముంబై, మే 5:** ప్రపంచ దిగ్గజ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ తాజాగా జరిగిన తన కంపెనీ బర్క్‌షైర్ హాత్‌వే వాటాదారుల సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న అమెరికా ఆర్థిక లోటుపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, పెట్టుబడిదారులు అమెరికా డాలర్‌ను కాకుండా ఇతర కరెన్సీల్లో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. అమెరికా ఆర్థికలోటు సమస్య ఎప్పటి నుంచో పరిష్కారం లేకుండా పోయిందని, భవిష్యత్తులోనూ మరో 2లేదా 20 యేళ్లయినా ఇలాగే ఉంటుందేమో అన్నారు. అమెరికా ఆర్థిక లోటు నిలకడలేనిదని, నియం త్రించలేని స్థాయికి చేరిందని వారెన్ బఫెట్ వాటాదారు లతో చెప్పారు. ప్రస్తుతం అమెరికా ఆర్థికలోటు 7శాతం ఉంది. ట్రంప్ ప్రభుత్వాన్ని ప్రస్తావించకుండానే, వాణిజ్యాన్ని ఆయుధంగా ఉపయోగించకూడదని బఫెట్ అభిప్రాయపడ్డారు. డాలర్‌కు సంబంధించి, పతనమయ్యే అవకాశంఉన్న కరెన్సీని ఏపెట్టుబడిదారులు కొనలేరు. చాలామంది ఇన్వెస్టర్లలో ఇతర కరెన్సీని ఏ పెట్టుబడి పెట్టాలనే ఆలోచన పెరిగిందని తెలిపారు. అమెరికా ఆర్థిక విధానాలు, పెరుగుతున్న అధికార అసమర్థత, వాణిజ్య విధానం రాజకీయ ఆయుధంగా మారుతుండడం వంటిఅంశాలు డాలర్‌పై ప్రతి కూల ప్రభావం చూపుతున్నాయని బఫెట్ వివరించారు.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14